సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 242

బుధవారం 23-11-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతిపల్లెలోనూ అందరికీ గ్యాస్ సరఫరా, ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా నా ధ్యేయం'

రాష్ట్ర వ్యాప్తంగా మన భూములు, మన ఆస్తుల పరిరక్షణకు మహా యజ్ఞాన్ని చేపట్టిన జగనన్న ప్రభుత్వం..

ఈ భూ యజ్ఞం మన కోసం..
ఎవరూ సవాలు చేయలేని హక్కులు మనకివ్వడం కోసం...
భావితరాలకు వివాదాలు లేని ఆస్తి ఇవ్వడం కోసం....

భూ వివాదాలకు ఇక చరమ గీతం..
భూ లావాదేవీలు ఇకపై సులభతరం, వివాద రహితం..
ప్రభుత్వ హామీతో కూడిన శాశ్వత భూ హక్కు పత్రం..

"వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూరక్ష పథకం"



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి

"మీ భూమి-మా హామి"

100 సం॥ల తర్వాత.. దేశంలో ఎక్కడాలేని విధంగా

చేపట్టిన ఆధునిక సమగ్ర భూ రీసర్వేలో భాగంగా 2000 గ్రామాల్లోని 7,92,238 మంది భూ యజమానులకు భూ హక్కు పత్రాలను నేటి నుండి 15 రోజులపాటు అందజేసే కార్యక్రమాన్ని నేడు శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో ప్రారంభిస్తున్న గౌ. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి...

రీ సర్వే షెడ్యూల్

రీ సర్వే, భూహక్కు పత్రాల జారీ, అందుబాటులోకి గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు..	పూర్తి కానున్న గ్రామాలు మరియు పట్టణాల సంఖ్య
23 నవంబర్, 2022 నాటికి	2,000
ఫిబ్రవరి, 2023 కి	4,000
మే, 2023 కి	6,000
ఆగస్టు, 2023 కి	9,000
అక్టోబర్, 2023 కి	13,000
డిసెంబర్, 2023 కి	17,584
	(రాష్ట్రంలోని మొత్తం గ్రామాలు, పట్టణాలు)

డిసెంబర్ 2023 నాటికి దశలవారీగా రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో భూముల రీసర్వే పూర్తి.. శాశ్వత భూ హక్కు పత్రాల జారీ..

భూ రికార్డుల ప్రక్షాళన..

భూ కమతం ఒక సర్వే నెంబర్ క్రింద ఉండి, కాలక్రమేణా విభజన జరిగి చేతులు మారినా కూడా సర్వే రికార్డులు అప్ డేట్ కాకపోవడంతో వస్తున్న భూ వివాదాలు, ఇంకా ఇతరత్రా వివాదాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఇబ్బందులు ఎదురయ్యే గత పరిస్థితికి ఇక చెల్లు చీటీ.. రీసర్వే ద్వారా భూ రికార్డులను ప్రక్షాళన చేసి ప్రతి భూకమతానికి విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించి మీ రికార్డులను సురక్షితంగా, వివాదరహితంగా మీకు అందజేస్తున్న జగనన్న ప్రభుత్వం..

72.33 mts — 45.60 mts

① అత్యాధునిక సాంకేతికత...

- 10,185 గ్రామ సర్వేయర్లు, 3,664 వార్డు ప్లానింగ్ సెక్రటరీల నియామకం... రూ.1000 కోట్ల వ్యయం, 4,500 సర్వే బృందాలు, ఎయిర్ క్రాఫ్ట్‌లు, హెలికాప్టర్లు, డ్రోన్లు, 70 కార్స్ బేస్ స్టేషన్లు, 2,000 రోవర్ల ద్వారా అత్యాధునిక సాంకేతికతతో రీసర్వే..
- ప్రతి భూకమతాన్ని సర్వే చేసి అత్యంత ఖచ్చితత్వంతో అక్షాంశ, రేఖాంశాలు, విశిష్ట గుర్తింపు సంఖ్య, సమగ్రంగా భూ వివరాలు తెలిపే QR కోడ్‌తో కూడిన భూ కమత పటం భూ యజమానులకు జారీ...
- గ్రామ స్థాయిలో భూ రికార్డులన్నీ క్రోడీకరించి తయారు చేసిన మ్యాపులు (భూ కమతాలతో కూడిన గ్రామ పటం), ఇతర భూ రికార్డులు ఇక మీ గ్రామాల్లోనే అందుబాటు.. టాంపరింగ్‌కు ఏమాత్రం అవకాశం లేకుండా ఫిజికల్ మరియు డిజిటల్ పద్ధతిలో భూ రికార్డులు ఇక మీ గ్రామాల్లోనే భద్రం..

34.32mts — 41.39mts

② భూ రక్ష...

- ప్రతి భూకమతానికి ఉచితంగా భూరక్ష హద్దు రాళ్ళు..
- డూప్లికేట్, మోసపూరిత రిజిస్ట్రేషన్‌లకు ఇక చెక్..

44.62mts — 69.84mts

③ శాశ్వత భూ హక్కు..

- జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూరక్ష క్రింద అందించే భూ సంబంధిత సేవలన్నీ గ్రామ సచివాలయాల్లో సింగిల్ డెస్క్ ద్వారా అందజేత.. ప్రతి స్థిరాస్తికి ప్రభుత్వ హామీతో కూడిన శాశ్వత భూ హక్కు పత్రం జారీ..
- భూ లావాదేవీలు, బ్యాంకు రుణాలు ఇకపై సులభం.. వివాద రహితం...

120.39mts — 41.39mts

④ పారదర్శకత...

- సర్వే ప్రతి అడుగులో భూ యజమానుల భాగస్వామ్యం..
- మండల మొబైల్ మేజిస్ట్రేట్ బృందాల ద్వారా గ్రామస్థాయిలోనే అభ్యంతరాల పరిష్కారం.. భూ యజమానులకు అప్పటికీ ఏమైనా అభ్యంతరాలు మిగిలి ఉంటే సెక్షన్ 12 (S&B యాక్ట్ 1923) కింద పునఃపరిశీలనకు కూడా మరో అవకాశం..
- తొలిసారిగా గ్రామ కంఠాలు, పట్టణ ప్రాంతాల్లోని ఇళ్ళు, స్థిరాస్తుల సర్వే మరియు యాజమాన్య ధృవీకరణ పత్రాల జారీ..

72.36 — 63.83mts

⑤ గ్రామాల చెంతకే సేవలు..

- ఇకపై గ్రామ సర్వేయర్ల ద్వారానే, ఫీల్డ్ లైన్ దరఖాస్తులు 15 రోజుల్లో, పట్టా సబ్ డివిజన్ దరఖాస్తులు 30 రోజుల్లో పరిష్కారం..
- ఇకపై గ్రామ సచివాలయాల్లో సర్వే, సబ్ డివిజన్ మ్యుటేషన్ మరియు స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు..
- భూ సమాచారాన్ని ఎవరైనా, ఎప్పుడైనా, ఎక్కడినుంచైనా పొందవచ్చు...

74.62mts — 63.83mts


⑥ భద్రత...

- నకిలీ పత్రాలకు ఇక తావులేదు..
- భూ యజమానికి తెలియకుండా రికార్డుల్లో ఎలాంటి మార్పులు వీలుపడవు..
- భూ లావాదేవీల ఆధారంగా భూ రికార్డుల్లో వెనువెంటనే మార్పులు...
- అవసరమైన చోట సబ్ డివిజన్ మార్పులు, మ్యుటేషన్లు, రిజిస్ట్రేషన్లు..


24.32mts — 60.23

⑦ సర్వే, రిజిస్ట్రేషన్ సేవలు

- జగనన్న ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయాల సంఖ్య కేవలం 295, మండల సర్వేయర్ల సంఖ్య కేవలం 676.. సర్వే, మ్యూటేషన్ , ఇతరత్రా రిజిస్ట్రేషన్ సేవల కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే దుస్థితి.. లంచాలు, వివక్ష.. కానీ మనందరి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మన గ్రామంలోనే మన గడప వద్దే అత్యంత పారదర్శకంగా సర్వే, సబ్ డివిజన్స్, భూహక్కు పత్రాల జారీ, రిజిస్ట్రేషన్ తదిత రసేవలు..



భూ హక్కు పత్రం



QR కోడ్‌తో కూడిన భూ కమత పటం



భూ రక్ష రాయి



డ్రోన్



కార్స్ బేస్ స్టేషన్



రోవర్

ఇప్పటికే రీసర్వే జరిపిన 2000 గ్రామాల్లో కేవలం గత 8 నెలల్లోనే 4.31 లక్షల సబ్ డివిజన్లు, 2 లక్షల మ్యుటేషన్లు ప్రజలు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వమే చేయడంతో భూ యజమానులకు వారి విలువైన సమయంతో పాటు 27.80 కోట్ల రూపాయల ఆదా..

శ్రీ ధర్మాన ప్రసాదరావు, రెవిన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖామాత్యులు

గమనిక: రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి 23 నవంబర్ 2022 నాడు ఉదయం 11 గంటలకు " వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూరక్ష పథకం" క్రింద భూ హక్కు పత్రాల జారీ కార్యక్రమాన్ని శ్రీకాకుళం జిల్లా నరసన్న పేటలో ప్రారంభిస్తారు.. ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రముఖ న్యూస్ ఛానళ్లలో లైవ్ లో వీక్షించవచ్చు...

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

సాక్షి ఫ్యామిలీ II
విజయవాడ
బుధవారం ॥ 23-11-2022



యూత్ పల్స్

మన దేశంలో టాప్ యూట్యూబర్స్ ఎవరు? అనే ప్రశ్నకు జవాబు చెప్పడం కష్టం కాకపోవచ్చు. కానీ 'వీట్యూబర్స్ ఎవరు?' అనే ప్రశ్నకు సమాధానం రాకపోగా 'ఇంతకీ వారు ఎవరు?' అనే ఎదురు ప్రశ్న ఎదురుకావచ్చు. జపాన్‌లో మంచి ఆదరణ ఉన్న వీట్యూబింగ్ (వర్చువల్ యూట్యూబ్ స్టార్స్) మన దేశంలోకి ప్రవేశించింది. పాపులర్ కావడానికి రెడీగా ఉంది...

Vట్యూబింగ్

నవతరం నయా ట్రెండ్

వెండిరంగు జుట్టు, వెరైటీ కళ్లద్దాలతో ఆకట్టుకునే జాక్‌నిఎక్స్ తన యూట్యూబ్ చానల్‌లో పాపులర్ వీడియో గేమ్స్ ఆడుతుంటాడు. జాక్‌నిఎక్స్‌కు ఎంతోమంది ఫాలోవర్స్ ఉన్నారు. అతడి ఆటను, మాటను అమితంగా ఇష్టపడుతుంటారు. నిజానికి జాక్‌నిఎక్స్ నిజం కాదు. దక్షిణాదికి చెందిన ఒక స్టూడెంట్ సృష్టించిన డిజిటల్ అవతార్!

మన దేశంలో 90కి పైగా వీట్యూబ్ అవతార్స్ ఉన్నాయి.

సాధారణంగా వీట్యూబ్ అవతార్స్ జపనీస్ యానిమేషన్ స్టైల్ ఫీచర్స్‌తో కనిపిస్తుంటాయి. 'వీట్యూబింగ్' అనేది 2016లో జపాన్‌కు పరిచయమైంది. స్ట్రీమ్‌గేమ్స్, ఇంటర్‌నెట్ ట్రెండ్స్, మ్యూజిక్, ఆర్ట్...ఇలా రకరకాల విభాగాల్లో వీట్యూబ్ అవతార్స్ వీక్షకులను వినోదపరుస్తున్నాయి. 'వీట్యూబర్స్' అనే పదం జపాన్‌లోనే పుట్టింది.

రికు తజుమితో జపాన్‌లో 'వీట్యూబర్స్' ట్రెండ్ అగ్రస్థాయికి చేరుకుంది. 26 సంవత్సరాల రికు తజుమి జపాన్‌లోని యంగెస్ట్ బిలియనీర్‌లలో ఒకరు కావడానికి కారణం 'ఎనీ కలర్' అనే స్టార్టప్. యూనివర్శిటీలో చదువుకునే రోజుల్లోనే 21 సంవత్సరాల వయసులో ఇచికర (శూన్యం నుంచి) అనే ఎంటర్‌టైన్‌మెంట్ స్టార్టప్‌ను మొదలు పెట్టాడు రికు. ఆ తరువాత దీని పేరును 'ఎనీ కలర్'గా మార్చాడు. వీట్యూబర్స్ ప్రపంచంలో 'ఎనీ కలర్' అగ్రస్థానంలోకి దూసుకుపోవడానికి ఎంతో కాలం పట్టలేదు.

'ఏ న్యూ మ్యాజికల్ ఎక్స్‌పీరియన్స్' అనే నినాదంతో నిజజీవితానికి చెందిన వందమంది వర్చువల్ క్యారెక్టర్స్‌ను ఇది సృష్టించింది.

యూజర్స్, క్రియేటర్స్‌కు మధ్య సరిహద్దులు లేకుండా చేయడమే తన విధానం అని చెబుతోంది. ఎన్నో వీట్యూబర్స్ ఏజెన్సీలకు 'ఎనీ కలర్' మాతృసంస్థగా ఉంది.

'కోవిడ్ సమయంలో మన దేశంలో ఊపందుకున్న వర్చువల్ యూట్యూబర్ ధోరణి మెయిన్‌స్ట్రీమ్ పాపులారిటీకి దగ్గరలో ఉంది' అంటున్నాడు వీట్యూబర్ టాలెంట్ ఏజెన్సీ 'ప్రాజెక్ట్ స్టార్‌స్కేప్' ఫౌండర్ వేణు జీ జోషి.

'వీట్యూబింగ్ అనేది ప్రైవసీని కాపాడుకోవడానికి, ముఖ్యంగా మహిళలకు బాగా ఉపయోగపడుతుంది. మీ ముఖం బాగాలేదు, మీ గొంతు బాగలేదు... వంటి విషపూరితమైన ట్రోలింగ్ నుంచి బయటపడవచ్చు. ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో ఏమో అనే సంశయం లేకుండా ధైర్యంగా కంటెంట్‌ను క్రియేట్ చేయవచ్చు' అంటుంది అసలు పేరే ఏమిటో తెలియని ఢిల్లీకి చెందిన వర్చువల్ అవతార్ సకుర.

వర్చువల్ అవతార్స్ పరిచయం ఆసక్తికరంగా ఉంటుంది. ఒక అవతార్ పరిచయం ఇలా ఉంటుంది: 'రెండు వందల సంవత్సరాల వయసు ఉన్న ఈ బాలికకు అపారమైన మాంత్రిక శక్తులు ఉన్నాయి'

చాలామంది మోడల్స్ జపనీస్ యానిమేషన్ స్టైల్ డిజైన్‌లకు ప్రాధాన్యత ఇస్తుండగా కొందరు మాత్రం పురాణాలలోని చిత్ర విచిత్ర పాత్రలను ఎంచుకుంటున్నారు. 19 సంవత్సరాల వీట్యూబర్ 'మియో' సగం మనిషి, సగం భూతంతో కూడిన అవతార్‌ను సృష్టించుకుంది.

కొందరు తమ అవతార్‌లకు తామే గొంతు ఇస్తుండగా, మరి కొందరు మాత్రం గొంతులో వైవిధ్యం కోసం వాయిస్ మాడ్యులేషన్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తున్నారు.

ఇండియన్ వీట్యూబ్ కమ్యూనిటీస్ కోసం రెడిట్‌లో ప్రత్యేకమైన పేజీ నిర్వహిస్తున్న హర్ష్ 'వీట్యూబర్స్'కు వీరాభిమాని. 'వీట్యూబర్‌ను చూస్తే స్నేహితుడిని చూసినట్లుగానే ఉంటుంది. వారి షోలో భాగమైతే రియాలిటీ షోలో భాగమైనట్లు అనిపిస్తుంది' అంటున్నాడు హర్ష్.

అభిమానం, విశ్లేషణ సంగతి ఎలా ఉన్నా అప్‌కమింగ్ వీట్యూబర్స్ కోసం 'వర్చువలిజం'లాంటి కంపెనీలు వచ్చాయి. వీట్యూబర్‌గా మారాలని, తమను తాము నిరూపించుకోవాలనే ఆసక్తి యూత్‌లో పెరిగింది.





ఈ పూలు వాడిపోవు

ఆమె వేలి కొసలు తాకిన కాగితం కుసుమమై పరిమళిస్తుంది. ఆమె చేతుల్లో రూపుదిద్దుకున్న కళాకృతులు మనసులోని భావాలను కళ్లకు కడతాయి. కాగితం మీద రాస్తూ భవిష్యత్తుకు పునాది వేసుకోవడమే కాదు, అదే కాగితంతో అందమైన ఆకృతిని రూపుకడుతోంది హైదరాబాద్ వాసి **మోపిదేవి నాగవాణి.** ఇష్టమైన వ్యాపకాన్ని ఉపాధిగా మార్చుకుంది. అందమైన కళాకృతులతో పాటు రికార్డులతోనూ ప్రశంసలు అందుకుంటోంది.

మైక్రోబయాలజీలో ఎమ్మెస్సీ చేసిన నాగవాణి ఆరేళ్ల క్రితమే కాగితాన్ని అందంగా రూపు కట్టడంలో సాధన చేసింది. హాబీగానే మొదలైన వ్యాపకం ఆదాయ వనరుగా ఎలా మారిందో వివరించింది.

''నే చేసిన కాగితం కళాకృతులు మొదట్లో మా స్నేహితులకూ నచ్చి, అడిగి తీసుకునేవారు. ఆ తర్వాత కాలేజీలో జరిగే ప్రోగ్రామ్స్‌కి మెమెంటోలు చేసిచ్చేదాన్ని. అక్కణ్నుంచి ఈ ఆర్ట్‌లోనే ఒక్కో మార్పు జోడిస్తూ వచ్చాను. వాటిలో ఫొటో ఫ్రేమ్స్, ఆల్బమ్స్, రకరకాల పువ్వులు, లతలు, గిఫ్ట్ ఆర్టికల్స్ మెమెంటోలు, బాక్స్‌లు .. ప్రతీది కాన్సెప్ట్ వైజ్‌గా చేస్తూ సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్నాను. దీంతో ఆర్డర్స్ రావడం మొదలయ్యాయి.

మాతృత్వానికి అందమైన రూపం

నా కళాకృతుల తయారీకి విదేశాల నుంచి కూడా కాగితం తెప్పించుకుంటాను. వాటిలో ఉండే రంగులు, క్వాలిటీ ప్రధానంగా ఎంపిక ఉంటుంది. బర్త్‌డే, మ్యారేజ్ డే వంటి సందర్భాలకు తగినట్టుగా, మాతృత్వపు మాధుర్యానికి రూపమిచ్చేలా, స్నేహితులకు, ప్రేమకు సందేశాలు ఇచ్చే విధంగా ప్రతి ఫ్రేమ్ అందమైన ఊహకి ప్రాణం పోసేదిగా ఉండాలని తపిస్తుంటాను. ఆ తపన వల్లే నా కళ నన్ను చాలా మందికి చేరువ చేసింది.

ఆభరణాల తయారీ

పేపర్‌తో రకరకాల కళాకృతులే కాదు ఆభరణాల తయారీ కూడా చేస్తాను. ఈ క్రాఫ్ట్‌లో చాలా రకాలు ఉన్నాయి. కానీ, నేను ఎంచుకునే పేపర్ క్వాలిటీ ప్రత్యేకంగా ఉంటుంది.





ఎప్పటికీ వాడిపోనివి, మన జ్ఞాపకాలను అందంగా మరింత పరిమళభరితంగా జాగ్రత్తపరచుకునేలా డిజైన్ చేస్తుంటాను. దీంతో ఇవి చిరకాలం ఉండిపోతాయి. ఆర్డర్స్ కూడా నా ఇన్‌స్టా పేజీ, వెబ్‌సైట్ నుంచి తీసుకుంటున్నాను. విదేశాల నుంచి కూడా ఆర్డర్స్ వస్తుంటాయి.

ఫొటో ఫ్రేమ్స్..

పేపర్ ఆర్ట్‌ని ఫొటో ఫ్రేమ్స్‌కి అప్లై చేయడంతో ఇవి చాలామందిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కళలో బేసిక్ సాయం కావాలంటే కుటుంబ సభ్యుల సహకారం తీసుకుంటాను. కానీ, పూర్తిగా నేనే ఒక్కో ఆర్ట్ పీస్‌ను ప్రత్యేకంగా రూపుకడతాను. ఇందుకు అమ్మ నాగలక్ష్మి, నాన్న సత్యసాయిల ప్రోత్సాహం ఎంతో ఉంది. కాలేజీలు, స్కూళ్లలో ఈ పువ్వుల తయారీకి సంబంధించిన ప్రదర్శనలూ ఇస్తుంటాను. వర్క్‌షాప్స్ నిర్వహిస్తుంటాను'' అని వివరించింది నాగవాణి.

హాబీగా నేర్చుకున్న కళ ఆసక్తిని పెంచింది. సాధనతో కొత్త హంగులు పులుముకుంది. అదే ఉపాధిగా మారింది. రికార్డులూ తెచ్చిపెట్టింది. ప్రయత్నిస్తే హాబీ కూడా ఆదాయవనరుగా మారుతుంది అని తన కళ ద్వారా నిరూపిస్తుంది ఈ కాగితం కళాకారిణి.

– నిర్మలారెడ్డి



రికార్డులో పువ్వులు

సరదాగా నేర్చుకున్న కళ పూర్తి ఉపాధిగా మారిపోవడంతో పాటు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది. ఒకేసారి 1000 రంగు రంగుల పువ్వులు తయారు చేసినందుకు ఈ ఘనత దక్కింది. ఇప్పుడు గిన్నిస్ బుక్‌లో నా కళ చేరడానికి కృషి చేస్తున్నాను.

సినిమా

అందమైన భామలు.. అదిరిపోయే స్టెప్పులు

సినిమా సీరియస్‌గా సాగుతున్నప్పుడు జరగాలి ఓ మ్యాజిక్. స్పెషల్ సాంగ్ ఆ మ్యాజిక్ చేస్తుంది. ఒక్కసారిగా ప్రేక్షకులకు మంచి రిలీఫ్ ఇస్తుంది. అందుకే విడుదలవుతున్న ప్రతి సినిమాలోనూ దాదాపు ఓ స్పెషల్ సాంగ్ ఉండటం కామన్ అయింది. అలా రానున్న రోజుల్లో సిల్వర్ స్క్రీన్‌పై మ్యాజిక్ చేయనున్న 'స్పెషల్ సాంగ్స్' గురించి, ఆ పాటలకు అదిరిపోయే స్టెప్పులు వేసిన అందమైన భామల గురించి తెలుసుకుందాం.


ఊర్వశీ రౌతేలా

తెలుగు మాస్ ప్రేక్షకులకు డబుల్ ధమాకా ఇవ్వనున్నారు హిందీ భామ ఊర్వశీ రౌతేలా. 'భాగ్ జానీ', 'కాబిల్' వంటి హిందీ చిత్రాల్లో ఇప్పటికే స్పెషల్ సాంగ్స్ చేసిన ఈ బ్యూటీ తెలుగులో ఒకేసారి రెండు సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ చేయడం విశేషం. చిరంజీవి టైటిల్ రోల్‌లో, రవితేజ ఓ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'వాల్తేరు వీరయ్య'లో ఊర్వశి స్టెప్స్ చూడనున్నాం. శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకు కేఎస్ రవీంద్ర (బాబీ) దర్శకుడు. ఈ చిత్ర సంగీతదర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ స్వరపరచిన స్పెషల్ సాంగ్‌లో చిరంజీవితో కలిసి సూపర్ స్పెషల్ స్టెప్పులేశారు ఊర్వశి. సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రం విడుదల కానుంది. కాగా ఊర్వశి చేసిన మరో స్పెషల్ సాంగ్ చిత్రీకరణ కూడా పూర్తయింది. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రామ్ హీరోగా ఓ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలోని ఓ స్పెషల్ సాంగ్‌లో రామ్‌తో కలిసి స్టెప్పులేశారు ఊర్వశి. ఈ సినిమాకు తమన్ మ్యూజిక్ డైరెక్టర్. ఈ చిత్రం వచ్చే ఏడాది వేసవికి రిలీజ్ కానుంది. ఇక ఊర్వశీ రౌతేలా హీరోయిన్‌గా నటించిన 'బ్లాక్ రోజ్' సినిమా రిలీజ్‌కు సిద్ధం అవుతోంది. మోహన్ భరద్వాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాకు దర్శకుడు సంపత్ నంది కథ అందించారు. మరో వైపు బుల్లితెర ప్రేక్షకుల్లో సూపర్ క్రేజ్‌ను సంపాదించుకున్న రష్మీ గౌతమ్ స్పెషల్ డ్యాన్స్ మూమెంట్స్‌ను 'భోళా శంకర్' చిత్రంలో చూడొచ్చు. చిరంజీవి హీరోగా మెహర్ రమేష్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో తమన్నా హీరోయిన్. ఈ చిత్రంలో చిరంజీవితో కలిసి ఓ స్పెషల్ సాంగ్‌కి డ్యాన్స్ చేశారు రష్మి. ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్‌లో రిలీజ్ కానుంది. ఇంకోవైపు భారత మాలాలు ఉన్న ఆస్ట్రేలియన్ నటి చంద్రికా రవి 'వీరసింహారెడ్డి'లో బాలకృష్ణతో కలిసి స్పెషల్ డ్యాన్స్ వేశారు. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా రూపొందుతున్న సినిమా 'వీరసింహా రెడ్డి'. చిత్ర సంగీతదర్శకుడు తమన్ స్వరపరచిన స్పెషల్ సాంగ్‌లో బాలకృష్ణతో కలసి చంద్రికా రవి మాస్ స్టెప్పులేశారు. ఈ సినిమా సంక్రాంతికి రిలీజ్ కానుంది.


హెబ్బా

అలాగే రామ్ 'రెడ్' చిత్రంలో స్పెషల్ సాంగ్‌లో మెరిసిన హెబ్బా పటేల్ 'శాసన సభ'లో కూడా తళుక్కుమననున్నారు. ఇంద్రసేన హీరోగా నటించిన ఈ సినిమాకు వేణు మడికంటి దర్శకుడు. ఈ సినిమాలో 'నన్ను పట్టుకుంటే...' అనే పాటలో నర్తించారు హెబ్బా పటేల్. ఈ సినిమాకు 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ సంగీత దర్శకుడు. ఇక గత ఏడాది సంక్రాంతికి 'క్రాక్'లో 'బూమ్ బద్దల్' అంటూ సిల్వర్ స్క్రీన్‌ని షేక్ చేసిన అప్సరా రాణి గుర్తుండే ఉంటారు. ఈ బ్యూటీ ఇప్పుడు 'హంట్' చిత్రంలో సుధీర్‌బాబుతో కలిసి 'పాపతో పైలం' అనే స్పెషల్ సాంగ్ చేశారు. సుధీర్ బాబు హీరోగా శ్రీకాంత్, భరత్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'హంట్'. మహేశ్ సూరపనేని దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రానికి జిబ్రాన్ సంగీత దర్శకుడు.

వీళ్లే కాదు.. ఇంకా స్పెషల్ సాంగ్స్‌లో మెరవనున్న తారలు కొందరున్నారు. సినిమాకి స్పెషల్‌గా నిలిచే ఈ సాంగ్స్ అందాల తారల కెరీర్‌లోనూ స్పెషల్‌గా నిలిచిపోతాయి. అందుకే శ్రుతీహాసన్, తమన్నా వంటి అగ్ర తారలు కూడా అప్పుడప్పుడూ స్పెషల్ సాంగ్స్ చేస్తుంటారు.


చంద్రికా రవి


అప్సరా రాణి


రష్మీ

పుకార్లతో ఆందోళనకు గురి చేస్తున్నారు

– శ్రీకాంత్


శ్రీకాంత్, ఊహ

''నేను, నా భార్య ఊహ విడాకులు తీసుకుంటున్నట్లుగా కొన్ని వెబ్‌సైట్స్, యూట్యూబ్ చానల్స్‌లో తప్పుడు వార్తలు సృష్టించారు.. అవన్నీ పుకార్లే'' అని నటుడు శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రెస్‌నోట్ రిలీజ్ చేశారు. ''గతంలో నేను చనిపోయినట్లుగా ఒక పుకారు పుట్టించి నా కుటుంబ సభ్యులను తీవ్ర ఆందోళనకు గురి చేశారు. ఇప్పుడు ఆర్థిక ఇబ్బందుల వల్ల నేను–ఊహ విడాకులు తీసుకుంటున్నామంటూ ఒక న్యూసెన్స్ క్రియేట్ చేశారు. ఊహ కంగారు పడుతూ ఆ పోస్టులను నాకు చూపించగా, ఓదార్చాను. ఈ నిరాధార వార్త సోషల్ మీడియాలో విపరీతంగా స్ప్రెడ్ అవడంతో బంధుమిత్రులందరూ ఫోన్ చేస్తున్నారు.. వారికి వివరణ ఇచ్చుకోవడం పెద్ద న్యూసెన్స్‌గా అనిపిస్తోంది. ప్రస్తుతం నేను, ఊహ చెన్నైకి వచ్చాం. ఇక్కడి నుంచి దైవ దర్శనానికి అరుణాచలం వెళ్తున్నాం. ఇలాంటి తరుణంలో ఈ పుకారు మా కుటుంబానికి చిరాకు తెప్పిస్తోంది. నాపైనే కాదు.. చాలామంది ప్రముఖులపై ఇలాంటి నిరాధారమైన పుకార్లు స్ప్రెడ్ చేస్తున్న వెబ్‌సైట్స్, యూట్యూబ్ చానల్స్‌పై సైబర్ క్రైమ్ డిపార్ట్‌మెంట్ కఠిన చర్యలు తీసుకోవాలి'' అన్నారు.

హీరోయిన్ లాంటి పాత్ర చేశాను

– మధుబాల



''ప్రేమ దేశం' సినిమాలో తల్లీ కొడుకుల బంధాన్ని చక్కగా చూపించారు. 'ప్రేమ దేశం'లో నేను ఒక హీరోయిన్‌లాంటి పాత్రలోనే కనిపిస్తాను'' అని నటి మధుబాల అన్నారు. త్రిగుణ్, మేఘా ఆకాష్ జంటగా శ్రీకాంత్ సిద్ధం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ప్రేమ దేశం'. శిరీష సిద్ధం నిర్మించిన ఈ సినిమా డిసెంబర్ 2న విడుదల కానుంది. ఈ చిత్రంలో తల్లి పాత్ర చేసిన **మధుబాల మాట్లాడుతూ–** ''ప్రేమ దేశం'లో త్రిగుణ్, మేఘా ఆకాష్ బాగా నటించారు. నా కెరీర్ ప్రారంభంలో అన్ని భాషల్లో సినిమాలు చేశాను. ఇప్పుడు తెలుగులో చేస్తే ఎక్కువ రీచ్ వస్తుంది.. అందుకే తెలుగు సినిమాల మీద ఫోకస్ పెట్టాను. నేను నటించిన మరో తెలుగు సినిమా 'గేమ్' మంచి కథతో రాబోతోంది. కథ బాగుంటే నెగెటివ్ రోల్ అయినా, కామెడీ రోల్ అయినా ఓకే. ప్రస్తుతం హిందీలో 'కర్తమ్ హుక్తమ్'తో పాటు మరో సినిమా చేస్తున్నాను. అలాగే 'దేజావు' అనే తెలుగు, తమిళ ద్విభాషా చిత్రం, వివేక్ శర్మ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాను. జీ5లో ఓ వెబ్ సిరీస్ చేస్తున్నాను'' అన్నారు.

వాస్తవ ఘటనతో...

''ప్రేక్షకులందరికి నచ్చే కథ 'బేబీ'. మన ప్రేక్షకులకు ఎలా చూపిస్తే బాగుంటుందో అలా తెరకెక్కించారు సాయి రాజేష్. ఫైనల్ కాపీ చూశాక చాలా సంతృప్తిగా అనిపించింది'' అని దర్శకుడు మారుతి అన్నారు. ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్ హీరోలుగా, వైష్ణవి చైతన్య హీరోయిన్‌గా సాయి రాజేష్ తెరకెక్కించిన చిత్రం 'బేబీ'. ఎస్‌కేఎన్, దర్శకుడు మారుతి నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్ విడుదల కార్యక్రమంలో సాయి రాజేష్ మాట్లాడుతూ– ''తమిళనాడులోని ఓ ప్రాంతంలో జరిగిన వాస్తవ ఘటన స్ఫూర్తితో తీసిన చిత్రమిది. ఇప్పటిదాకా నన్ను సాయి రాజేష్ అన్నారు. ఈ సినిమా రిలీజయ్యాక 'బేబీ' దర్శకుడు అని పిలుస్తారు'' అన్నారు. ''మారుతి, నేను కలిసి ఈ మాస్ మూవీ మేకర్స్ సంస్థను స్థాపించాం. మా దృష్టిలో సినిమా అంటే


విరాజ్ అశ్విన్, వైష్ణవి, ఆనంద్ దేవరకొండ

అమ్మకం కాదు.. నమ్మకం. అలాంటి నమ్మకంతోనే 'బేబీ' నిర్మించాం'' అన్నారు ఎస్‌కేఎన్. ''నా కెరీర్‌లో సవాలు విసిరిన, సంతృప్తి ఇచ్చిన సినిమా ఇది'' అన్నారు ఆనంద్ దేవరకొండ. 'బేబీ' విజయం సాధించాలని దర్శకులు హరీష్ శంకర్, అనిల్ రావిపూడి, వెంకటేష్ మహా, వశిష్ఠ అన్నారు.

వైఎస్ఆర్‌గారే స్ఫూర్తి

– రాజశేఖర్ రెడ్డి



''దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డిగారు ఎంత ఒత్తిడిలో ఉన్నా ప్రశాంతంగా నవ్వుతూ ఉంటారు. నేను ఇండస్ట్రీలో ఇబ్బందులు పడ్డప్పుడు వైఎస్‌గారిని స్ఫూర్తిగా తీసుకుని పట్టుదలతో నిలబడి, సక్సెస్ అయ్యాను'' అని దర్శకుడు రాజశేఖర్ రెడ్డి పులిచర్ల అన్నారు. 'సుడిగాలి' సుధీర్, గెహ్నా సిప్పీ జంటగా నటించిన చిత్రం 'గాలోడు'. స్వీయ దర్శకత్వంలో రాజశేఖర్ రెడ్డి పులిచర్ల రూపొందించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదలైంది. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి చెప్పిన విశేషాలు.

- నాది పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని వింజమూరు. మా తాత నారపరెడ్డికి వైఎస్ఆర్‌గారితో మంచి అనుబంధం ఉంది. ఆ అభిమానంతో రాజశేఖర్ రెడ్డి అని నాకు పేరు పెట్టారు. ఓసారి వైఎస్ఆర్‌గారు వింజమూరు వచ్చినప్పుడు కలిశాను. ఆ ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. ఆయన లేరనే నిజాన్ని ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను.
- సుధీర్‌తో నేను తీసిన 'సాఫ్ట్‌వేర్ సుధీర్' మంచి హిట్టయింది. ఆ లాభంతోనే 'గాలోడు' నిర్మించాను. 'గాలోడు' కమర్షియల్ కంటెంట్ కావడంతో హిట్టవుతుందని నమ్మాను.. అది నిజం అయింది.
- నాకు కమర్షియల్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకోవాలని ఉంది. డైరెక్షన్‌తో పాటు ప్రొడక్షన్ చేయడం చాలా కష్టం.. అందుకే ప్రొడక్షన్‌కి దూరంగా ఉండాలనుకుంటున్నాను. 'గాలోడు' విడుదల తర్వాత పెద్ద బ్యానర్స్ నుంచి ఫోన్ చేసి, మంచి కథ ఉంటే చెప్పమని అడిగారు. స్టార్ హీరోలతో చేయదగ్గ నాలుగైదు కథలు సిద్ధంగా ఉన్నాయి. అలాగే రష్మీ–సుధీర్ కాంబినేషన్‌లో 'గజ్జల గుర్రం' అనే సినిమా చేస్తాను.


'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 242

బుధవారం 23-11-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



వర్షంతో ఆఖరి పోరు 'టై'

న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్ భారత్ కైవసం - 12లో



ఆన్‌లైన్ గేమింగ్‌పై జీఎస్టీ

28 శాతంగా ప్రతిపాదించనున్న మంత్రుల కమిటీ - 13లో



యువతకు సాధికారతే లక్ష్యం

కేంద్రం చేపట్టిన రెండో ఉద్యోగ మేళాలో 71,056 మంది యువతకు ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు.

వివరాలు 6లో



ఫిజియో కాదు.. అతనో రేపిస్ట్

తిహార్ జైలులో ఢిల్లీ రాష్ట్ర మంత్రి సత్యేంద్ర జైన్‌కు మసాజ్ చేస్తున్న వ్యక్తి అత్యాచారం కేసులో అరెస్ట్ అయిన వాడని తెలిసింది.

వివరాలు 6లో



క్షణికావేశంలోనే చంపా..

శ్రద్ధాను క్షణికావేశంలోనే తప్ప, ఉద్దేశపూర్వకంగా చంపలేదని ఢిల్లీ హత్య ఘటన కేసులో నిందితుడు అఫ్తాబ్ కోర్టుకు తెలిపాడు.

వివరాలు 6లో



చైనాలో ఘోర అగ్ని ప్రమాదం

చైనాలోని హినాన్ ప్రావిన్స్‌లోని ఒక వస్త్ర పరిశ్రమలో సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో 38 మంది ప్రాణాలు కోల్పోయారు.

వివరాలు 6లో

న్యూస్‌రీల్

చెంగల్రాయుడును అరెస్ట్ చేయాలి



పోలీసు, న్యాయ వ్యవస్థలపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లేలా వ్యాఖ్యలు చేసిన టీడీపీ మాజీ ఎమ్మెల్సీ చెంగల్రాయుడును తక్షణమే అరెస్ట్ చేయాలని ఏపీ రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం డిమాండ్ చేసింది. అతడి వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండించింది.

వివరాలు 3లో ▸

ఆత్మన్యూనత నుంచి ఆత్మగౌరవానికి బీసీలు



ఆత్మన్యూనతలో ఉన్న బీసీలను ఆత్మగౌరవంతో బతికేలా సీఎం జగన్ ప్రభుత్వం 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేసి ఆయా సామాజికవర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు తెలిపారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక ఉన్నత విద్య అందుబాటులోకి వచ్చిందన్నారు.

వివరాలు 5లో ▸

కారు-లారీ ఢీ.. 8 మంది మృతి



విజయవాడ-జగ్దల్‌పూర్ జాతీయ రహదారి-30పై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఎనిమిది మంది మృత్యువాత పడ్డారు. భద్రాద్రి వచ్చి తిరిగి వెళుతుండగా చింతూరు మండలం బొడ్డుగూడెం వద్ద వారి కారుని లారీ ఢీ కొట్టింది.

వివరాలు 5లో ▸

వైజాగ్ పోర్టుకు 6 కనెక్టివిటీ ప్రాజెక్టులు



కేంద్రం ప్రవేశపెట్టిన గతిశక్తి పథకంలో భాగంగా పోర్టు కనెక్టివిటీ రహదారుల్లో వైజాగ్ పోర్టుకు 6 ప్రాజెక్టులను కేటాయించినట్టు పోర్టు చైర్మన్ కె.రామ్మోహన్‌రావు చెప్పారు. విశాఖ పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో మారిటైమ్-2022 సదస్సు ప్రారంభమైంది.

వివరాలు 2లో ▸

దేశమంతటా సచివాలయాలు



కేంద్ర ప్రభుత్వానికి 32 మంది నిపుణుల కమిటీ సూచన

- ఎనిమిది రాష్ట్రాల్లో పర్యటించి కేంద్ర బృందం నివేదిక
- ఏపీ గ్రామ సచివాలయ వ్యవస్థ సాహసోపేతమైన ప్రయోగమంటూ కితాబు
- పేదరిక నిర్మూలనకు ఏపీ ప్రభుత్వం పలు సొంత కార్యక్రమాలు
- వినూత్న విధానాలతో ప్రత్యేక స్థానం.. ఇటు సొంత పథకాలు.. అటు అదనంగా సాయం
- అత్యంత ప్రాధాన్యతగా పేదలకు సామాజిక పింఛన్ల పంపిణీ
- ప్రతి నెలా 1వ తేదీనే 90% పూర్తి
- పెద్ద రాష్ట్రాలకూ సాధ్యం కాని రీతిలో సక్రమంగా పంపిణీ
- ఏ కార్యక్రమమైనా సమర్థంగా అమలుకు గ్రామ స్థాయిలో తగినంత సిబ్బంది అవసరం
- దేశంలో మరెక్కడా లేని విధంగా ఏపీ సచివాలయాల్లో ఉద్యోగులు

> "గ్రామీణాభివృద్ధి ప్రక్రియలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాహసోపేతమైన, వినూత్న చర్యలు చేపట్టింది. గ్రామ సచివాలయాల ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తూనే ప్రభుత్వ సేవలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయడం ఒక సాహసోపేతమైన ప్రయోగం. మొత్తంగా రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల పట్ల సంతోషంగా, సంతృప్తిగా ఉన్నారు."
>
> - కేంద్రానికి నిపుణుల బృందం నివేదిక

నిన్న ఆర్బీకేలు.. నేడు గ్రామ సచివాలయాలు!.. వ్యవసాయ ఉపకరణాల నుంచి కోవిడ్ వ్యాక్సిన్ల దాకా.. అవసరం ఏదైనా సరే ఆగమేఘాలపై సేవలు అందిస్తున్నాయి.. ఒక్క మాటలో చెప్పాలంటే గ్రామ స్వరాజ్యం సాకారమైంది..

సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రజలు ఊరు దాటాల్సిన అవసరం లేకుండా సేవలందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో ప్రవేశపెట్టిన ఈ వ్యవస్థలన్నీ సర్వత్రా ప్రశంసలు అందుకోగా దేశవ్యాప్తంగా ఇదే విధానాన్ని అనుసరించాలని నిపుణులు సూచిస్తున్నారు. అన్నదాతలకు ఆర్బీకేలు అందిస్తున్న సేవల పట్ల ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో అభినందనలు దక్కిన విషయం తెలిసిందే. తాజాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మక

మిగతా 2వ పేజీలో ▶

మీ భూమి మా హామీ

చరిత్రలో తొలిసారి యజమానులకు ఉచితంగా హక్కు పత్రాలు

- 2 వేల తొలిదశ గ్రామాల్లో భూముల సమగ్ర సర్వే పూర్తి
- మొత్తం 4.3 లక్షల సబ్ డివిజన్‌లు.. 2 లక్షల మ్యుటేషన్లు.. 7,92,238 మంది రైతులకు హక్కు పత్రాలు సిద్ధం
- రైతన్నలకు శ్రమ, ఆర్థిక భారం లేకుండా 8, 9 నెలల్లోనే ప్రక్రియ పూర్తి
- ప్రతి భూమికి ఆధార్ తరహాలో విశిష్ట సంఖ్య, క్యూఆర్ కోడ్
- గ్రామాల్లో అందుబాటులోకి కొత్త డిజిటల్ రికార్డులు
- 15 రోజుల్లో స్థానిక గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్
- భూ రికార్డుల ట్యాంపరింగ్.. డబుల్ రిజిస్ట్రేషన్ల బెడదకు చెక్
- దశాబ్దాల నాటి భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం
- వందేళ్ల తర్వాత ఆధునిక టెక్నాలజీతో డ్రోన్లు, విమానాల ద్వారా రీ సర్వే



సాక్షి, అమరావతి: అసాధ్యమని గత ప్రభుత్వాలు చేతులెత్తేసిన భూముల రీ సర్వేను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు సాకారం చేసి కొత్త చరిత్రను లిఖిస్తోంది. వందేళ్ల తర్వాత దేశంలో తొలిసారిగా చేపట్టిన సమగ్ర భూముల రీ సర్వేను ఎన్నో ఆటంకాలు, వ్యయ ప్రయాసలను అధిగమించి తొలిదశలో 2 వేల గ్రామాల్లో పూర్తి చేసింది. ఆధునిక డిజిటల్ రెవెన్యూ రికార్డులు సిద్ధమైన గ్రామాల్లో రైతులకు భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బుధవారం

మిగతా 2వ పేజీలో ▶

నేడు శ్రీకాకుళం జిల్లాలో సీఎం వైఎస్ జగన్ పర్యటన

2లో

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పత్రాలు పంపిణీని ప్రారంభించనున్న సీఎం

రూ.1,700 కోట్లు.. 6,150 కిలో మీటర్లు

రాష్ట్రంలో రెండోదశ రోడ్ల పునరుద్ధరణకు ప్రణాళిక

- 26 జిల్లాల్లో 953 రహదారులను పునరుద్ధరించనున్న ఆర్ అండ్ బి
- 85శాతం పూర్తయిన మొదటి దశ పనులు.. డిసెంబర్ చివరి నాటికి మొత్తం పూర్తి
- రెండో దశలో రాష్ట్ర ప్రధాన రహదారులకు రూ.673 కోట్లు, జిల్లా రహదారులకు రూ.1,027 కోట్లు
- వీటికి ఆమోదం లభించగానే టెండర్ల ప్రక్రియ.. ఆ తర్వాత ఏడాదిలోగా పనులు పూర్తి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రోడ్ల పునరుద్ధరణ పనులను మరింత వేగవంతం చేసేందుకు ఆర్ అండ్ బి శాఖ సన్నద్ధమవుతోంది. ఈ మేరకు రూ.1,700 కోట్లతో 6,150 కి.మీ.మేర రహదారుల పునరుద్ధరణ ప్రణాళికను ఖరారు చేసింది. గతంలో టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వీటి పునరుద్ధరణకు తీసుకున్న రూ.3వేల కోట్ల రుణాన్ని కూడా ఎన్నికల ముందు పసుపు-కుంకుమ పథకానికి మళ్లించడంతో పరిస్థితి మరింత దిగజారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్ల పునరుద్ధరణపై దృష్టిసారించింది. ఇందుకోసం తీసుకున్న రుణాన్ని ప్రత్యేక బ్యాంకు ఖాతా ద్వారా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తోంది. దీంతో నిధులను ఇతర అవసరాలకు మళ్లించకుండా ప్రభుత్వం సరైన విధానాన్ని ఏర్పర్చింది. మొదటి దశ కింద రూ.2,205 కోట్లతో రాష్ట్రంలో 6,500 కి.మీ. మేర రోడ్ల పునరుద్ధరణ పనులు దాదాపు పూర్తికావచ్చాయి. ఇప్పటికే 85శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. మిగిలిన 15శాతం పనులు

మిగతా 2వ పేజీలో ▶



సౌదీ అరేబియా కమాల్ కియా

గత 36 మ్యాచ్‌లలో అర్జెంటీనా జట్టుకు ఓటమేలేదు. 25 గెలవగా, 11 'డ్రా' అయ్యాయి. సాకర్ ప్రపంచకప్ గెలిచే జట్లలో ఒకటిగా మెస్సీ సేన ఖతర్‌లో అడుగు పెట్టింది. మరోవైపు ప్రపంచ 51వ ర్యాంక్ సౌదీ అరేబియాపై ఎవరికీ ఎలాంటి ఆశలు లేవు. కానీ ఆ దేశ ఫుట్‌బాల్ చరిత్రలో అత్యుత్తమ విజయాన్ని మంగళవారం అందుకుంది. గ్రూప్ 'సి' పోరులో సౌదీ 2-1 గోల్స్ తేడాతో అర్జెంటీనాపై సంచలన విజయం సాధించింది. సౌదీ తరఫున సలేహ్ అల్ షహరి, సలేమ్ అల్ దవసరి గోల్స్ నమోదు చేయగా.. మెస్సీ అర్జెంటీనాకు ఏకైక గోల్ అందించాడు.

- వివరాలు 12లో

టెన్త్‌లో సైన్స్‌కు ఒకే పేపర్



- భౌతిక, జీవ శాస్త్రాలకు వేర్వేరు పేపర్ల పద్ధతి రద్దు
- ఇకపై ఒకే పేపర్‌లో రెండు విభాగాలుగా ప్రశ్నలు
- సమాధానాలకు వేర్వేరు బుక్‌లెట్లు
- ఈ నెల 25 నుంచి డిసెంబర్ 10 వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం

2లో



బలహీనపడిన వాయుగుండం

నేడు, రేపు తేలికపాటి వర్షాలు

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం మంగళవారం బలహీనపడింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ అల్పపీడనంగా మారింది. ప్రస్తుతం నైరుతి బంగాళాఖాతం, దక్షిణాంధ్ర, ఉత్తర తమిళనాడు తీరం సమీపంలో కొనసాగుతోంది. అక్కడ నుంచి నెమ్మదిగా పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ రానున్న 24 గంటల్లో మరింత బలహీనపడే అవకాశం ఉన్నట్లు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) మంగళవారం రాత్రి నివేదికలో తెలిపింది. ఈ అల్పపీడనానికి అనుబంధంగా సముద్రమట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఉంది. దీని ప్రభావంతో రానున్న రెండురోజులు కోస్తాలో ఒకటిరెండు చోట్ల, రాయలసీమలో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

టార్గెట్ మల్లారెడ్డి



- తెలంగాణ మంత్రి ఆస్తులే లక్ష్యంగా ఐటీ దాడులు
- 50 బృందాలు.. కేంద్ర బలగాల పహరాలో ఏకకాలంలో సోదాలు
- కుమారులు, అల్లుడు, ఇతర బంధువుల ఇళ్లపైనా దాడులు
- ఆదాయానికి మించిన ఆస్తుల గుర్తింపు.. రూ.8.8 కోట్ల నగదు, పలు కీలక డాక్యుమెంట్లు, హార్డ్ డిస్క్‌లూ స్వాధీనం
- తనిఖీలు బుధవారం కూడా కొనసాగే అవకాశం

10లో



మన దగ్గర కూడా అమలయితే బావుందు.. చాక్‌లెట్స్, ఐస్‌క్రీమ్స్ ఇచ్చి ఈజీగా ఓట్లు కొనవచ్చు!!

ఏటేటా సంక్షేమ వ్యయం పెరుగుదల


2019-20లో సామాజిక రంగం వ్యయం రూ.78,797 కోట్లు

అదే 2021-22లో రూ.1.13 లక్షల కోట్లు

బాబు హయాం కన్నా ఆస్తుల కల్పన వ్యయం పెంపు

కోవిడ్‌తో రాష్ట్ర పన్ను ఆదాయంపై రెండేళ్లపాటు తీవ్ర ప్రభావం

సామాజిక రంగం, కేపిటల్ వ్యయం, పన్ను ఆదాయంపై ఆర్‌బీఐ నివేదిక



సాక్షి, అమరావతి: విద్య, వైద్య రంగాలతో పాటు సంక్షేమానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నివేదిక స్పష్టంచేసింది. సామాజిక రంగం వ్యయం గత మూడేళ్లుగా భారీగా పెరుగుతుండడమే ఇందుకు నిదర్శనమని పేర్కొంది. రాష్ట్రాల వారీగా సామాజిక రంగం, ఆస్తుల కల్పన వ్యయంతో పాటు రాష్ట్రాల సొంత పన్ను ఆదాయాల వివరాలను ఆర్‌బీఐ విడుదల చేసింది. విద్య, వైద్య రంగాల్లో నాడు-నేడు కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ స్కూళ్లు, ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు కొత్త పీహెచ్‌సీలు, మెడికల్ కాలేజీల నిర్మాణాలను చేపడుతున్నందున ఆ రంగాల్లో వ్యయం ఎక్కువగా ఉంది. మరోపక్క.. నవరత్నాల పేరుతో అర్హులైన వారందరికీ సంక్షేమం, అభివృద్ధి పథకాలను అమలుచేస్తున్నందున సామాజిక రంగం వ్యయం గత మూడేళ్లుగా ఏటా పెరుగుతోందని నివేదిక వివరించింది. మరోపక్క.. ఆస్తుల కల్పన వ్యయం కూడా బాబు హయాంలో కన్నా ఎక్కువగానే ఉందని నివేదిక స్పష్టంచేసింది. 2018-19లో ఆస్తుల కల్పన వ్యయం రూ.35 వేల కోట్లుండగా 2019-20 ఆర్థిక ఏడాదిలో రూ.36,224 కోట్లు చేసిందని.. అదే 2021-22లో ఆస్తుల కల్పన వ్యయం రూ.47,583 కోట్లకు పెరిగినట్లు నివేదిక పేర్కొంది. కానీ, ఆర్థిక మందగమనంతో పాటు కోవిడ్ సంక్షోభం నేపథ్యంలో వరుసగా రెండు ఆర్థిక సంవత్సరాల రాష్ట్ర సొంత పన్ను ఆదాయం పెరగకపోగా తగ్గిపోయినట్లు నివేదిక తెలిపింది. 2021-22లో మాత్రం సొంత పన్ను ఆదాయం పుంజుకుందని ఆర్బీఐ నివేదిక వెల్లడించింది. ఇక 2018-19లో రాష్ట్ర సొంత పన్ను ఆదాయం రూ.58,677 కోట్లు రాగా 2019-20లో రూ.57,601 కోట్లే వచ్చింది. 2020-21లో మరింత తగ్గి రూ.57,359 కోట్లకు పరిమితమైంది. అదే 2021-22లో మాత్రం రాష్ట్ర సొంత పన్ను ఆదాయం రూ.85.265 కోట్లుగా ఆర్‌బీఐ పేర్కొంది.

క్లుప్తంగా

నేడు శ్రీకాకుళం జిల్లాలో సీఎం జగన్ పర్యటన

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పత్రాల పంపిణీని ప్రారంభించనున్న సీఎం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బుధవారం శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో పర్యటించనున్నారు. అక్కడ వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష (రీ సర్వే) పత్రాల పంపిణీని ఆయన ప్రారంభిస్తారు. ముఖ్యమంత్రి ఉదయం 8.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 11 గంటలకు నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానానికి చేరుకుంటారు. 11 నుంచి 12.55 గంటల వరకు అక్కడ జరిగే బహిరంగసభలో ప్రసంగిస్తారు. లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం 1.25 గంటలకు అక్కడ బయలుదేరి 3.25 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

సీఎం జగన్ మదనపల్లె పర్యటన వాయిదా

మదనపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మదనపల్లె పర్యటన వాయిదా పడిందని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషా ప్రకటించారు. మిథున్‌రెడ్డి, నవాజ్‌బాషా మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈ 25వ తేదీన సీఎం జగన్ మదనపల్లెలో పర్యటించాల్సి ఉందని చెప్పారు. బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం ప్రభావంతో రానున్న నాలుగు రోజులు వర్షాలు కురుస్తాయని, ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు, భద్రతా కారణాల వల్ల సీఎం పర్యటన వాయిదా పడినట్లు వివరించారు. తిరిగి ముఖ్యమంత్రి పర్యటన ఈ నెల 29 లేదా 30న ఉండవచ్చని, సీఎం కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాక అధికారికంగా ప్రకటిస్తామన్నారు.

వాతావరణ మార్పుల సెల్ ఏర్పాటు

వాతావరణ మార్పులపై కార్యాచరణ, అమలుకోసం..

సాక్షి, అమరావతి: పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలో ప్రభుత్వం ప్రత్యేకంగా వాతావరణ మార్పుల సెల్ ఏర్పాటు చేసింది. కాలుష్య నియంత్రణ మండలితో కలిసి వాతావరణ మార్పులపై రాష్ట్ర కార్యాచరణను తయారుచేసి దాన్ని అమలు చేయడం కోసం ఈ సెల్‌ను ఏర్పాటుచేస్తూ మంగళవారం పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. కేంద్ర ప్రభుత్వం, ఇతర ఏజెన్సీలు, రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలు వాతావరణ మార్పులపై అమలు చేస్తున్న ప్రాజెక్టులను గుర్తించి వాటిద్వారా రాష్ట్ర కార్యాచరణను అమలు చేయడం కోసం ఈ సెల్ పనిచేస్తుంది.

విశాఖలో అసెస్టివ్ టెక్నాలజీపై పరిశోధనలు

మెడ్‌టెక్ జోన్‌తో ఐసీఎంఆర్ ఎంవోయూ



ఎంవోయూ పత్రాలు చూపిస్తున్న ఐసీఎంఆర్, మెడ్‌టెక్ జోన్ ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం: ఏపీ మెడ్‌టెక్ జోన్‌తో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఇంటర్నేషనల్ అసెస్టివ్ టెక్నాలజీ హబ్‌ని ఏర్పాటు చేసేందుకు మెడ్‌టెక్ జోన్‌తో ఐసీఎంఆర్ ప్రతినిధులు కలిసి మంగళవారం ఎంవోయూపై సంతకాలు చేశారు. వీల్‌చైర్స్, వినికిడి పరికరాలు, స్క్రీన్ రీడింగ్ పరికరాలు మొదలైన వాటిపై పరిశోధనలు చేసి, వైద్య పరికరాలు తయారు చేసేందుకు హబ్‌ని సృష్టించాలని రెండుసంస్థలు ఒకే తాటిపైకి వచ్చాయని మెడ్‌టెక్ జోన్ ప్రతినిధులు తెలిపారు. భవిష్యత్తులో అసెస్టివ్ టెక్నాలజీపై పరిశోధనలు విస్తృతం చేస్తామని పేర్కొన్నారు.


త్వరలో అందుబాటులోకి స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీ

విశాఖలో అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఏపీలో త్వరలో స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి రాష్ట్ర విభజన అనంతరం ఏపీకి ప్రత్యేకంగా ల్యాబ్ ఏర్పాటు కాలేదు. దీంతో ఆహార తనిఖీల్లో సీజ్ చేసిన నమూనాలను పరీక్షల కోసం హైదరాబాద్‌కు పంపుతూ వస్తున్నారు. అక్కడి నుంచి నివేదికలు రావడానికి 2 వారాల నుంచి నెల రోజులు సమయం పడుతోంది. దీంతో కల్తీకి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంలో ఆలస్యం అవుతోంది. దీంతో సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం విశాఖలోని రీజనల్ ఫుడ్ ల్యాబొరేటరీని స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీగా అభివృద్ధి చేయనుంది. ఇందుకు ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) అనుమతులు లభించాయి. రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ విభాగం బలోపేతంలో భాగంగా రూ.14.55 కోట్లతో వివిధ కార్యక్రమాలు చేపట్టడానికి ఎఫ్ఎస్ఎస్ఏఐ రాష్ట్ర ఫుడ్ కమిషన్‌తో ఎంవోయూ కుదుర్చుకుంటున్నది. ఇందులో రూ.8 కోట్ల మేర నిధులతో విశాఖలోని రీజనల్ ఫుడ్ ల్యాబొరేటరీని స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీగా అభివృద్ధి చేయనున్నారు.

విద్యుత్ చార్జీలపై అచ్చోసిన అబద్ధాలు

- ప్రభుత్వం విద్యుత్ చార్జీలను ఏడాదిలో మూడు సార్లు పెంచిందంటూ 'ఈనాడు' తప్పుడు కథనం
- నిజానికి ఏడాదిన్నరలో విద్యుత్ చార్జీలు పెంచింది ఒక్కసారే
- పైగా విద్యుత్ వాడకపోయినా కట్టాల్సిన నెలవారీ కనీస చార్జీల రద్దు
- 2014–15 నుండి 2018–19 వరకు అప్పటి టీడీపీ తప్పుడు నివేదికతో వసూలు చేయని ట్రూ అప్ చార్జీలు



సాక్షి, అమరావతి: విద్యుత్ చార్జీలపై అవే అబద్ధాలను పదేపదే రాస్తూ.. ప్రజలను మభ్యపెట్టేందుకు 'ఈనాడు' విశ్వప్రయత్నం చేస్తోంది. ఆ క్రమంలోనే 'గుట్టుగా షాక్' అంటూ మరో తప్పుడు కథనాన్ని పతాక శీర్షికన మంగళవారం ప్రచురించింది. తాను చెబుతున్న దానిలో ఏమాత్రం వాస్తవం లేదని తెలిసి కూడా పచ్చి అబద్ధాలను అచ్చోసి వదిలింది. సర్దుబాటు చార్జీల పాపం గత ప్రభుత్వానిదేనని.. ఈ ప్రభుత్వంలో వినియోగదారులపై అదనపు భారం మోపకపోగా.. విద్యుత్ పంపిణీ సంస్థలను ఆదుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిసినా వాటన్నిటినీ పక్కనపెట్టి పచ్చ పత్రిక అవాస్తవాలను పచ్చిగా వండి వార్చేసింది. 'ఈనాడు' విషపు రాతలపై తీవ్రంగా మండిపడిన ఇంధన శాఖ అసలు నిజాలను వెల్లడించింది.

టెలిస్కోపిక్ విధానం వల్ల వినియోగదారులకు మేలు

రాష్ట్ర ప్రభుత్వం ఏడాదిలో మూడుసార్లు విద్యుత్ చార్జీలను పెంచిందనడం పూర్తిగా అవాస్తవమని ఇంధన శాఖ పేర్కొంది. ఏడాదిన్నర కాలంలో విద్యుత్ చార్జీలను పెంచింది ఒకసారి మాత్రమేనని స్పష్టం చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో గృహ విద్యుత్ వినియోగదారుల టారిఫ్‌ను హేతుబద్ధీకరించి ఒక ఉమ్మడి ఏక గ్రూపు టెలిస్కోపిక్ బిల్లింగ్ విధానాన్ని ప్రవేశపెట్టినట్టు వివరించింది. దీనివల్ల వినియోగదారులకు మొదటి స్లాబ్ రాయితీ ధరల ప్రయోజనం అందుతుందని వెల్లడించింది. గతంలో విద్యుత్ వాడకపోయినా నెలవారీ కనీస చార్జీలు కట్టాల్సి వచ్చేదని, ఈ సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి వాటిని రద్దు చేశారని తెలిపింది. దీని ప్రకారం సింగిల్ ఫేజ్ వారికి రూ.65, త్రీ ఫేజ్ వినియోగదారులకు రూ.150 చొప్పున ప్రతినెలా మిగులుతోందని వివరించింది. ఇంధన శాఖ తెలిపిన మరిన్ని వాస్తవాలు ఇలా ఉన్నాయి.

గత ఖర్చులను దాచి పెట్టడం వల్లే..

- ప్రస్తుతం విధిస్తున్న ట్రూ అప్ చార్జీలు గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థ నిర్వహణ కోసం చేసిన వాస్తవ ఖర్చులను నిజాయితీగా బయటపెట్టకపోవడం వల్ల వచ్చినవే తప్ప ఇప్పటి ప్రభుత్వం విధించినవి కావు.
- గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ రంగంలో జరిగిన వాస్తవ ఖర్చులను దాచిపెట్టి .. అన్ని నివేదికలలోనూ తక్కువ అంచనాలు చూపించారు. దానికి సంబంధించిన సర్దుబాటు కోసం అదనంగా ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు.
- డిస్కంలు నష్టాలను భరించడానికి చేసిన అప్పులపై గత ప్రభుత్వంలో ఒక్క రూపాయి వడ్డీ కూడా కట్టలేదు. ఆ అప్పులు తీర్చడానికి సంస్థలకు ఏవిధమైన ఆర్థిక సహాయం చేయలేదు.
- 2014–15 నుంచి 2018–19 వరకూ (మూడవ నియంత్రణ కాలవ్యవధికి) ట్రూ అప్ చార్జీలను రూ.3,977 కోట్లుగా విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) నిర్ధారించింది. ఉచిత వ్యవసాయ విద్యుత్ వినియోగం ఈ ట్రూ అప్ భారం రూ.1,066.54 కోట్లు కాగా.. దీనిని రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీగా మండలి పేర్కొంది. మిగిలిన మొత్తం ఇతర కేటగిరీ (వ్యవసాయం కాకుండా) వినియోగదారుల నుంచి వసూలు చేసుకోవాలని ఈఆర్సీ ఆదేశించింది.
- వినియోగదారులపై ఒకేసారి ఆర్థిక భారం పడకుండా.. అందరి నుంచీ అభ్యంతరాలను తీసుకుని, వినియోగదారులు కోరినట్టు, దక్షిణ, మధ్య డిస్కంల పరిధిలో 36 నెలలు, తూర్పు డిస్కంలో 18 నెలలుగా వసూలు వ్యవధిని నిర్ధారించింది. ఇది ఆగస్టు బిల్లుల నుంచి అమలులోకి వచ్చింది.
- ఈ ట్రూ అప్ చార్జీ కూడా ఎక్కువేం కాదు. ఎస్పీడీసీఎల్‌లో యూనిట్‌కు రూ.0.22 పైసలు, సీపీడీసీఎల్‌లో రూ.0.23 పైసలు, ఈపీడీసీఎల్‌లో రూ.0.7 పైసలు మాత్రమే.

ఈ ప్రభుత్వం రూ.47,530 కోట్లు చెల్లించింది

- 2019–20 ప్రారంభం నాటికి గత ప్రభుత్వం విద్యుత్ పంపిణీ సంస్థలకు చెల్లించాల్సిన సబ్సిడీ బకాయిలు, వివిధ విభాగాల విద్యుత్ వినియోగ చార్జీలు కలిపి దాదాపుగా రూ.12,950 కోట్లు ఉన్నాయి.
- రాష్ట్ర విభజన (2 జూన్, 2014) నాటికి రూ.12,500 కోట్లుగా ఉన్న కొనుగోలు బకాయిలు–నిర్వహణ వ్యయ రుణాలు గత ప్రభుత్వ హయాంలో 2019 ఏప్రిల్ 1 నాటికి రూ.31,844.13 కోట్లకు చేరాయి.
- ప్రభుత్వం 2019 మే నుంచి 2022 సెప్టెంబర్ వరకూ సబ్సిడీ రూపంలో దాదాపు రూ.38,600 కోట్లను డిస్కంలకు ఇచ్చింది. వివిధ విభాగాల విద్యుత్ వినియోగ చార్జీల రూపంలో రూ.8,930 కోట్లు చెల్లించింది. ఇలా మూడున్నరేళ్లలో మునుపెన్నడూ లేనివిధంగా మొత్తం రూ.47,530 కోట్లను విద్యుత్ పంపిణీ సంస్థలకు అందించింది.

గత ప్రభుత్వంలో విద్యుత్ కొనుగోలు బకాయిలు -నిర్వహణ వ్యయ రుణాలు	విషయం	జూన్ 2, 2014 ప్రారంభ నిల్వ	ఏప్రిల్ 1, 2015 నాటికి	ఏప్రిల్ 1, 2016 నాటికి	ఏప్రిల్ 1, 2017 నాటికి	ఏప్రిల్ 1, 2018 నాటికి	ఏప్రిల్ 1, 2019 నాటికి
	కొనుగోలు బకాయిలు	7,696.45	8,846.67	9,754.91	5,721.28	10,043.93	11,722.16
	నిర్వహణ వ్యయ రుణాలు	4,817.69	4,998.76	7,901.22	7,999.88	8,558.81	20,121.97
	మొత్తం (రూ.కోట్లలో)	12,514.14	13,845.43	17,656.13	13,721.16	18,602.74	31,844.13

వైజాగ్ పోర్టుకు 6 కనెక్టివిటీ ప్రాజెక్టులు



జ్యోతి ప్రజ్వలనం చేసి మారిటైమ్ సమ్మిట్ ప్రారంభిస్తున్న పోర్టు చైర్మన్ రామ్మోహన్‌రావు

సాక్షి, విశాఖపట్నం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గతిశక్తి పథకంలో భాగంగా పోర్టు కనెక్టివిటీ రహదారుల్లో వైజాగ్ పోర్టుకు 6 ప్రాజెక్టులను కేటాయించినట్టు పోర్టు చైర్మన్ కె.రామ్మోహన్‌రావు చెప్పారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో పోర్టు ప్రధాన కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించే మారిటైమ్–2022 సదస్సు మంగళవారం ప్రారంభమైంది. రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 35 మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్(ఎంఎంఎల్‌పీ)లో భాగంగా విశాఖపట్నం లాజిస్టిక్ హబ్‌గా భాసిల్లుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 16 మంత్రిత్వ శాఖల సమన్వయంతో ఏర్పాటు చేసిన గతిశక్తి ద్వారా ప్రాజెక్టులు వేగవంతం అవుతాయన్నారు. వాల్తేరు రైల్వే డివిజనల్ మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి మాట్లాడుతూ.. పోర్టులు, రైల్వేలు పరస్పర సహకారంతో గతిశక్తి ప్రాజెక్టులో కీలకంగా వ్యవహరించనున్నాయన్నారు. డబ్లింగ్, ట్రిప్లింగ్ పనులు పూర్తి చేసి.. విశాఖపట్నం రైల్వే జంక్షన్‌ను శరవేగంగా అభివృద్ధి చేసే చర్యలకు ఉపక్రమిస్తున్నట్టు వివరించారు.

రూ.1,700 కోట్లు.. 6,150 కిలో మీటర్లు

▶ మొదటి పేజీ తరువాయి

డిసెంబర్ చివరి నాటికి పూర్తిచేయనుంది. దాంతో రెండో దశ కింద రాష్ట్రంలో రోడ్ల పునరుద్ధరణ పనులపై ఆర్ అండ్ బీ శాఖ జిల్లాల నుంచి ప్రతిపాదనలను తెప్పించుకుంది. ఆ ప్రతిపాదనలతో రెండో దశ ప్రణాళికను రూపొందించింది.

రూ.1,700 కోట్లతో ప్రణాళిక ఇలా..

రాష్ట్రంలోని 26 జిల్లాల్లో మొత్తం 953 రోడ్లను రెండో దశలో పునరుద్ధరించాలని నిర్ణయించింది. వాటిలో రాష్ట్ర ప్రధాన రహదారులు 292, జిల్లా ప్రధాన రహదారులు 661 ఉన్నాయి. తద్వారా మొత్తం 6,150 కి.మీ. మేర రోడ్లను పునరుద్ధరిస్తారు. ఇందుకోసం రూ.1,700 కోట్లతో ప్రణాళికను ఖరారుచేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్ర ప్రధాన రహదారులకు రూ.673 కోట్లు, జిల్లా ప్రధాన రహదారులకు రూ.1,027 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. దీనికి ఆమోదముద్ర లభించిన తరువాత టెండర్ల ప్రక్రియ చేపడతారు. అనంతరం ఏడాదిలోగా పనులు పూర్తిచేయాలన్నది ఆర్ అండ్ బీ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

రెండో దశ కింద పునరుద్ధరించనున్న రోడ్ల వివరాలు.. (రూ.కోట్లలో)

జిల్లా	రోడ్లు	నిధులు	జిల్లా	రోడ్లు	నిధులు
			గుంటూరు	34	68.86
శ్రీకాకుళం	47	70.40	బాపట్ల	42	87.36
విజయనగరం	38	79.05	పల్నాడు	34	52.95
పార్వతీపురం మన్యం	38	77.15	ప్రకాశం	27	51.22
ఏఎస్ఆర్	28	47.40	నెల్లూరు	38	89.70
విశాఖపట్నం	14	31.50	తిరుపతి	41	61.02
అనకాపల్లి	48	56.03	చిత్తూరు	57	79.30
కాకినాడ	22	46.00	అన్నమయ్య	53	50.60
అంబేడ్కర్ కోనసీమ	35	69.22	వైఎస్సార్	41	50.00
తూర్పు గోదావరి	29	66.40	కర్నూలు	32	61.04
పశ్చిమ గోదావరి	42	98.60	నంద్యాల	27	52.64
ఏలూరు	44	89.90	అనంతపురం	34	60.66
కృష్ణా	39	72.20	శ్రీసత్యసాయి	40	72.00
ఎన్టీఆర్	29	58.80	మొత్తం	953	1,700.00

మీ భూమి.. మా హామీ

▶ మొదటి పేజీ తరువాయి

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో ప్రారంభించనున్నారు.

పాస్ పుస్తకంలో క్యూఆర్ కోడ్

సర్వే పూర్తయిన గ్రామాల భూ రికార్డులను రాష్ట్ర ప్రభుత్వం జియో కో–ఆర్డినేట్స్ (అక్షాంశాలు, రేఖాంశాలు)తో జారీ చేయనుంది. ప్రతి భూమికి ల్యాండ్ పార్సిల్ మ్యాప్, భూహక్కు పత్రం, ప్రాపర్టీ పార్సిల్ మ్యాప్, ప్రతి గ్రామానికి రెవెన్యూ విలేజ్ మ్యాప్ జారీ చేయనున్నారు. ప్రతి భూ కమతానికి ఆధార్ నెంబర్ తరహాలో ఒక విశిష్ట సంఖ్య (ఐడీ నంబర్), క్యూఆర్ కోడ్ కేటాయిస్తారు. పట్టాదార్ పాస్ పుస్తకంలో పొందుపరిచే ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆ భూమికి సంబంధించిన అన్ని వివరాలు లభ్యమవుతాయి. రీ సర్వే తర్వాత జారీ చేసే డిజిటల్ రెవెన్యూ రికార్డులను ట్యాంపరింగ్ చేయడం సాధ్యపడదు. భూ యజమానికి తెలియకుండా భూమి రికార్డుల్లో మార్పు చేయడం అసాధ్యం. డబుల్ రిజిస్ట్రేషన్‌కు ఆస్కారం ఉండదు. రీ సర్వే ద్వారా భూ రికార్డుల వ్యవస్థ పూర్తిగా ప్రక్షాళన కానుంది. అత్యంత పకడ్బందీగా భూముల కొత్త రికార్డు తయారవుతోంది. ఏళ్ల తరబడి కొనసాగుతున్న భూ వివాదాలు పరిష్కారమవుతాయి. భూ అక్రమాలకు తావుండదు.

ఉచితంగా.. రికార్డు వేగంతో

తొలిదశ కింద రీ సర్వే పూర్తయిన 2 వేల గ్రామాల్లో 4.3 లక్షల పట్టా సబ్ డివిజన్లు చేశారు. 2 లక్షల మ్యుటేషన్లు జరిగాయి. సాధారణంగా పట్టా సబ్ డివిజన్, మ్యుటేషన్ కోసం పట్టే సమయం, తిప్పలు అందరికీ తెలిసిందే. అయితే రీ సర్వే ద్వారా రైతుల నుంచి చిల్లిగవ్వ తీసుకోకుండా ఈ పనుల్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేస్తోంది. పట్టా సబ్ డివిజన్ కోసం సచివాలయం, మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకుంటే రూ.600 చెల్లించాలి. మ్యుటేషన్ కోసం అయితే రూ.100 కట్టాలి. ఈ లెక్కన 4.3 లక్షల పట్టా సబ్ డివిజన్లు, 2 లక్షల మ్యుటేషన్లను రైతులు సొంతంగా చేసుకోవాలంటే రూ.37.57 కోట్లు ఖర్చవుతుంది. రీసర్వే ద్వారా ప్రభుత్వమే ఉచితంగా ఈ పనుల్ని చేపట్టి రైతులకు డబ్బులు మిగల్చడంతోపాటు వారి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించింది. 2 వేల గ్రామాల్లో రీ సర్వేను కేవలం 8–9 నెలల్లోనే పూర్తి చేయడం రికార్డు. మరో 15 రోజుల్లో ఈ గ్రామాల్లో సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

డ్రోన్లు.. విమానాలు.. ఆధునిక టెక్నాలజీతో

2020 డిసెంబర్ 21న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. అత్యంత ఆధునిక సర్వే టెక్నాలజీతో విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్లు, కంటిన్యుస్‌లీ ఆపరేటింగ్ రిఫరెన్స్ స్టేషన్స్ (సీఓఆర్ఎస్), జీఎన్ఎస్ఎస్ రోవర్లతో కేవలం 5 సెంటీమీటర్ల కచ్చితత్వం (తేడా)తో రైతులు సంతృప్తి చెందేలా సర్వేను నిర్వహిస్తున్నారు. భూహక్కు పత్రాల ద్వారా యజమానులకు రికార్డుల్లో యాజమాన్య హక్కులు కల్పించడం, వారి భూముల హద్దుల్లో భూరక్ష సర్వే రాళ్లు పాతడం ద్వారా రక్షణ కల్పించడం రీ సర్వే ప్రధాన లక్ష్యం. ప్రతి భూమికీ జియో కో–ఆర్డినేట్స్‌తో హద్దులు ఏర్పరచడం, ఐడీ నంబర్, క్యూఆర్ కోడ్ జారీ ద్వారా దేశంలో నవ శకానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాంది పలికింది.

రూ.1,000 కోట్ల అంచనా వ్యయం

2023 డిసెంబర్ నాటికి పూర్తి చేసే లక్ష్యంతో చేపట్టిన ప్రతిష్టాత్మక రీ సర్వే నిర్వహణకు రూ.1,000 కోట్లు ఖర్చవుతుందని అంచనా. భూముల హద్దులను నిర్ధారించి భూరక్ష సర్వే రాళ్లను ప్రభుత్వ ఖర్చుతో పాతుతున్నారు. గ్రామాలు, మున్సిపాల్టీల్లోని భూములను కూడా తొలిసారి సర్వే చేసి ఇళ్ల యజమానులకు ఓనర్‌షిప్ సర్టిఫికెట్లు జారీ చేయనున్నారు. దేశంలోనే మొదటిసారిగా భూములకు సంబంధించిన అన్ని సేవలను సింగిల్ డెస్క్ విధానంలో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోకి తెచ్చారు. సర్వే, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ లాంటి అన్ని సేవల్ని పొందే సౌలభ్యం కల్పించారు.

నిర్విరామంగా మహాయజ్ఞం

రీ సర్వే మహాయజ్ఞంలో సర్వే ఆఫ్ ఇండియా, రెవెన్యూ, సర్వే, పంచాయతీరాజ్, మున్సిపల్ పరిపాలన, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు, ఉద్యోగులు అలుపెరగకుండా పని చేస్తున్నారు. ఆధునిక సర్వే టెక్నాలజీలపై సర్వే సెటిల్మెంట్ శాఖ నియమించిన 10,185 మంది గ్రామ సర్వేయర్లకు 70కిపైగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. రీ సర్వేలో అందే అభ్యంతరాలు, వినతులను పరిష్కరించేందుకు మొబైల్ మేజిస్ట్రేట్ బృందాలను నియమించి ఎక్కడికక్కడ పరిష్కరిస్తున్నారు. మండలానికి ఇద్దరు చొప్పున 1,358 మంది మండల మొబైల్ మేజిస్ట్రేట్‌లను నియమించారు. 2,797 మంది వీఆర్‌ఓలు, 7,033 మంది పంచాయతీ కార్యదర్శులు, 3,664 మంది వార్డు ప్లానింగ్ కార్యదర్శులు రీసర్వేలో నిమగ్నమయ్యారు. ఇప్పటివరకు 6,819 గ్రామాల్లో డ్రోన్ల ద్వారా 47,276 చదరపు కిలోమీటర్లను సర్వే చేశారు. 2,000 గ్రామాల్లో రీసర్వే అన్ని దశలు పూర్తయింది. అందులో 1,835 గ్రామాలకు 7,92,238 మంది రైతుల భూహక్కు పత్రాలు జారీ అయ్యాయి. హక్కు పత్రాల పంపిణీ ద్వారా రీ సర్వే మహా యజ్ఞ ఫలాలను సీఎం జగన్ రైతులకు అందించనున్నారు.

రీ సర్వే స్వరూపం ఇదీ..

మొత్తం రెవెన్యూ గ్రామాలు	17,461
మొత్తం వ్యవసాయ భూమి	2.26 కోట్ల ఎకరాలు
మొత్తం గ్రామ కంఠాలు	13,371
గ్రామ కంఠాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు భూములు	85 లక్షలు
మొత్తం సర్వే నంబర్లు	2.47 కోట్లు
మొత్తం రైతులు	1.07 కోట్లు
రీసర్వే పూర్తయిన గ్రామాలు	2,000
భూహక్కు పత్రాలు జారీ అయిన రైతులు సంఖ్య	7,92,238

ప్రతి దశలో రైతుల భాగస్వామ్యం

రీ సర్వే ప్రతి దశలోనూ రైతులను భాగస్వాముల్ని చేస్తున్నాం. భూరక్ష, భూహక్కు కల్పిస్తున్నాం. సర్వే తర్వాత కూడా ఏమైనా తప్పులుంటే రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు. వాటిని సరిచేస్తాం. సర్వే పూర్తయిన 2 వేల గ్రామాల్లో 4.5 లక్షల సబ్ డివిజన్లు, 2 లక్షల మ్యుటేషన్లు జరిగాయి. ఇవన్నీ 8 నెలల్లోనే చేశాం.

– జి సాయిప్రసాద్, సీసీఎల్ఏ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి


అత్యంత వేగంగా రీ సర్వే

తక్కువ సమయంలో 2 వేల గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశాం. దేశంలో ఇంత తక్కువ సమయంలో సర్వే చేయడం ఎప్పుడూ, ఎక్కడా జరగలేదు. కొత్త రెవెన్యూ రికార్డులు అందిస్తున్న ఏకైక ప్రభుత్వంగా రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తుంది. లక్షల మంది పేర్లను రెవెన్యూ రికార్డుల్లో చేర్చడం, పెద్ద ఎత్తున మ్యుటేషన్లు, సబ్ డివిజన్లు చేయడం గొప్ప విషయం. రీసర్వే తర్వాత కూడా రైతులు ఎప్పుడైనా తమ రికార్డులను అప్‌డేట్ చేసుకోవచ్చు.

– సిద్ధార్థ జైన్, కమిషనర్, సర్వే సెటిల్మెంట్, భూ రికార్డుల శాఖ

దేశమంతటా సచివాలయాలు

▶ మొదటి పేజీ తరువాయి



కేంద్రానికి నిపుణుల బృందం ఇచ్చిన నివేదికలోని భాగాలు



గ్రామ సచివాలయ వ్యవస్థను దేశవ్యాప్తంగా అమలు చేయడం ద్వారా పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు చేపట్టే కార్యక్రమాలు సమర్థంగా ప్రజలకు చేరే వీలుంటుందని కేంద్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక నిపుణుల కమిటీ సూచించింది. పేదరిక నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం కోసం కేంద్ర ప్రభుత్వ రిటైర్డ్ కార్యదర్శి అరుణాశర్మ, తమిళనాడు రిటైర్డ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ రంజన్ నేతృత్వంలో సామాజిక, ఆర్థికాభివృద్ధి, సోషల్ ఇంజనీరింగ్ తదితర రంగాలకు చెందిన 32 మంది నిపుణులతో కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఓ కమిటీని నియమించింది. కమిటీ సభ్యులు ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చిలో ఆంధ్రప్రదేశ్‌తోపాటు గుజరాత్, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, అరుణాచల్‌ప్రదేశ్, జమ్ము కాశ్మీర్, నాగాలాండ్ రాష్ట్రాల్లో పర్యటించారు. ఫిబ్రవరి 17 – 27వ తేదీల మధ్య నలుగురు సభ్యులతో కూడిన ప్రతినిధుల బృందం శ్రీకాకుళం, విశాఖపట్నం, చిత్తూరు జిల్లాల్లోని 23 గ్రామ పంచాయతీల్లో పర్యటించింది. క్షేత్ర స్థాయి పర్యటన అనంతరం కమిటీ సమర్పించిన నివేదికను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ తాజాగా తన అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

సొంత పథకాలతో మరింత సాయం

సచివాలయ వ్యవస్థ ఏర్పాటు సహా గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వినూత్న విధానాలను అనుసరిస్తూ ప్రత్యేక స్థానంలో నిలిచిందని కమిటీ తన నివేదికలో ప్రస్తావించింది. రెండు విధానాలు మన రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను దేశంలోనే అగ్రస్థానంలో నిలబెడుతున్నాయి. గ్రామీణాభివృద్ధి, పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలకు తోడు ఆంధ్రప్రదేశ్ పలు సొంత పథకాలు, కార్యక్రమాలను అమలు చేయడం ఇందులో ఒకటి. ఇక రెండోది.. కేంద్ర పథకాల ద్వారా లబ్ధిదారులకు అందించే ఆర్థిక సాయానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరింత అదనపు సాయాన్ని జోడిస్తోంది. తద్వారా కేంద్రం నిర్దేశించిన దానికంటే ఎక్కువ మందికి ప్రయోజనం చేకూరుస్తున్నట్లు కమిటీ తన నివేదికలో వెల్లడించింది.

పింఛన్ల పంపిణీ విధానం అనుసరణీయం..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి నెలా 1వ తేదీనే రూ.2,500 – రూ.10,000 చొప్పున వివిధ కేటగిరీల వారికి సామాజిక పింఛన్లను ఠంచన్‌గా పంపిణీ చేయడాన్ని నిపుణుల కమిటీ తన నివేదికలో ప్రత్యేకంగా పేర్కొంది. దేశంలో పెద్ద రాష్ట్రాల్లో సైతం లేని విధంగా భారీ స్థాయిలో ప్రతి నెలా దాదాపు 62 లక్షల మందికి సక్రమంగా పింఛన్ల పంపిణీ జరుగుతున్న విషయాన్ని నివేదికలో ఉదహరించింది. పేదలకు సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత అంశంగా పరిగణిస్తోందని తెలిపింది. ప్రతి నెలా ఒకటవ తేదీ సాయంత్రం 3 – 4 గంటలకే 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తవుతోందని, ఎలాంటి పడిగాపులు లేకుండా వలంటీర్లు లబ్ధిదారుల ఇంటి వద్దకే డబ్బులు అందిస్తున్నారని ప్రశంసించింది. వివిధ కారణాలతో మిగిలిపోయిన మరో పది శాతం మందికి రెండు మూడు రోజుల్లోగా ఇళ్ల వద్ద డబ్బులు పంపిణీ చేస్తున్నారని పేర్కొంది. దేశవ్యాప్తంగా మిగిలిన రాష్ట్రాల్లోనూ పింఛన్ల పంపిణీలో ఈ విధానాన్ని అమలు చేయడం పేదలకు ఎంతో ప్రయోజనకరమని కమిటీ కేంద్రానికి సూచన చేసింది.

సచివాలయ ఉద్యోగుల సేవలతో..

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ సచివాలయాల తరహాలో దేశమంతటా గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాలు పటిష్టంగా అమలు కోసం సిబ్బంది నియామక నిష్పత్తిని పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉందని కమిటీ తన నివేదికలో కేంద్రానికి సూచించింది. దేశంలో మరెక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయాల్లో దాదాపు పది మంది ఉద్యోగులు పని చేస్తుండడాన్ని కమిటీ తన నివేదికలో ప్రత్యేకంగా ప్రస్తావించింది. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు ఏ పథకం, కార్యక్రమాన్ని అమలు చేసినా క్షేత్రస్థాయిలో సమర్థంగా అందాలంటే గ్రామ స్థాయిలో తగినంత మంది సిబ్బంది అవసరమని కమిటీ పేర్కొంది. 'పంచాయతీల స్థాయిలో సచివాలయ భావనతోపాటు ఉద్యోగులు రోజూ నిర్ణీత సమయం కార్యాలయంలో అందుబాటులో ఉండడం వల్ల ఫిర్యాదుల పరిష్కారంలో ప్రజలకు సత్వర న్యాయం దక్కుతుంది' అని కమిటీ తన నివేదికలో పేర్కొంది.

టెన్త్‌లో సైన్స్‌కు ఒకే పేపర్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో సైన్సు పరీక్ష ఇకనుంచి ఒకే పేపర్‌గా జరుగుతుంది. సైన్సులో భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రాలను రెండు వేర్వేరు పేపర్లుగా కాకుండా ఒకే ప్రశ్నపత్రంతో నిర్వహించనున్నారు. ఈ రెండు సబ్జెక్టుల ప్రశ్నలను రెండు విభాగాలుగా.. ఒకే ప్రశ్నపత్రంలో ఇస్తారు. ఈ విద్యాసంవత్సరం నుంచి టెన్త్‌లో 6 పేపర్ల విధానాన్నే అనుసరిస్తున్నట్టు ప్రభుత్వం ఇంతకుముందు ఉత్తర్వులు జారీచేసిన నేపథ్యంలో రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) బ్లూప్రింట్లు, నమూనా ప్రశ్నపత్రాలను రూపొందించిన సంగతి తెలిసిందే. బ్లూప్రింట్ మేరకు రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్ పరీక్షల నిర్వహణకు సన్నాహాలు చేపట్టింది.

ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు

గతంలో టెన్త్ పరీక్షలు నిరంతర సమగ్ర మూల్యాంకనం (సీసీఈ) విధానంలో 11 పేపర్లలో జరిగేవి. అంతర్గత మార్కులు 20 ఉండగా పబ్లిక్ పరీక్షలను 80 మార్కులకు నిర్వహించేవారు. 2016–17 నుంచి ఈ విధానం అమల్లోకి వచ్చింది. ప్రైవేటు పాఠశాలలు అంతర్గత మార్కుల్లో అక్రమాలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు రావడంతో తరువాత టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో అంతర్గత మార్కులను రద్దు చేసి 100 మార్కులకు నిర్వహించేలా ఉత్తర్వులు ఇచ్చారు. అనంతరం కరోనా సమయంలో పరీక్షల నిర్వహణకు తీవ్ర ప్రతికూల పరిస్థితులు నెలకొనడంతో 11 పేపర్లకు బదులు పరీక్షను 7 పేపర్లకు ప్రభుత్వం కుదించింది. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, మేథ్స్, సోషల్ స్టడీస్ పేపర్లను 100 మార్కులకు, ఫిజికల్ సైన్సు, బయోలాజికల్ సైన్సు పేపర్లను 50 మార్కుల చొప్పున రెండురోజుల పాటు నిర్వహించారు. 2022 టెన్త్ పబ్లిక్ పరీక్షలు కూడా ఇదే విధానంలో జరిగాయి. కాగా, సీసీఈ విధానంలో 4 ఫార్మేటివ్, 2 సమ్మేటివ్ పరీక్షలను నిర్వహిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను ఏడాదిలో నిరంతరం మూల్యాంకనం చేస్తున్నందున ఇక నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలను 7 లేదా 6 పేపర్లకు కుదించి నిర్వహించడం మంచిదని ఎస్సీఈఆర్టీ ప్రభుత్వానికి ఈ ఏడాది ఆగస్టులో ప్రతిపాదనలు పంపించింది. పరిశీలించిన ప్రభుత్వం 2022–23 నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు 6 పేపర్లతోనే నిర్వహించేలా జీవో–136ను ఆగస్టు 22న విడుదల చేసింది. గత ఏడాది ఏడు పేపర్లుగా టెన్త్ పరీక్షలు నిర్వహించిన సమయంలో సైన్సును ఫిజికల్ సైన్సు, బయోలాజికల్ సైన్సు పేపర్లుగా వేర్వేరుగా నిర్వహించారు. ఈ విద్యాసంవత్సరం నుంచి మొత్తం పేపర్లను ఆరింటికే కుదించినందున సైన్సును రెండు పేపర్లుగా కాకుండా ఒకే పేపర్‌గా 100 మార్కుల ప్రశ్నపత్రంతో ఒకేరోజు నిర్వహించనున్నారు.

పరీక్ష ఒకటే.. సమాధాన పత్రాలు రెండు

ఇకనుంచి సైన్సు ఒకే పేపర్‌గా 33 ప్రశ్నలతో 100 మార్కులకు నిర్వహించనున్నారు. మొత్తం 33 ప్రశ్నలను 2 భాగాలుగా చేసి ఫిజికల్ సైన్సులో 16 ప్రశ్నలను, బయోలాజికల్ సైన్సులో 17 ప్రశ్నలను ఇవ్వనున్నారు. ఈ ప్రశ్నలకు సమాధానాలను వేర్వేరు బుక్‌లెట్లలో రాయాల్సి ఉంటుంది. ఫిజికల్ సైన్సు, బయోలాజికల్ సైన్సు సమాధానాలను వేర్వేరు టీచర్లు మూల్యాంకనం చేయాల్సి ఉన్నందున ఇలా రెండు సమాధానాల బుక్‌లెట్లను ఇవ్వనున్నారు.

25 నుంచి ఫీజుల చెల్లింపు

మార్చి–2023లో నిర్వహించే టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఈ నెల 25వ తేదీ నుంచి డిసెంబర్ 10వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించవచ్చని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానందరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలస్య రుసుము రూ.50తో డిసెంబర్ 11 నుంచి 20 వరకు, రూ.200 ఆలస్య రుసుముతో డిసెంబర్ 21 నుంచి 25 వరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబర్ 26 నుంచి 30వ తేదీ వరకు చెల్లించవచ్చని వివరించారు.

చెంగల్రాయుడును అరెస్ట్ చేయాలి

- పోలీసు, న్యాయ వ్యవస్థలకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలి
- పోలీసు అధికారుల సంఘం డిమాండ్
- చెంగల్రాయుడు, చంద్రబాబుపై వివిధ ప్రాంతాల్లో న్యాయవాదుల ఫిర్యాదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్)/విజయవాడ స్పోర్ట్స్/సాక్షి, భీమవరం/ఉండి/నెల్లూరు(లీగల్): రాజ్యాంగబద్ధమైన పోలీసు, న్యాయ వ్యవస్థలపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లేలా కుట్రపూరితమైన వ్యాఖ్యలు చేసిన టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడును తక్షణమే అరెస్ట్ చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం డిమాండ్ చేసింది. కర్నూలు జిల్లాలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశంలో చెంగల్రాయుడు పోలీసు, న్యాయ వ్యవస్థలను కించపరిచే విధంగా పరుష పదజాలంతో దూషించడాన్ని తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఏపీ పోలీసు అధికారుల సంఘ అధ్యక్షుడు జె.శ్రీనివాసరావు విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా 14 ఏళ్లు పనిచేసిన చంద్రబాబు సమక్షంలోనే చెంగల్రాయుడు పోలీసు, న్యాయ వ్యవస్థలను తిడుతూ కుట్రపూరిత వ్యాఖ్యలు చేశారని, అయినా ఆయన ఖండించకపోవడం అత్యంత దుర్మార్గమని అన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రజలకు, పోలీసు, న్యాయ వ్యవస్థలకు చంద్రబాబు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. చెంగల్రాయుడు లాంటి వ్యక్తులను చట్టసభలకు పంపిన చంద్రబాబు సిగ్గుపడాలన్నారు. ఇటీవల కొంతమంది నాయకులు తమ రాజకీయ స్వార్థం, స్వలాభం కోసం పోలీసు వ్యవస్థపై పరుష పదజాలంతో నిరాధారమైన, అవాస్తవమైన వ్యాఖ్యలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. మాజీ సీఎం చంద్రబాబు ఒక సందర్భంలో పోలీసులను కట్టు బానిసలుగా అభివర్ణించారని, దానిని కూడా ఖండిస్తున్నామని శ్రీనివాసరావు చెప్పారు. పోలీసులు రాజ్యాంగానికి, చట్టాలకు లోబడి విధులు నిర్వహించడంలో మాత్రమే కట్టు బానిసలుగా ఉంటారని స్పష్టంచేశారు. పోలీసు వ్యవస్థ మీద విమర్శలపై న్యాయపోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఏపీ పోలీసు అధికారుల సంఘ ఉపాధ్యక్షుడు ఆర్.రఘురాం, సీఐడీ యూనిట్ అధ్యక్షుడు అక్కిరాజు, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు, సభ్యుడు సత్యారావు, విజయవాడ నగర అధ్యక్షుడు ఎం.సోమయ్య పాల్గొన్నారు.



విజయవాడ పోలీస్ కమిషనర్ టీకే రాణాకు ఫిర్యాదు చేస్తున్న న్యాయవాదులు

చెంగల్రాయుడు, చంద్రబాబుపై విజయవాడలో సీపీకి న్యాయవాదుల ఫిర్యాదు

న్యాయ, పోలీసు వ్యవస్థలను కించపరిచేలా టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు తీవ్ర వ్యాఖ్యలు చేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విజయవాడకు చెందిన న్యాయవాదులు మంగళవారం ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణాకు ఫిర్యాదు చేశారు. చెంగల్రాయుడును ప్రోత్సహించిన చంద్రబాబుపై కూడా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీపీకి ఫిర్యాదు చేసిన వారిలో న్యాయవాదులు జి.నాగిరెడ్డి, పి.నిర్మల్ రాజేష్, జె.జయలక్ష్మి, నరహరిశెట్టి శ్రీహరి, కె.వెంకటేష్‌శర్మ, గవాస్కర్, జి.కిరణ్, ఎస్.పరమేష్, బసవారెడ్డి, పి.రాంబాబు, కె.ప్రభాకర్, బి.రమణి, అల్లాభక్షు, ఎం.విఠల్‌రావు, ఎస్.కోటేశ్వరరావు, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

పలు ప్రాంతాల్లో ఫిర్యాదులు

చెంగల్రాయుడు, చంద్రబాబుపై భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో, పశ్చిమగోదావరి జిల్లా ఉండి పోలీస్ స్టేషన్‌లో, ఏలూరులో, నెల్లూరులోని చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో, తిరుపతిలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు ఫిర్యాదు చేశారు. చెంగల్రాయుడు వ్యాఖ్యలతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని, ఆయనపై చర్యలు చేపట్టాలని కోరారు. న్యాయ వ్యవస్థ, పోలీసులను కించపరిచేలా చెంగల్రాయుడు వ్యాఖ్యలు చేశారని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయనను ప్రోత్సహించిన చంద్రబాబుపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు.



పాలకొల్లులో కొనసాగుతున్న ప్రభుత్వ వైద్యకళాశాల నిర్మాణ పనులు


- రూ.475 కోట్లతో కళాశాలను నిర్మిస్తున్న ప్రభుత్వం



పాలకొల్లులో వైద్య కళాశాల నిర్మాణం కోసం పనులు జరుగుతున్న దృశ్యాలు

సాక్షి, అమరావతి: నరసాపురం పర్యటన సందర్భంగా పాలకొల్లులో ప్రభుత్వ వైద్యకళాశాల నిర్మాణ పనులు చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అబద్ధాలు చెప్పారంటూ పచ్చపత్రిక తప్పుడు ప్రచారానికి దిగింది. అయితే ఈ వ్యవహారం వెనుక వాస్తవాలు ఓ సారి గమనిస్తే.. వైద్యశాఖలో సమూల మార్పులకు సీఎం జగన్ సర్కార్ శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా నాడు–నేడు కార్యక్రమం కింద 17 కొత్త వైద్యకళాశాలల నిర్మాణం చేపడుతున్నారు. ఈ క్రమంలోనే పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో రూ.475 కోట్లతో ప్రభుత్వం వైద్యకళాశాల నిర్మాణం చేపట్టింది. ప్యాకేజ్–3 కింద పాలకొల్లు, ఏలూరు వైద్యకళాశాలల నిర్మాణం చేపడుతుండగా ఈ కాంట్రాక్టును మెగా ఇంజనీరింగ్ సంస్థ దక్కించుకుంది. ఈ ఏడాది జూన్ 28వ తేదీన ఆ సంస్థకు ఎల్‌వోఏ జారీచేశారు. పాలకొల్లు వైద్యకళాశాల నిర్మాణానికి నాబార్డు ఈ ఏడాది సెప్టెంబర్ 27న రూ.275 కోట్ల రుణం మంజూరు చేసింది. దీంతో వైద్యకళాశాల నిర్మాణ పనులు మొదలయ్యాయి. ప్రీ కన్‌స్ట్రక్షన్ కార్యకలాపాలను ప్రారంభించి మానవ, ఇతర వనరులను సమకూరుస్తోంది. పేదప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని ప్రభుత్వరంగంలో అందించడమే లక్ష్యంగా కొత్త వైద్యకళాశాలల నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేస్తోంది. ఇటీవల వరదల నేపథ్యంలో ఆ ప్రదేశంలో నీరు చేరడంతో పనులు ఆలస్యమయ్యాయి. వాస్తవాలు ఇలా ఉంటే ప్రభుత్వంపై బురద చల్లడమే లక్ష్యంగా పెట్టుకున్న దుష్టచతుష్టయం పనిగట్టుకుని తప్పుడు వార్తలను ప్రచారం చేస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.







ప్రతి ఉదయమూ మనం కొత్తగా జన్మిస్తున్నాం. ఈరోజు మనం ఏం చేస్తామో అదే అతి ముఖ్యం.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, నవంబర్, 23

అంబరాన ప్రైవేటు సంబరం

అంతరిక్ష యానంలో మరో పెద్ద అడుగు ముందుకు పడింది. శ్రీహరికోటలోని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) రాకెట్ ప్రయోగ కేంద్రం నుంచి 550 కిలోల చిన్న రాకెట్ 'విక్రమ్ ఎస్' గతవారం గగనంలోకి దూసుకుపోవడం చారిత్రక ఘట్టం. దీంతో, రోదసీ రంగంలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యం విషయంలో మన దేశం ఒక్క ఉదుటున ముందుకు ఉరికినట్టయింది. భారత్‌లో ప్రైవేట్ రంగంలో అభివృద్ధి చేసిన తొట్టతొలి రాకెట్ ఇదే. హైదరాబాద్‌కు చెందిన 'స్కైరూట్ ఏరోస్పేస్' సంస్థ దీన్ని రూపొందించడం మరింత ఆనందదాయకం. రానున్న కాలంలో ఈ సంస్థ మరింత పెద్ద రాకెట్లను వరుసగా ప్రయోగించడానికి సిద్ధమవుతోంది. అంటే, అంబర వీధిలో అనేక సంవత్సరాల భారత ప్రయత్నాలు మరో పెద్ద మలుపు తిరగనున్నాయన్న మాట. దేశ అంతరిక్ష ప్రయోగాల్లో ఒకపక్క 'ఇస్రో' ప్రధానపాత్ర కొనసాగిస్తుంటే, మరోపక్క దానికి పూరకంగా ప్రైవేట్ రంగం నిలబడనుంది. దీని పరిణామాలు, విపరిణామాలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి.

భారత అంతరిక్ష ప్రయోగాల మార్గదర్శి విక్రమ్ సారాభాయ్ పేరిట 'విక్రమ్ ఎస్' రాకెట్‌తో సాగించిన ఈ 'ప్రారంభ్' ప్రయోగం శుభారంభం. భారతీయ అంకుర సంస్థలు మరింతగా పాలు పంచుకొనేలా భారత అంతరిక్ష కార్యక్రమానికి తలుపులు తెరవాలన్న కేంద్ర ప్రభుత్వ చొరవ వల్ల ఇది సాధ్యమైంది. నిజానికి, వినువీధిలోకి అంతరిక్ష ప్రయోగ వాహన నౌకలను పంపడం మంచి గిరాకీ ఉన్న వ్యాపారం. ఇటీవలి దాకా అందులో ఆయా దేశ ప్రభుత్వాలదే ఆధిపత్యం. ఎలన్ మస్క్ తన 'స్పేస్ ఎక్స్' సంస్థతో దానికి గండి కొట్టింది. త్వరలోనే అమెజాన్ వారి 'బ్లూ ఆరిజన్' రాకెట్ మార్కెట్‌లోకి రానుంది. అంతరిక్షంలోని సరికొత్త వాణిజ్య అవకాశాలను అంది పుచ్చుకోవడానికి అంతర్జాతీయ సహకారం పెరుగుతుండడంతో ప్రైవేట్ రంగ వికాసానికి దారులు పడ్డాయి.

ఒకప్పుడు మన విహాయస ప్రయోగాలకు అభివృద్ధి, దేశ ప్రతిష్ఠలే మూలమంత్రాలు. ఇప్పుడు బ్రాడ్‌బ్యాండ్‌కు ఉపగ్రహ వినియోగం, చంద్రమండల శోధన, గగనాంతర గవేషణ లాంటివి ముందుకొచ్చాయి. అలా వ్యాపారం, ఆర్థికవ్యవస్థ వచ్చి చేరాయి. శరవేగంగా పెరుగుతున్న ఈ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ విలువ ప్రస్తుతం 45 వేల కోట్ల డాలర్లు. పదేళ్ళలో ఇది ఏకంగా లక్ష కోట్ల డాలర్లకు చేరుతుందట. ఇందులో ఇప్పుడు భారత్ వాటా 2 శాతమే. రానున్న వత్సరాల్లో మన వాటాను చకచకా 8 శాతానికి పెంచాలన్నది ప్రధాని మాట. ప్రైవేట్ రంగ సంస్థలకు సైతం పెద్ద పీట వేస్తేనే ఆ వాటా పెరుగుదల సాధ్యం. ఆ క్రమంలో వచ్చినదే తాజా 'విక్ర'మార్కు విజయం!

ప్రైవేట్ రంగ భాగస్వామ్యంలో అనేక ప్రపంచ దేశాలు ఇప్పటికే చాలా ముందుకు పోయాయి. వారిని అందుకొనేందుకు మనం బహుదూరం ప్రయాణించాల్సి ఉంది. మన ప్రైవేట్ రంగంలోనూ ప్రతిభాపాటవాలున్నాయి. వాటి వినియోగానికి ప్రభుత్వం విధానపరంగా తగిన వాతావరణం కల్పిస్తే సుదీర్ఘ యానం సంక్షిప్తమవుతుంది. ఇన్నేళ్ళ భారత అంతరిక్ష ప్రయోగ పరిణామ క్రమంలో ప్రైవేట్ రంగ పాత్ర లేనే లేదనుకుంటే పొరపాటు. గోద్రెజ్ అండ్ బోయిస్, లార్సెన్ అండ్ టుబ్రో, వాల్‌చంద్‌నగర్ ఇండస్ట్రీస్ లాంటి అనేక ప్రైవేట్ రంగ సంస్థలు తమ వంతు భాగస్వామ్యం వహించాయి. ఇప్పుడిక స్కైరూట్ లాంటి స్టార్టప్‌లు నక్షత్రపథాన నవీన కల్పనలకు పాదులు వేస్తాయి. అయితే, ఆకసాన బలమైన ఆర్థికశక్తిగా ఎదగాలంటే భారీ సంస్థల ప్రవేశం అనివార్యం.

ప్రస్తుతానికి మన అంకుర సంస్థలకు విదేశీ మూలధనమే ఆధారం. మచ్చుకు విక్రమ్‌ను ప్రయోగించిన స్కైరూట్ సంస్థలో ప్రధాన పెట్టుబడులు సింగపూర్‌వి. రేపు మన అంతరిక్ష ప్రయోగాలు తలుపులు బార్లా తెరిచినప్పుడు పాశ్చాత్య సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపడం ఖాయం. ఇవాళ ప్రపంచమంతటా జాతీయ అంతరిక్ష పరిశోధనల్లో అంతర్జాతీయ భాగస్వామ్యమూ పెరుగుతోంది. 50 ఏళ్ళ క్రితం చంద్రునిపై మానవుడి 'అపోలో' ప్రయోగాన్ని జాతీయ ప్రాజెక్ట్‌గా అమెరికా నిర్వహించింది. వారం క్రితం నవంబర్ 16న మరోసారి చంద్రుని పైకి 'ఆర్టెమిస్1' రాకెట్ ప్రయోగాన్ని ఫ్రాన్స్, కెనడా, జపాన్‌లతో కలసి బహుళ దేశాల ప్రయత్నంగా జరిపింది. రష్యా, చైనాలు చుక్కలతోవలో చెట్టపట్టాలు వేసుకోవడమే కాక నెలవంకపై దీర్ఘకాల మానవ ఆవాసానికి సంయుక్త స్థావరం నెలకొల్పే పనిలో ఉన్నాయి.

రయ్యిమంటూ రోదసీలోకి సాగిన మన తొలి ప్రైవేట్ రాకెట్ ప్రయోగాన్ని వీటన్నిటి నేపథ్యంలో చూడాలి. వచ్చే పదేళ్ళలో దేశంలో 20 వేలకు పైగా చిన్న ఉపగ్రహాలు నింగికి ఎగురుతాయట. వ్యాపార సంస్థలు, విద్యాలయాలు, ప్రైవేట్ ప్రయోగశాలలు తాము తీర్చిదిద్దిన ఉపగ్రహాలను ప్రైవేట్ రాకెట్లతో దివికి పంపి, వాతావరణ, భూవిజ్ఞాన సమాచారాన్ని సేకరిస్తాయి. వెరసి, నిన్నటి దాకా ప్రభుత్వ ఆధిపత్యంలోని అంబర చుంబన యాత్రలో ప్రైవేట్ పాదముద్రలు బలంగా పడనున్నాయి. 2020 జూన్‌లోనే అంతరిక్ష కార్యకలాపాలన్నిటా ప్రైవేట్‌కు సర్కారు ద్వారాలు తీసింది. పరిశోధనలకూ, పోటీ తత్త్వానికీ తోడ్పడే ఈ మార్పును స్వాగతిస్తూనే తగు జాగ్రత్తలూ తప్పవు. అంతా ప్రైవేటైపోతే, దేశ రక్షణ మాటేమిటన్న భయాలను పాలకులు పోగొట్టాలి. ఇస్రో అనుభవాన్నీ, మార్గదర్శనాన్నీ వాడుకోవాలి. అమెరికాలో నాసాలా ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానం మేలు. 350కి పైగా ప్రైవేట్ అంతరిక్ష సంస్థలతో అమెరికా, బ్రిటన్, కెనడా, జర్మనీల తర్వాత మనది 5వ స్థానం. భవిష్యత్తులో చుక్కల తోటలో ఎక్కడుంటామో ఆసక్తికరం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు కార్తీక మాసం, **తిథి:** అమావాస్య తె.4.38 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి మార్గశిర శు.పాడ్యమి, **నక్షత్రం:** విశాఖ రా.10.14 వరకు, తదుపరి అనురాధ, **వర్జ్యం:** రా.2.03 నుండి 3.35 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.22 నుండి 12.07 వరకు **అమృతఘడియలు:** ప.1.36 నుండి 3.10 వరకు.

సూర్యోదయం: 6.12
సూర్యాస్తమయం: 5.20
రాహుకాలం: ప. 12.00 నుండి 1.30 వరకు
యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు

సైన్సు అవార్డుల్లో కోతలా?

విశ్లేషణ



అరుణ్ కుమార్ గ్రోవర్

శాస్త్ర ప్రపంచం ప్రతిష్ఠాత్మకంగా భావించే శాంతి స్వరూప్ భట్నాగర్ ప్రైజ్ విజేతల పేర్లను సాంప్రదాయికంగా 'సీఎస్ఐఆర్' ఫౌండేషన్ డే అయిన సెప్టెంబర్ 26న ప్రకటిస్తుంటారు. ఈసారి వారి పేర్లను అప్పుడు ప్రకటించలేదు. పైగా ప్రధాని చేతుల మీదుగా బహూకరించకుండా వారున్న చోటికే అవార్డు పంపించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో 100కి పైగా అవార్డులను దశలవారీగా ఎత్తివేయాలన్న సిఫార్సులూ సాగాయి. ఇటీవలి వారాల్లో ప్రభుత్వ సంస్థలు, రాష్ట్ర విశ్వవిద్యాలయాలు ఉత్తమ పీహెచ్‌డీ థీసిస్ అవార్డులను, ఉత్తమ పరిశోధనా పత్రం అవార్డులను ఇవ్వవద్దని వారి ఫ్యాకల్టీలను ఆదేశించాయి. ఇలాగైతే 2047 నాటికి భారత్ శాస్త్ర ప్రగతిలో స్వావలంబన దేశంగా మారేనా? సృజనాత్మక కృషికి ప్రోత్సాహం ఇలాగేనా?

శాంతి స్వరూప్ భట్నాగర్ (ఎస్ఎస్‌బీ) ప్రైజ్‌ను 1957లో నెలకొల్పారు. భారత శాస్త్ర, పారిశ్రామిక పరిశోధనా సంస్థ (సీఎస్ఐఆర్) ప్రథమ డైరెక్టర్ పేరిట దీన్ని ఏర్పర్చారు. అనువర్తిత లేదా ప్రాథమిక పరిశోధనలో అసాధారణ ప్రతిభ ప్రదర్శించిన వారికి భారత ప్రభుత్వం ఏటా ఈ అవార్డును బహూకరిస్తుంటుంది. అవార్డులు గెలుచుకున్న వారి పేర్లను సాంప్రదాయికంగా సీఎస్ఐఆర్ ఫౌండేషన్ రోజైన సెప్టెంబర్ 26న ప్రకటిస్తూ ఉంటుంది. ఈ సంవత్సరం మాత్రం కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖా మంత్రి జితేంద్ర సింగ్ విజేతల పేర్లను చివరిక్షణంలో ప్రకటించకుండా నిలిపివేశారు. దేశంలోని శాస్త్ర సాంకేతిక రంగానికి సంబంధించిన విభాగాల సెక్రటరీలు, మంత్రులు హాజరైన అత్యున్నత స్థాయి సమావేశానికి ఆ మినిట్స్‌ని పంపించారు.

ప్రధాని నరేంద్రమోదీ దార్శనికతకు అనుగుణంగా ఈ అవార్డు ఎకో సిస్టమ్ మార్పు గురించి ఈ సమావేశం జరిగింది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో 100కి పైగా అవార్డులను దశలవారీగా ఎత్తివేయాలని ఈ సమావేశం సిఫార్సు చేసింది. ఒక్కొక్క ఎస్ఎస్‌బీ ప్రైజ్ విజేతకు ఇస్తున్న రూ. 15 వేల అదనపు నగదు ఉపకార వేతనం స్థానంలో భారీ మొత్తాన్ని ఒకేసారి అందించడం, లేదా నెలవారీ పారితోషికంపై గరిష్ఠంగా 15 సంవత్సరాల పరిమితి విధించడానికి ఉద్దేశించిన ప్రభుత్వ ప్రతిపాదనను కూడా ఈ సమావేశ మినిట్స్ బహిర్గత పరిచాయి. శాంతిస్వరూప్ భట్నాగర్ ప్రైజ్‌కి గరిష్ఠ అర్హతా వయస్సు ప్రస్తుతం 45 సంవత్సరాల వరకు ఉంటోంది. 15 సంవత్సరాల పరిమితి విధించడం వల్ల అది 60 సంవత్సరాల వరకు పెరిగే అవకాశం ఉంది.

శాంతిస్వరూప్ భట్నాగర్ ప్రైజ్‌ను కొనసాగించడానికి ప్రభుత్వం అనుమతించిందని ఈ సంవత్సరం సీఎస్ఐఆర్ సంస్థాపక దినం రోజున ప్రకటించడానికి ప్రయత్నించారు. కానీ సీఎస్ఐఆర్ సొసైటీ సమావేశాన్ని అక్టోబర్ 15న ప్రధాని అధ్యక్షతన నిర్వహించినప్పుడు, తదుపరి ఎస్ఎస్‌బీ అవార్డు ప్రదాన ఉత్సవాలు జరిపే తేదీని ఇంకా నిర్ణయించాల్సి ఉందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి ప్రకటించారు. మూడు వారాల తర్వాత 2019–21 సంవత్సరానికి గాను ఈ అవార్డులను 37 మందికి వారు ఉన్న చోటకే అవమానకరంగా పంపించారు. కాగా 2012–2015, 2016–2018 సంవత్సరాలకుగానూ 2016, 2019లలో ప్రధాని ఈ అవార్డును జాతీయ సైన్సు దినోత్సవం (ఫిబ్రవరి 28/29న) సందర్భంగా విజ్ఞాన్ భవన్‌లో బహూకరించారు.

2020లో ప్రచురితమైన సీఎస్ఐఆర్ డాక్యుమెంట్ ప్రకారం, ఇంతవరకు ఎస్ఎస్‌బీ ప్రైజ్‌ని గెలుచుకున్న 560 మందిలో అప్పటికి 244 మంది మూడు జాతీయ సైన్సు అకాడమీలకు ఫెలోలుగా ఎంపికయ్యారు. 143 మంది ఇటలీలోని థర్డ్ వరల్డ్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్(టీడబ్ల్యూఏఎస్)కు ఫెలోలుగా ఎంపికయ్యారు. 64 మందికి టీడబ్ల్యూఏఎస్ ప్రైజ్ వచ్చింది. 25 మంది రాయల్ సొసైటీ ఫెలోషిప్‌కి ఎంపికయ్యారు. మరో 15 మంది అమెరికాకు చెందిన నేషనల్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ విదేశీ అసోసియేట్స్‌గా ఎంపిక య్యారు. మరో 30 మంది ఇన్ఫోసిస్ సైన్స్ ప్రైజ్ అందుకున్నారు. కనీసం 100 మంది పద్మ పురస్కారాన్ని స్వీకరించారు. శాంతి స్వరూప్ భట్నాగర్ ప్రైజ్ గెలుచుకున్న వారి ప్రతిభను ఈ డేటా తేటతెల్లం చేస్తోంది.



భట్నాగర్ లారెట్స్ (1958–2018) అనే శీర్షికతో ప్రచురితమైన పుస్తకం ఎస్ఎస్‌బీ ప్రైజ్ చరిత్రను వివరిస్తుంది. ఈ ప్రైజ్‌ని 1958లో బహూకరించారు. తొలి గ్రహీతకు ఒక ఫలకం, రూ. 10,000 నగదును బహుమతిగా ఇచ్చారు. తొలి బహుమతి పుచ్చుకున్నది భట్నాగర్ సమకాలికుడు అయిన సర్ కేఎస్ కృష్ణన్ (1940). 60 ఏళ్ల వయసులో ఈయనకు తొలి ప్రైజ్ దక్కింది. రెండో సంవత్సరం అంటే 1959లో ఇద్దరు గణిత శాస్త్రజ్ఞులు కె చంద్రశేఖరన్, సీఆర్ రావులకు ఈ ప్రైజ్ దక్కింది. ఆనాటికి వీరి వయస్సు 39 సంవత్సరాలు మాత్రమే. ప్రస్తుతం, ఏడు రంగాలకు కలిపి ఈ అవార్డును ఇస్తున్నారు. ప్రైజ్ మొత్తం 2008లో రూ. 5 లక్షలకు పెరిగింది. ఒక సబ్జెక్టులో ఎంత మందికి అవార్డు ఇచ్చారనే దాంతో సంబంధం లేకుండా ఎంపికైన ప్రతి ఒక్కరికీ తలా రూ. 5 లక్షలను ఇస్తూ వచ్చారు. దీనికి తోడుగా, దశాబ్దం క్రితం బహుమతి గ్రహీతలందరికీ రూ. 15,000 ఉపకార వేతనం ఇవ్వడం మొదలెట్టారు. గత విజేతలకూ దీన్ని వర్తింపజేశారు.

ఎస్ఎస్‌బీ అవార్డు గ్రహీతలకు నెలవారీ చెల్లింపులు జరపాలనేది మెరుగైన ప్రతిభ కనబర్చినవారికి నగదు ప్రోత్సాహకం ఇవ్వాలన్న భావనలోంచి వచ్చింది. నాలుగు నేషనల్ సైన్స్, ఇంజినీరింగ్ అకాడమీలలో కనీసం రెండింటిలో రీసెర్చ్ ఫెలోస్‌గా ఎంపికైన యూనివర్సిటీ టీచర్లకు నెలకు రూ. 15 వేల నగదు ప్రోత్సాహకం ఇవ్వడానికి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ, యూజీసీ, శాస్త్ర సాంకేతిక శాఖ (డీఎస్‌టీ) ఆసక్తి చూపాయి. ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలకు జేసీ బోస్ ఫెలోషిప్ కింద మరొక రూ. 25,000లను అందించే మరొక పథకంతో డీఎస్‌టీ ముందుకొచ్చింది. అత్యంత ప్రతిభావంతుడైన భారత శాస్త్రవేత్తకు సీఎస్ఐఆర్ లేదా యూజీసీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ పథకం కింద, దాంతోపాటు డీఎస్‌టీ – జేసీ బోస్ ఫెలోషిప్ కింద అందే ద్రవ్యపరమైన ప్రయోజనాలు ఇవే మరి.

ఈలోగా, మెరుగైన ఐఐటీలు కొన్ని తమ సొంత చెయిర్ ప్రొఫెసర్‌షిప్‌లను నెలకొల్పాయి. ఇవి కూడా ద్రవ్యపరమైన ప్రయోజనాలను అర్హులైన శాస్త్రవేత్తలకు ఇస్తూ వచ్చాయి. ఇలాంటి ప్రోత్సాహకాలను స్ఫూర్తిగా తీసుకుని పలు ఇతర సైన్స్ విభాగాలు, మంత్రిత్వ శాఖలు తమతమ సొంత ప్రతిభ ఆధారిత ప్రోత్సాహక పథకాలతో ముందుకొచ్చాయి. సెప్టెంబర్ 16న జరిగిన సమావేశం, ఇలాంటి అన్ని స్కీములను మదింపు చేస్తూనే, వీటిని కుదించాలని సిఫార్సు చేసింది. ప్రభుత్వ సంస్థల్లోని ప్రైవేట్ విరాళాల మద్దతు కలిగిన అవార్డులకు కూడా ఈ సమీక్షను వర్తింపజేశారు.

ప్రభుత్వ ముఖ్య శాస్త్ర సలహాదారుతో సంప్రదించి, నోబెల్ అవార్డు ప్రమాణాల్లో ఒక అవార్డును ఏర్పర్చాలని చైర్మన్ చేసిన సూచనను కూడా మినిట్స్ పేర్కొంది. అయితే 2003లో రూ. 25 లక్షల నగదుతో ఏర్పర్చిన ఇండియన్ సైన్స్ అవార్డును 2010లో తీసేశారనే విషయాన్ని ఆ సమావేశంలో పాల్గొన్న ఏ ఒక్కరూ పేర్కొనలేదు. ఈలోగా ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ సంస్థ 2008లో రూ. 25 లక్షల మొత్తంతో తొలి సైన్స్ ప్రైజ్‌ని ఐఐటీ కాన్పూర్‌కి చెందిన గణిత శాస్త్రజ్ఞుడు మణీంద్ర అగర్వాల్‌కు బహూకరించింది. 2009లో ఇన్ఫోసిస్ ప్రైజ్ పరిధిని విస్తృత పరిచి నగదు మొత్తాన్ని రెట్టింపు చేశారు. ఆరు విభాగాల్లో వీటిని అందిస్తున్నారు. ఒక్కో ప్రైజు లక్షరూపాయల విలువను కలిగి ఉంటుంది. దీనికి పన్ను కూడా మినహాయించారు.

ఇటీవలి వారాల్లో, ప్రభుత్వ సంస్థలు, రాష్ట్ర విశ్వవిద్యాలయాలు మరొక అడుగు ముందుకేశాయి. అత్యుత్తమ పరిశోధనా పత్రానికి, అత్యుత్తమ పీహెచ్‌డీ థీసిస్‌కి ఇస్తున్న అవార్డును సైతం నిలిపివేయాలని వాటి ఫ్యాకల్టీలకు ఆదేశాలు జారీ చేశాయి. ఈ రెండు అవార్డులూ పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసినవే. అన్నిటికంటే మించి డీఎస్‌టీ అందిస్తున్న కిశోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన స్కాలర్‌షిప్పులను కూడా ఉన్నట్లుండి రద్దుచేయడం దారుణమనే చెప్పాలి. 2047 నాటికి భారత్‌ని స్వావలంబన సాధించిన దేశంగా మార్చడానికి సృజనాత్మక కృషి జరపాలంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. కానీ శాస్త్రీయ ప్రతిభకు గుర్తింపునిచ్చే ప్రభుత్వ అవార్డులను చాలావరకు రద్దు చేయాలని ప్రధాని స్వయంగా ఆయా మంత్రిత్వ శాఖలను కోరారంటే నమ్మశక్యం కావడం లేదు. ప్రభుత్వ ఆలోచనల్లో ఉన్నదాన్ని కార్పొరేట్ రంగం ఇప్పటికే అమలు చేసేసిందని ప్రభుత్వం లెక్కించి ఉండవచ్చు. కాబట్టే ప్రభుత్వ రంగంలో ఉన్న అవార్డులను కూడా కుదించాలని అది నిర్ణయం తీసుకుని ఉండవచ్చు.

మాజీ వైస్ చాన్స్‌లర్, పంజాబ్ యూనివర్సిటీ
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అర్థముందా?



ఈ అమ్మాయిలు, అబ్బాయిలు బహిరంగ ప్రదేశాల్లో కటి ఊపుతూ డ్యాన్సులు చేసే ఈ కొత్త ట్రెండ్ ఏమిటి? వాళ్లు దేనికైనా నిరసన చెబుతున్నారా లేక బ్రాహ్మణీయ పురుషాధిక్యతను సవాలు చేస్తున్నారా?

– ప్రసీదా మేనన్, వ్యాఖ్యాత

నా తప్పేమిటి?



పదిహేనేళ్ల క్రితం నవంబర్ 22వ తేదీన నన్ను గృహ నిర్బంధంలో ఉంచి, నా తప్పేమీ లేకుండానే పశ్చిమ బెంగాల్ నుంచి గెంటేశారు. పదిహేనేళ్ల క్రితం నన్ను ఢిల్లీలో బలవంతపు గృహ నిర్బంధంలో ఉంచి, నా తప్పేమీ లేకుండానే బలవంతంగా ఇండియాను వదిలేలా చేశారు.

– తస్లీమా నస్రీన్, బంగ్లాదేశ్ రచయిత్రి

అనాగరిక దేశమే



కుటుంబ గౌరవం అనే సంశయాత్మక భావన కోసం ఒక తండ్రి తన కూతురును చంపడం గురించి ఎందుకు అంత తక్కువ ఆగ్రహం ఉంటోంది? ఒక దేశం ఆర్థికంగా ఎంత ముందున్నా, ఆ దేశం ఎంత శక్తిమంతమైనది అయినా, ఇలాంటి సంశయాత్మక గౌరవం పట్ల మౌనాంగీకారం చూపితే అది సాంస్కృతికంగా అనాగరిక దేశం అవుతుంది.

– పత్రలేఖా ఛటర్జీ, విజిటింగ్ ఫెలో

మన అభిరుచి స్థాయి



ఇండియాలో ప్రతిదాన్నీ మాల్‌లాగా మార్చడంలోని ఈ అంతులేని ఆకర్షణ ఏమిటో నాకు నిజంగా అంతుపట్టడం లేదు. పెద్ద రాజధాని నగరాల్లో ఒక ప్రపంచ స్థాయి సంగీత కచ్చేరీ ప్రాంగణం లేనిది ఒక్క ఢిల్లీయే అయివుండాలి. కానీ మాల్‌లాగా మారడానికి ఎన్నో చారిత్రక భవనాలు వరుసలో ఉన్నాయి.

– కబీర్ తనేజా, ఫెలో

సంకెళ్లు తగవు



భావస్వేచ్ఛ మీద ఆంక్షలు విధించే ఏ సమాజమైనా మేధోస్తబ్ధతను ఎదుర్కోక తప్పదు. అది సృజనాత్మక మెదళ్లను ఉత్పత్తి చేయదు, దాని అభివృద్ధి నిలిచిపోతుంది.

– మౌలానా వహీదుద్దీన్ ఖాన్, ఇస్లామిక్ స్కాలర్

వాళ్ల ధైర్యం చూడాలి!



ఖొమైనీకి వ్యతిరేకంగా ప్రదర్శనలు చేస్తున్న నిరసనకారులకు మద్దతుగా ప్రపంచ కప్‌లో జాతీయ గీతాన్ని పాడటానికి ఇరాన్ ఫుట్‌బాల్ జట్టు నిరాకరించింది. కానీ అదే మన క్రికెట్ టీమ్ మాత్రం డబ్బుల కోసం ఎంతకైనా సాగిలపడగలదు.

– మినీ నాయర్, రచయిత్రి

మారుతుంటాను



ఎట్టకేలకు నేను కనుగొన్నాను. ఇంట్రావర్టుల్లో నేను ఎక్స్‌ట్రావర్టును. ఎక్స్‌ట్రావర్టుల్లో నేను ఇంట్రావర్టును.

– దివ్య జైన్, ప్రోగ్రామర్

సాధ్యమే



నేను ఒక ముస్లింను, శాకాహారిని. మాలాంటివాళ్ళు కూడా ఉంటారని గుర్తుంచుకోండి.

– సాదిఖ్ అలీ, వ్యాఖ్యాత

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్‌బాక్స్

అవిశ్రాంత వీరునికి జోహార్లు

దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ప్రపంచ ఆకలి సూచిలో దయనీయ స్థానంలో దేశం కనిపిస్తోంది. ప్రజాస్వామ్యం పేరిట నోట్లస్వామ్యం, రాజకీయాల్లో మతోన్మాదం రాజ్యమేలుతున్నాయి. పాలక పక్షం ప్రతిపక్షాల్ని సైతం తొక్కిపడ్తూ కాళ్లు, చేతులు ఆడనివ్వడం లేదు. అధికారం అనేది నియంతృత్వానికి సోపానమవుతుండగా విప్లవ ప్రతిపక్షం రోజూ నెత్తురోడుతున్నది. ప్రత్యామ్నాయ రాజకీయ విశ్వాసాలు సైతం బందీ అవుతున్నాయి. ప్రత్యామ్నాయ ప్రజా ప్రతిపక్షం అంతా ఒక శక్తిగా ముందుకొచ్చే తరుణంలో నవంబర్ మాసానికి ఒక ప్రత్యేకత ఉన్నది. విప్లవ శక్తుల ఐక్యతా కృషిలో నిమగ్నమై ఉన్న కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 1984 నవంబర్ 9న కలకత్తాలో గుండె పోటుతో అమరులయ్యారు.



చంద్ర పుల్లారెడ్డి

1917లో కర్నూలు జిల్లా వెలుగోడు గ్రామంలో జన్మించిన చంద్రపుల్లారెడ్డి భూస్వామ్య కుటుంబ వారసత్వాన్ని కాలదన్నాడు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో గెలిచిన బూర్జువా శాసన సభ్యత్వ హోదాను త్యజించి, 50వ ఏట గోదావరిలోయ అడవిలోకి అడుగుపెట్టాడు. 66వ ఏట ఉద్యమంలోనే చివరిశ్వాస వదిలాడు. ఇదే మాసంలో విప్లవ సింహంగా పేరుగాంచిన కామ్రేడ్ పొట్ల రామనర్సయ్య, విప్లవ ఉపాధ్యాయుడు నీలం రామచంద్రయ్య, విప్లవ విద్యార్థి నాయకుడు జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, విప్లవ నాయకురాలు రంగవల్లి, కిషన్‌జీలతో పాటు ఎందరో తమ అమూల్యమైన ప్రాణాలర్పించారు. సామాజిక విప్లవకారుడు జ్యోతిబా పూలే నవంబర్ 26న అమరులైనారు. వీరంతా ఒక మనిషిని వేరొక మనిషి దోపిడి చేయని సమాజం కావాలన్నారు. వారందరికీ విప్లవ జోహార్లు అర్పిస్తూ జరిగే సంస్మరణ సభను జయప్రదం చేయాలని కోరుతున్నాము.

– దేగల రమ, (రుద్రారం) తెలంగాణ
– రమణారెడ్డి, (బొల్లవరం) ఏపీ అమరుల స్మారక కమిటీ
(నేడు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంస్మరణ సభ)

ఓబీసీల వర్గీకరణకు మోక్షం ఎప్పుడు?

సందర్భం



కోడెపాక కుమార స్వామి

ఓబీసీ కులాల వర్గీకరణ ఆవశ్యకతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2017 అక్టోబర్ 2న జస్టిస్ రోహిణి అధ్యక్షతన ముగ్గురు సభ్యుల జాతీయ కమీషన్‌ను ఆర్టికల్ 340 ప్రకారం ఏర్పాటు చేసింది. అదర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ (ఓబీసీ) కోటాలో విద్యా, ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు అనుభవిస్తున్న సుమారు 2640 కులాలను వర్గీకరించి, రిజర్వేషన్లు అమలు చేయడానికి ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక సమర్పించడానికి ఈ కమిషన్‌కు మొదట 12 వారాల గడువు ఇచ్చింది ప్రభుత్వం. ఆ గడువును ఇప్పటికి 13 సార్లు పొడిగించి చివరగా నివేదిక సమర్పించడానికి 2023 జనవరి 31 చివరి తేదీగా నిర్ణయించింది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా సామాజికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన ఓబీసీ కులాలు వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారు. అందువల్ల రాజకీయంగా నష్టపోతామనే భయంతో బీజేపీ ప్రభుత్వం ఓబీసీలను వర్గీకరించే అవకాశం లేదని రాజకీయ విశ్లేషకులు వాదిస్తున్నారు.

ఇప్పటికే దేశంలోని 11 రాష్ట్రాల్లో బీసీ రిజర్వేషన్లను విద్యా, ఉద్యోగాల్లో వర్గీకరణ ద్వారా అమలు చేస్తున్నారు. బీసీ/ఓబీసీ కులాల మధ్య సామాజిక, విద్య, ఆర్థికపరమైన వ్యత్యాసాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే కేంద్రం 27 శాతం రిజర్వేషన్లను ఓబీసీలకు అమలు చేస్తున్నప్పటికీ, నేటికీ కేంద్రంలో 1600 కులాలకు పైగా ఎలాంటి రిజర్వేషన్ల ఫలాలను పొందలేదని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఏ ఓబీసీ కులం అయితే జనసంఖ్య అధికంగా కలిగి సామాజికంగా, విద్యా పరంగా, ఆర్థికంగా బలంగా ఉంటుందో ఆ కులం వారు... వారి జనాభాకు మించి రిజర్వేషన్లు అనుభవించడం జరుగుతోంది. గత సంవత్సరం మార్చిలో కొన్ని పత్రికలకు లీకులు వదిలారు. వీటి




ప్రకారం... ఓబీసీ కులాలు నేటి వరకు కేంద్ర ప్రభుత్వంలో రిజర్వేషన్ల ఫలాలను ఏమేరకు అనుభవించాయనే లెక్కలను, వారి జన సంఖ్యను పరిగణలోకి తీసుకొని జస్టిస్ రోహిణి కమీషన్ ఓబీసీలను నాలుగు గ్రూపులుగా వర్గీకరించింది. గ్రూప్–ఏలో 1,654 కులాలకు 2 శాతం, గ్రూప్–బీలో 534 కులాలకు 6 శాతం, గ్రూప్–సీలో 328 కులాలకు 9 శాతం, గ్రూప్–డీలో 104 కులాలకు 10 శాతం రిజర్వేషన్లను కేటాయించింది. అయితే ఈ లీకుల్లో నిజమెంతో తెలియదు.

1993 నుండి ఉద్యోగాల్లో, 2008 నుండి విద్యాసంస్థల్లో వర్గీకరణ ద్వారా రిజర్వేషన్లు అమలు చేసి ఉంటే, ఓబీసీలో బాగా వెనుకబడిన కొన్ని కులాలకైనా న్యాయం జరిగి ఉండేది. మండల్ కమిషన్ నివేదికపై తీర్పులో సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం బీసీల వర్గీకరణకు ఆమోదం తెలిపింది. బీసీ రిజర్వేషన్లను వర్గీకరించకుండా అమలు చేయడం వలన వీరిలో ఐక్యత లోపించింది. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో స్థానిక సంస్థలైన పంచాయతీ, మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో 1994 నుండి బీసీలకు ఉమ్మడిగా అమలుపరుస్తున్న 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించారు. అయినప్పటికీ బీసీ కులాలు ఉద్యమాలు చేయడం లేదు. ఇందుకు ప్రధాన కారణం 110కి పైగా బీసీ కులాలు రాజకీయ రిజర్వేషన్లు పొందలేదు, వారికి చెందని రిజర్వేషన్ల కోసం వారు ఎందుకు కొట్లాడుతారు? ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలను పక్కన పెట్టి ఓబీసీల వర్గీకరణపై నియమించిన జస్టిస్ రోహిణి కమిషన్ నివేదిక సకాలంలో వచ్చేలా చర్యలు తీసుకోవాలి. ఓబీసీల వర్గీకరణ వల్ల అత్యంత వెనుకబాటుకు గురైన కులాలవారూ ప్రయోజనం పొందడానికి మార్గం సుగమం అవుతుంది.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు I 94909 59625

ద్వంద్వాతీత స్థితి

కష్టం సుఖం, కోపం శాంతం, చలి వేడి – ఇలాంటివన్నీ ద్వంద్వాలు. భగవంతుడు ద్వంద్వాతీతుడు. అనుభవ పూర్వకంగా భగవంతుని తెలుసుకొన్నవారు కూడా ద్వంద్వాతీతులు. అలాంటివారు అనుభవించే ద్వంద్వాతీత స్థితి ఎలాంటిదో తెలియజెప్పే కథ ఒకటి భాగవతుల్లో బహుళ ప్రచారంలో ఉంది.



జ్యోతిర్మయం

ఓతూరి, భోజనానికి కూర్చోబోతున్న వశిష్ఠుల వారికి ఆవలి ఒడ్డున తపస్సు చేసుకొంటున్న భరద్వాజ మహర్షి కనిపించాడు. అతిథికి పెట్టకుండా తాను తినటం ఎలాగని, అన్నం పట్టుకెళ్లి తినబెట్టి రమ్మని భార్య అరుంధతమ్మకు పని పురమాయించాడు. ఆయమ్మ 'గంగ నిండి పారుతోంది. ఎలాగు దాటేది' అంది. అందుకాయన 'నిత్య బ్రహ్మచారి అయిన వశిష్ఠుని పంపున అవతలి ఒడ్డుకు వెళ్తున్నాను. దారివ్వమని అడుగు. ఇస్తుంది' అన్నాడు. ఆ మాటకు సరేనని, గంగమ్మ తల్లితో ఆయన చెప్పమన్నట్టే చెప్పి, నీటిమీద నడుచుకొంటూ వెళ్లింది. వెళ్లి, మునికి అన్నం తినపెట్టింది. తిన్నాక ఆయన, 'తల్లీ, ఇక నీవు వెళ్లిరా' అన్నాడు. 'గంగ నిండి పారుతోంది. ఎలాగు వెళ్లేది' అంది. అందుకాయన, 'నిత్య ఉపవాసి అయిన భరద్వాజుని పంపున అవతలి ఒడ్డుకు వెళ్తున్నాను. దారివ్వమని అడుగు, ఇస్తుంది' అన్నాడు. ఆ మాటకు సరేనని, గంగమ్మ తల్లితో ఆయన చెప్పమన్నట్లే చెప్పి, నీటి మీద నడుచుకొంటూ వచ్చి, పెనిమిటిని కలుసుకొంది.

ఇద్దరి భోజనాలు అయ్యాక ఆయమ్మ అడిగింది. 'ఇంతకాలం నాతో కాపురం జేస్తూ, గంపెడు పిల్లల్ని కూడా కన్న మీరు నిత్య బ్రహ్మచారులేమిటి? అవతలి ఒడ్డున ఉన్న ఆయన, అప్పుడే అన్నం నా చేతి మీదుగా తిని, తాను నిత్య ఉపవాసిననటం ఏమిటి? ఎట్లా అవుతయ్యి సత్యం, మీ ఇద్దరి మాటలు? అంతటి గంగమ్మ తల్లి ఎట్లా వంత పలికింది?! అందుకు వశిష్ఠుల వారు, 'నీవాయనకు ఈపూట అన్నం తీసుకువెళ్లావు, తిన్నాడు. తీసుకు వెళ్లలేదు, తినడు. తినటం, తినకపోవటంలో ఆయనకు తేడా లేదు. భావస్థితి ఆయనకు ఎప్పుడూ స్థిరం. అందుకే ఆయన నిత్య ఉపవాసి కింద లెక్క. ఇక నా విషయం సంగతి. తిండి విషయంలో ఆయన ఎలాగో, కాపురం చేసే దాంట్లో నేను అలాగ. కాబట్టి నేను నిత్య బ్రహ్మచారిని అని బోధపరిచారు.

– దీవి సుబ్బారావు

కార్తీకంలో పెరిగిన దుర్గమ్మ హుండీ ఆదాయం

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ హుండీ ఆదాయం కార్తీక మాసంలో గణనీయంగా పెరిగింది. ఆది దంపతులకు భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం మహామండపం ఆరో అంతస్తులో లెక్కించారు. 17 రోజులకు రూ.3,13,34,270 నగదు, 994 గ్రాముల బంగారం, 7.435 కిలోల వెండి హుండీల ద్వారా వచ్చాయి. ఈ–హుండీల ద్వారా భక్తులు రూ.55,623 విరాళాలను సమర్పించారు. కానుకల లెక్కింపును ఆలయ ఈవో భ్రమరాంబ పర్యవేక్షించారు.

కారు-లారీ ఢీ.. 8 మంది మృతి

- చింతూరు మండలం బొడ్డుగూడెం వద్ద జాతీయ రహదారిపై దుర్ఘటన
- మృతులందరూ ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారే



ఘటనా స్థలంలో మృతదేహాలు

చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా) : విజయవాడ-జగ్దల్‌పూర్ జాతీయ రహదారి-30పై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఎనిమిది మంది మృత్యువాత పడ్డారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం బొడ్డుగూడెం వద్ద మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాకు చెందిన 10 మంది కారులో తమ బంధువు అస్థికలను గోదావరిలో కలిపిన అనంతరం భద్రాద్రి రాముణ్ణి, పర్ణశాలను దర్శించుకుని తిరిగి ఛత్తీస్‌గఢ్‌కు వెళ్తుండగా బొడ్డుగూడెం ఆశ్రమ పాఠశాల వద్ద ఛత్తీస్‌గఢ్ నుంచి ఐరన్ ఓర్‌తో వస్తున్న లారీని కారు ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న పదిమందిలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని సమీపంలోని ఏడుగురాళ్లపల్లి ప్రభుత్వాసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పదం సింగ్ (45), మనీషా ఠాకూర్ (25) మృతిచెందారు. ఈ ఘటనలో ముందు సీటులో డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి మృతిచెంది ఇరుక్కుపోయారు. విషయం తెలుసుకున్న చింతూరు ఏఎస్పీ మహేశ్వరరెడ్డి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సిబ్బంది సాయంతో వాహనంలో ఇరుక్కుపోయిన ఇద్దరి మృతదేహాలను బయటకు తీయించి ఆరు మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం చింతూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఏడేళ్ల బాలుడు దివ్యాంశ్ ఠాకూర్, రవి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుల్లో ఐదుగురు పురుషులు, ముగ్గురు మహిళలున్నారు. ఘటనాస్థలాన్ని చింతూరు సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సందర్శించి వివరాలు సేకరించారు. ఇక మృతిచెందిన వారిలో నైన్‌సింగ్ ఠాకూర్ (68), డ్రైవర్ రాజేష్‌సింగ్ ఠాకూర్ (52), దిలేంద్ర ఠాకూర్ (35), మనీరాం ఠాకూర్ (61), సత్‌ఠాకూర్ (46), కిరాం ఠాకూర్ (31), ఆసుపత్రిలో మృతిచెందిన వారు పదం సింగ్ (53), మనీషా ఠాకూర్ (28) ఉన్నారు.

ఆత్మన్యూనత నుంచి ఆత్మగౌరవానికి బీసీలు

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీనివాస వేణుగోపాలకృష్ణ



భవానీపురం(విజయవాడ పశ్చిమ): ఆత్మన్యూనతలో ఉన్న బీసీలను ఆత్మగౌరవంతో బతికేలా సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేసి ఆయా సామాజికవర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తెలిపారు. ఏపీ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన 56 బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. గత ప్రభుత్వ హయాంలో విద్యావకాశాలు లేక వెనుకబడిన బీసీలకు జగనన్న ప్రభుత్వం వచ్చాక విద్యా రంగంలో తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులతో ఉన్నత విద్య అందుబాటులోకి వచ్చిందన్నారు. బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయలక్ష్మి మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ డీబీటీ ద్వారా నవరత్నాలను అందించేందుకు గ్రామ సచివాలయ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. ఎమ్మెల్సీ టి.కల్పలత రెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్, పూలే వంటి మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సామాజిక న్యాయం పాటిస్తున్న ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ అమరావతి అంటూ హడావుడి చేసే చంద్రబాబు అక్కడ లోకేశ్‌ను గెలిపించుకోలేకపోయారని, ఆయన రాజకీయ సన్యాసం తీసుకుంటే మంచిదని హితవు పలికారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ వీసీ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అర్జునరావు, నవరత్నాల అమలు కమిటీ వైస్ చైర్మన్ నారాయణమూర్తి, 56 బీసీ కార్పొరేషన్ల సమన్వయకర్త ఎ.ప్రవీణ్, పర్సన్ ఇన్‌చార్జిలు కె.మల్లికార్జున, ఎ.కృష్ణమోహన్, డి.చంద్రశేఖరరాజు, పి.మాధవి లత, ఎస్.తనూజ, జి.ఉమాదేవి, ఎం.చినబాబు, భీమ్‌శంకర్, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నారాయణ క్వాష్ పిటిషన్‌పై రిజిస్ట్రీ అభ్యంతరం

- తోసిపుచ్చిన హైకోర్టు న్యాయమూర్తి
- నంబరు కేటాయించాలని ఆదేశం
- విచారణ శుక్రవారానికి వాయిదా



సాక్షి, అమరావతి: పదో తరగతి ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో తన బెయిల్‌ను రద్దు చేస్తూ చిత్తూరు సెషన్స్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ నారాయణ విద్యా సంస్థల అధినేత, మాజీ మంత్రి పొంగూరు నారాయణ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరం లేవనెత్తింది. సెషన్స్ కోర్టు ఉత్తర్వులపై క్వాష్ పిటిషన్ దాఖలుకు వీల్లేదని, రివిజన్ పిటిషన్ దాఖలు చేసుకోవాలని తెలిపింది. రిజిస్ట్రీ అభ్యంతరంపై న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు మంగళవారం విచారణ జరిపారు. నారాయణ తరఫున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. సీఆర్‌పీసీ సెక్షన్ 482 కింద క్వాష్ పిటిషన్ దాఖలు చేయడంపై నిషేధం లేదని అన్నారు. సెషన్స్ కోర్టు ఉత్తర్వులపై దాఖలు చేసే క్వాష్ పిటిషన్‌కు విచారణార్హత ఉందంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉదహరించారు. దీంతో రిజిస్ట్రీ అభ్యంతరాన్ని న్యాయమూర్తి తోసిపుచ్చారు. నారాయణ పిటిషన్‌కు నంబరు కేటాయించాలని ఆదేశించారు. లూథ్రా వాదనలు కొనసాగిస్తూ.. బెయిల్‌ను రద్దు చేస్తూ జిల్లా, సెషన్స్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు చెల్లవని అన్నారు. అన్ని ఆధారాలను పరిగణనలోకి తీసుకున్న తరువాతే మేజిస్ట్రేట్ కోర్టు బెయిల్ మంజూరు చేసిందన్నారు. పైగా, అవి తాత్కాలిక ఉత్తర్వులేనని తెలిపారు. తాత్కాలిక ఉత్తర్వులపై పోలీసులు రివిజన్ పిటిషన్ దాఖలు చేయడానికి వీల్లేదని, దానికి విచారణార్హత లేదని వివరించారు. నారాయణ పబ్లిక్ సర్వెంట్ కాదని, అందువల్ల ఐపీసీ సెక్షన్ 409 కింద విచారణకు వీల్లేదన్నారు. పోలీసుల తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ దుష్యంత్‌రెడ్డి స్పందిస్తూ.. ఈ కేసులో అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తారని, అందువల్ల విచారణను వాయిదా వేయాలని కోరారు. దీంతో న్యాయమూర్తి తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

ఆర్థిక వనరుల అభివృద్ధితోనే ప్రజాభివృద్ధి

- లోక్‌సత్తా అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ



సభలో మాట్లాడుతున్న జయప్రకాష్‌నారాయణ

భవానిపురం(విజయవాడపశ్చిమ): ప్రజాభివృద్ధి ఆర్థిక వనరుల అభివృద్ధితో ముడిపడి ఉంటుందని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం ఆడిట్ దివస్ వారోత్సవాల ముగింపు సభ జరిగింది. రాష్ట్ర ఆడిట్ జనరల్ కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్థిక వనరులు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. దేశ ప్రజలకు అందాల్సిన అభివృద్ధి ఫలాలకు గండి కొడుతున్న స్వార్థపరుల అంతు తేల్చడమే కాగ్ కర్తవ్యమని తెలిపారు. పారదర్శకమైన లెక్కలతో ప్రభుత్వాలను తూర్పారపడుతూ సామాన్య ప్రజలకు అండగా ఆడిట్ జనరల్ ఉద్యోగులు నిలబడడం అభినందనీయమన్నారు. ప్రజా శ్రేయస్సు కోరే పవిత్రమైన శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. గడిచిన 20 ఏళ్లలో దేశ ప్రజలు అందుకుంటున్న అభివృద్ధి ఫలాలకు కాగ్ లెక్కలు దోహదం చేస్తున్నాయని చెప్పారు. పబ్లిక్ ఫైనాన్స్ సిస్టమ్‌లో ఇంకా ఎన్నో మార్పులు రావాల్సి ఉందని, దీనికి కాగ్ కృషి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఆడిట్) ఇందు అగర్వాల్, రిటైర్డ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎల్‌వీ సుధీర్‌కుమార్, ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఎఅండ్‌ఈ) చంద్రమౌళి సింగ్, డీఏజీలు, వెల్ఫేర్ ఆఫీసర్లు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పెండింగ్ అంశాలపై నేడు కేంద్రం సమీక్ష

- కేంద్రం వద్ద ఉన్న రాష్ట్ర పెండింగ్ అంశాలన్నీ అజెండాలో
- కేంద్ర శాఖల వద్ద ఉన్న అంశాలపైనా చర్చ
- ఆర్ అండ్ ఆర్‌తో సహా పోలవరం పూర్తి వ్యయం
- రెవెన్యూ లోటు భర్తీ, విశాఖలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్
- విశాఖలో జాతీయ ఫార్మాస్యూటికల్ విద్యా సంస్థ ఏర్పాటు
- పారిశ్రామిక, ఆర్థిక ప్రగతికి పన్ను రాయితీలు తదితర అంశాలపై చర్చ

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి సంబంధించి కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అన్ని అంశాలపై బుధవారం కేంద్ర, రాష్ట్ర సమన్వయ కమిటీ సమీక్ష చేయనుంది. సమన్వయ కమిటీ వద్ద ఉన్న పెండింగ్ అంశాలతో పాటు వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖల వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలపైన కూడా ఈ సమావేశంలో చర్చించనున్నారు. కేంద్ర కేబినెట్ సెక్రటేరియట్ (సమన్వయ) కార్యదర్శి అధ్యక్షతన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ఉన్నతాధికారులతో ఈ సమావేశం జరుగుతుంది. ఈ మేరకు కేంద్ర కేబినెట్ సెక్రటేరియట్ డైరెక్టర్ ఎం. చక్రవర్తి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమాచారం పంపించారు. ఈ–సమీక్ష పోర్టల్‌లో పొందుపరిచిన అంశాలపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర సమన్వయ కమిటీ వద్ద పెండింగ్‌లో ఉన్న 34 అంశాలతో పాటు వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖల వద్ద పెండింగ్‌లో ఉన్న 15 అంశాలను అజెండాలో చేర్చారు. రాష్ట్ర విభజన జరిగిన ఆర్థిక ఏడాది రెవెన్యూ లోటు భర్తీ, పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారులు, రైల్వే లైన్లను అజెండాలో చేర్చారు. విశాఖలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్, జాతీయ ఫార్మాస్యూటికల్ విద్యా సంస్థ ఏర్పాటు, పారిశ్రామిక, ఆర్థిక ప్రగతికి పన్ను రాయితీలు, ఆర్ అండ్ ఆర్‌తో సహా పోలవరం పూర్తి వ్యయాన్ని భరించడం తదితర అంశాలు కూడా ఉన్నాయి.

ఎన్ఆర్ఐ చందాలు ఖర్చు చేసేందుకే దొంగ ఉద్యమం

- 786వ రోజు రిలే నిరాహార దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: రూ.400 కోట్ల ఎన్ఆర్ఐ చందాలు ఖర్చు చేసేందుకే చంద్రబాబు అండ్‌కో అమరావతి పేరుతో దొంగ ఉద్యమం కొనసాగిస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 786వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. అమరావతి ఉద్యమానికి ప్రజల మద్దతు పూర్తిగా కొరవడిందన్నారు. చందాలు దండుకునేందుకు దొంగ యాత్రలు పెట్టి ప్రజలను రెచ్చగొట్టేందుకు చేసిన యత్నాలు బెడిసికొట్టడంతో అర్ధంతరంగా యాత్ర వదిలి పారిపోయారని ఎద్దేవా చేశారు. సీఎం కుర్చీ కోసం ఆఖరి చాన్స్, ఒక్క అవకాశం ఇవ్వండి అంటూ బతిమాలుతున్న చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితిలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు ఓసీ వర్గాల్లోని పేదలకు కూడా సంక్షేమాన్ని అందిస్తున్నారని తెలిపారు. పేదల పక్షాన నిరంతరం నిలిచే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రాజధాని ప్రాంత బహుజనుల మద్దతు ఎప్పటికీ ఉంటుందన్నారు. మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, నూతక్కి జోషి, బొలిమేర శామ్యూల్, పులి దాసు, ఈపూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ కొరియాకు భారత నౌకలు

సింథియా: సముద్ర భాగస్వామ్య విన్యాసాల్లో భాగంగా భారత నౌకాదళానికి చెందిన శివాలిక్, కమోర్టా నౌకలు రిపబ్లిక్ ఆఫ్ కొరియా(దక్షిణ కొరియా)లోని బుసాన్‌కు చేరుకున్నాయి.ఆ దేశ నౌకాదళంతో వృత్తిపరమైన, సామాజిక పరస్పర చర్యలు చేపట్టడానికి ఈ రెండు నౌకలు అక్కడికి వెళ్లాయి. రిపబ్లిక్ ఆఫ్ కొరియా నేవీ దళాలు భారత నౌకా దళం నిర్వహించిన మిలాన్ విన్యాసాల్లో పాల్గొనగా.. భారత నావికాదళం రిపబ్లిక్ ఆఫ్ కొరియా నేవీ నిర్వహించిన సబ్‌మెరైన్ రెస్క్యూ విన్యాసాల్లో ప్రాతినిధ్యం వహించింది. రిపబ్లిక్ ఆఫ్ కొరియా నేవీ క్రూయిజ్ ట్రైనింగ్ గ్రూప్ గుడ్‌విల్ సందర్శన కోసం సెప్టెంబర్‌లో చెన్నైను సందర్శించింది.

క్యాబిన్లోకి ఇరుముడి

పౌర విమానయాన శాఖ అనుమతి



న్యూఢిల్లీ/అమరావతి/కాకినాడ సిటీ: అయ్యప్ప భక్తులు విమాన ప్రయాణంలో ఇరుముడిని తమతో పాటే క్యాబిన్లోకి తీసుకువెళ్లేందుకు కేంద్ర విమానయాన శాఖ అనుమతించింది. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేసన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) సోమవారం ఈ మేరకు సర్క్యులర్ జారీ చేసింది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ నుంచి శబరిమల వెళ్లిన పలువురు భక్తుల ఇరుముడిని క్యాబిన్లోకి అనుమతించేందుకు అధికారులు నిరాకరించారు. అయ్యప్ప భక్తులు అత్యంత పవిత్రంగా భావించే ఇరుముడిని వారితోపాటు అనుమతించకపోవడం వల్ల మనోభావాలు దెబ్బ తింటున్నాయని వారు కేంద్ర మంత్రి వి.మురళీధరన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో 2023 జనవరి 20 దాకా ఇరుముడిని విమాన క్యాబిన్లోకి అనుమతిస్తూ బీసీఏఎస్ ఉత్తర్వులిచ్చింది. నిబంధన ప్రకారం మండే స్వభావమున్న కారణంగా కొబ్బరికాయలకు క్యాబిన్లోకి అనుమతి లేదు.

ఐదు బ్యాక్టీరియాలకు... 6.8 లక్షల మంది బలి

2019లో భారత్‌లో మరణమృదంగం
- ప్రపంచవ్యాప్తంగా 77 లక్షల మరణాలు: లాన్సెట్ నివేదిక
- బ్యాక్టీరియా అదుపు తక్షణావసరమన్న అధ్యయనం



న్యూఢిల్లీ: ఈ.కోలి. ఎస్ నిమోనియా, కె.నిమోనియా, ఎస్.ఏరియస్, ఎ.మౌమనీ. ఈ ఐదు రకాల బ్యాక్టీరియాలు 2019లో భారత్‌లో ఏకంగా 6.8 లక్షల మంది ఉసురు తీశాయని లాన్సెట్ జర్నల్ అధ్యయనంలో వెల్లడైంది. ''2019లో ప్రపంచం మొత్తమ్మీద సంభవించిన మరణాలకు గుండె సంబంధిత వ్యాధుల తర్వాత బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లే రెండో అతి పెద్ద కారణంగా నిలిచాయి. ప్రతి ఎనిమిది మరణాల్లో ఒకటి వీటి ఫలితమే. 33 రకాల సాధారణ బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లు 77 లక్షల మరణాలకు కారణమయ్యాయి. వీటిలోనూ కేవలం ఐదు బ్యాక్టీరియాల వల్ల సగానికి పైగా మరణాలు సంభవించాయి'' అని అధ్యయనం పేర్కొంది. ప్రజారోగ్యం దృష్ట్యా బ్యాక్టీరియాలను అదుపు చేయడం తక్షణావసరమని హెచ్చరించింది. ''పటిష్టమైన ఆరోగ్య, వ్యాధి నిర్ధారణ వ్యవస్థల నిర్మాణం, మెరుగైన అదుపు చర్యలు, యాంటీబయాటిక్‌ల వాడకాన్ని గరిష్ట స్థాయికి పెంచడం వంటి చర్యలు చేపట్టాలి'' అని వాషింగ్టన్ వర్సిటీ ఇన్‌స్టిట్యూట్ ఫర్ హెల్త్ మెట్రిక్స్ డైరెక్టర్, అధ్యయన కర్త క్రిస్టోఫర్ ముర్రే సూచించారు. చాలా ఇన్ఫెక్షన్లు తదితరాలకు మనకిప్పటిదాకా కారణాలు తెలియకపోవడం ఆందోళన కలిగించే అంశమన్నారు. పలు గణాంకాలతో పాటు 3.43 కోట్ల మంది వైద్య రికార్డులను పరిశీలించారు. ''2019లో ప్రపంచవ్యాప్తంగా సంభవించిన 1.37 కోట్ల ఇన్ఫెక్షన్ సంబంధిత మరణాల్లో సగానికి పైగా బ్యాక్టీరియానే కారణం. 77 లక్షల బ్యాక్టీరియా సంబంధిత మరణాల్లో మూడొంతులకు పైగా శ్వాస, రక్త, ఉదర సంబంధిత ఇన్ఫెక్షన్లే. బ్యాక్టీరియాల్లో ఒక్క ఎస్.ఏరియస్ రకమే ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా 1.1 కోట్ల మరణాలకు కారణమైంది. వయసుపరంగా కూడా 15 ఏళ్ల పైబడ్డ వారిలో అత్యధికంగా 9.4 లక్షల మందిని ఇది బలి తీసుకుంది'' అని పరిశోధకులు తేల్చారు. సహారా ఆఫ్రికా ప్రాంతంలో అత్యధికంగా ప్రతి లక్ష మంది జనాభాకు 230 మంది బ్యాక్టీరియాకు బలైనట్టు వివరించారు. అదే పశ్చిమ యూరప్, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా వంటి సంపన్న ప్రాంతాల్లో ఈ సంఖ్య అత్యల్పంగా ప్రతి లక్ష మందికి 52గా ఉందని చెప్పారు.

కొత్త మహమ్మారుల జాబితా తయారీకి... రంగంలోకి డబ్ల్యూహెచ్‌ఓ



వాషింగ్టన్: ప్రపంచవ్యాప్తంగా సమీప భవిష్యత్తులో కరోనా తరహా మహమ్మారులకు కారణం కాగల వైరస్‌లను గుర్తించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) రంగంలోకి దిగింది. మన కింకా ఆనుపానులు తెలియని డిసీజ్ ఎక్స్ ఈ జాబితాలో ముందు వరుసలో ఉంది. ప్రస్తుత జాబితాలో దానితో పాటు కొవిడ్-19, ఎబోలా, మార్బర్గ్, లాసా ఫీవర్, మిడిలీస్ట్ రెస్పిరేటరీ సిండ్రోమ్ (ఎంఈఆర్ఎస్), నిఫా, సార్స్, రిఫ్ట్ వ్యాలీ ఫీవర్, జికా వైరస్ తదితరాలున్నాయి. పరిశోధనలో తెరపైకి వచ్చే కొత్త వైరస్‌లతో జాబితాను సవరించనున్నారు. ''ఇందుకోసం పలు బ్యాక్టీరియా కారకాలపై నిశితంగా దృష్టి పెట్టాం. వీటిలో డిసీజ్ ఎక్స్ అత్యంత ప్రమాదకరమైన అంతర్జాతీయ అంటువ్యాధిగా మారే ఆస్కారముంది'' అని డబ్ల్యూహెచ్‌ఓ హెచ్చరించింది. 300 మందికి పైగా శాస్త్రవేత్తలు ఈ అధ్యయనంలో తలమునకలుగా ఉన్నారు. 25కు పైగా వైరస్, బ్యాక్టీరియా కుటుంబాలపై పరిశోధనలు చేయనున్నారు. ఇలాంటి జాబితాను తొలిసారిగా 2017లో డబ్ల్యూహెచ్‌ఓ విడుదల చేసింది. దాన్ని 2018లో సవరించారు. భావి మహమ్మారిని ముందుగానే గుర్తించి దీటుగా ఎదుర్కొనేందుకు రాబోయే జాబితా కరదీపిక కాగలదని డబ్ల్యూహెచ్‌ఓ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ సౌమ్యా స్వామినాథన్ అన్నారు. ఈ జాబితాను 2023 మార్చిలోగా విడుదల చేయొచ్చని భావిస్తున్నారు.

క్లుప్తంగా...

క్షణికావేశంలోనే చంపా: అఫ్తాబ్

న్యూఢిల్లీ: తనతో సహజీవనం చేస్తున్న శ్రద్ధా వాకర్‌ను క్షణికావేశంలోనే చంపానని సంచలనం రేపిన ఢిల్లీ హత్య కేసులో నిందితుడు అఫ్తాబ్ పూనావాలా మంగళవారం కోర్టుకు తెలిపాడు. నువ్వేం చేశావో నీకు తెలుసా అని జడ్జి ప్రశ్నించగా అఫ్తాబ్ ఈ మేరకు బదులిచ్చాడు. అతని కస్టడీని కోర్టు మరో నాలుగు రోజులు పొడిగించింది. అఫ్తాబ్‌పై దాడి జరగొచ్చన్న అనుమానంతో సాకేత్ జిల్లా కోర్టు లాకప్‌లో ఉంచే విచారణ పూర్తి చేశారు. అఫ్తాబ్‌కు శనివారం సాయంత్రం పాలీగ్రాఫ్ టెస్టుకు ప్రారంభించారు. శ్రద్ధను అఫ్తాబ్ గొంతు పిసికి చంపి, మృతదేహాన్ని 35 ముక్కలుగా నరికి వేర్వేరు ప్రాంతాల్లో పడేయడం తెలిసిందే.

ఆమె కిమ్ రెండో కుమార్తె



తొలిసారి కూతురితో బహిరంగంగా ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్(ఫైల్)

సియోల్: ఉత్తరకొరియా ఇటీవలి ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి 'హ్వాసంగ్-17' ప్రయోగం సందర్భంగా అధ్యక్షుడు కిమ్ జొంగ్ ఉన్ చేయి పట్టుకుని కనిపించిన చిన్నారి ఆయన రెండో కుమార్తె జూ ఈ (10)అని దక్షిణ కొరియా అంటోంది. కిమ్ వ్యక్తిగత విషయాలేవీ బయటి ప్రపంచానికి అంతగా తెలీదు. కిమ్‌కు ముగ్గురు సంతానమని 2013లో ఆయనతో భేటీ అయిన బాస్కెట్ బాల్ ఆటగాడు రాడ్‌మన్ చెప్పారు. వారిలో జూ ఈ అనే కూతురు కూడా ఉన్నట్లు ఆయన గతంలో చెప్పిన విషయాన్ని తాజాగా ఎన్ఐఎస్ కూడా ధ్రువీకరించింది. ఆ వయస్సు బాలికల కంటే ఆమె పొడుగ్గా, పెద్దగా కనిపించినందునే ఈ అంచనాకు వచ్చినట్లు తెలిపింది. తన వారసురాలు ఆమేనని చెప్పేందుకే బయటి ప్రపంచానికి చూపించి ఉంటారంటోంది. కిమ్ తాత, తండ్రి కూడా తమ వారసులను ఇలాగే పరిచయం చేశారని గుర్తు చేస్తోంది.


ఐటీ దాడుల్లో బయటపడ్డ రూ.100 కోట్ల నల్లధనం

న్యూఢిల్లీ: బిహార్ కేంద్రంగా పనిచేస్తున్న రియల్ ఎస్టేట్, వజ్రాల ఆభరణాల వ్యాపార సంస్థలపై దాడుల్లో రూ.100 కోట్ల పైచిలుకు లెక్కల్లో చూపని నల్లధనం బయటపడింది. ఈ నెల 17న బిహార్, ఢిల్లీల్లో 30 ప్రాంతాల్లో ఈ సొత్తును గుర్తించినట్లు ఆదాయ పన్ను శాఖ మంగళవారం తెలిపింది. వజ్రాల ఆభరణాల సంస్థకు చెందిన రూ.5 కోట్ల నగదు, నగలను స్వాధీనం చేసుకుని, 14 బ్యాంకు లాకర్లకు సీల్ వేసినట్లు తెలిపింది. ''కస్టమర్లకు అడ్వాన్సుల పేరుతో మరో రూ.12 కోట్ల లెక్క చూపని ధనం, రూ.80 కోట్ల మేర వెల్లడించని నగదు లావాదేవీలను గుర్తించాం'' అని పేర్కొంది.

ఫోర్డోలో 60% శుద్ధమైన యురేనియం ఉత్పత్తి: ఇరాన్

టెహ్రాన్: ఫోర్డో భూగర్భ అణు కేంద్రంలో 60% శుద్ధతతో కూడిన యురేనియం ఉత్పత్తి ప్రారంభించినట్లు ఇరాన్ ప్రకటించింది. దేశ అణు కార్యక్రమంలో ఇదో కీలకమైన ముందడుగని అధికార వార్తాసంస్థ ఇర్నా పేర్కొంది. 60% శుద్ధమైన యురేనియంను రీప్రాసెస్ చేసి కనీసం ఒక అణుబాంబును తయారు చేయగల సామర్థ్యం ఇరాన్ సొంతం చేసుకుందని అంతర్జాతీయ నిపుణులు ఇటీవల హెచ్చరించారు.

అస్సాం పర్యావరణవేత్త... పూర్ణిమకు ఐరాస అవార్డు



గువాహటి: అస్సాంకు చెందిన పూర్ణిమా దేవి బర్మన్‌కు 2022 సంవత్సరానికి గాను ఐక్యరాజ్యసమితి అత్యున్నత పర్యావరణ పురస్కారం 'చాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్' వరించింది. అంతరించిపోతున్న హర్గిలా అనే పక్షి జాతిని కాపాడేందుకు ఈమె 'హర్గిలా ఆర్మీ' పేరుతో మహిళా గ్రూపును తయారు చేశారు. అటవీ జీవశాస్త్రవేత్త అయిన బర్మన్ రెండు దశాబ్దాలుగా చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంటల్ ప్రోగ్రాం(యూఎన్ఈపీ) మంగళవారం తెలిపింది. గ్రీన్ ఆస్కార్‌గా పిలుచుకునే ఈ అవార్డును బర్మన్, యూకేకు చెందిన సర్ పార్థా దాస్‌గుప్తా, పెరూ, లెబనాన్, కామెరూన్ దేశాల ఉద్యమకారులకు ఐరాస ప్రకటించింది.



అగ్నికి ఆహుతవుతోన్న ఫ్యాక్టరీ (ఇన్‌సెట్లో) బుగ్గిగా మారిన దృశ్యం

చైనాలో ఘోర అగ్ని ప్రమాదం

38 మంది సజీవదహనం

బీజింగ్: చైనాలోని హినాన్ ప్రావిన్స్‌లోని ఒక వస్త్ర పరిశ్రమలో సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో 38 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. ప్రమాద విషయం తెలియగానే హుటాహుటిన 240 మంది అగ్నిమాపక సిబ్బంది , 63 అగ్నిమాపక వాహనాలు ఘటనాస్థలికి చేరుకున్నారు. మంటలు ఆర్పేందుకు సిబ్బంది నాలుగు గంటలకుపైగా శ్రమించాల్సి వచ్చింది. వెన్‌ఫెంగ్ జిల్లాలోని అన్యాంగ్ సిటీలో సోమవారం ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఫ్యాక్టరీలో వెల్డింగ్ పనులు జరుగుతుండగా నిప్పురవ్వలు చెల్లాచెదురుగా నూలు వస్త్రాలకు మంటలంటుకున్నాయి. అగ్నికీలలు వేగంగా వ్యాపించి దారుణం జరిగిందని పోలీసులు అంచనాకు వచ్చారు. నిబంధనలను ఆ ఫ్యాక్టరీ పూర్తిగా ఉల్లంఘించిందని స్థానిక యంత్రాంగం మండిపడింది. ఈ దుర్ఘటనపై అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్పందించారు. గాయపడిన వారికి అత్యుత్తమ చికిత్స అందించాలని, కారకులను కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. అనుమానితులను ఇప్పటికే అరెస్ట్ చేశారు. 2015 ఆగస్టులో చైనాలో ఇంతకుమించిన ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. తియాంజిన్ నౌకాశ్రయంలో 700 టన్నుల సోడియం సైనేడ్‌సహా విషతుల్య రసాయనాలను భద్రపరిచిన భారీ గిడ్డంగికి మంటలంటుకున్నాయి. దాంతో 170 మందికిపైగా మరణించారు. ఇటీవల చైనాలో తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి.

యువతకు సాధికారతే లక్ష్యం

- ఉద్యోగ మేళాలే నిదర్శనం: మోదీ
- 71 వేల మందికి నియామక పత్రాలు
- యువతే దేశ బలమన్న ప్రధాని



పట్నాలో నియామకపత్రాలతో యువత

న్యూఢిల్లీ: కేంద్రం ఆధ్వర్యంలో చేపట్టిన రెండో ఉద్యోగ మేళాలో 71,056 మంది యువతకు ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లాంఛనంగా అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు. ఎన్డీఏ పాలిత రాష్ట్రాల్లో గత నెల రోజులుగా ఇలాంటి మేళాలు జరుగుతూనే ఉన్నాయని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వాల వల్ల ఇలాంటి డబుల్ లాభాలుంటాయన్నారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి మోదీ మాట్లాడారు. యువతే దేశ అతి పెద్ద బలమని పునరుద్ఘాటించారు. ''అలాంటి యువతకు సాధికారత కల్పించడమే ఈ ఉద్యోగ మేళాల లక్ష్యం. తద్వారా వారి ప్రతిభను దేశ నిర్మాణానికి గరిష్టంగా వినియోగించుకునేలా అన్ని చర్యలూ చేపడుతున్నాం. ఈ రోజు 71 వేల మందికి పైగా నియామక పత్రాలు అందుకుంటున్నారు. వారి కుటుంబాల్లో చెప్పలేనంత ఆనందం వెల్లివిరియనుంది. అక్టోబర్లో ధంతెరాస్ సందర్భంగా తొలి విడత ఉద్యోగ మేళాలో 75 వేల మంది యువత నియామక పత్రాలు పొందారు'' అని గుర్తు చేశారు. యువతకు ఉద్యోగ కల్పనను బీజేపీ ప్రభుత్వం ఒక ఉద్యమంలా చేపట్టిందనేందుకు ఈ భారీ మేళాలే నిదర్శమన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్‌ల్లో మినహా దేశవ్యాప్తంగా 45 చోట్ల అపాయింట్‌మెంట్ లెటర్లను అధికారులు భౌతికంగా అందజేశారు.

సేవల ఎగుమతుల్లో దూసుకెళ్తున్నాం

సేవల ఎగుమతుల్లో మన దేశం ప్రపంచంలో అతి పెద్ద శక్తిగా ఎదుగుతోందని మోదీ పేర్కొన్నారు. అంతేగాక ఉత్పత్తి రంగంలోనూ అగ్ర స్థానానికి దూసుకెళ్తోందని నిపుణులే చెబుతున్నారన్నారు. ''ఏడాదిన్నర లోగా 10 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయండి. శాఖలవారీగా ఇందుకు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేయండి'' అని గత జూన్‌లో మోదీ ఆదేశించడం తెలిసిందే. అందుకు తగ్గట్టుగా యువతకు ఉపాధి కల్పనకు ప్రధాని అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని, ఆ లక్ష్యసాధన దిశగా ఈ మేళా ఓ పెద్ద ముందడుగని పీఎంఓ పేర్కొంది.

పటేల్ పరువు తీయడమే కాంగ్రెస్ పని: అమిత్ షా



ఖంభాట్(గుజరాత్): సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌పై నిరంతరం నిందలేసే కాంగ్రెస్ ఇప్పుడు గుజరాత్ ఎన్నికల్లో లబ్ధి కోసం ఆయనను ఆకాశానికెత్తుతోందని బీజేపీ నేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. మంగళవారం గుజరాత్‌లోని ఆనంద్ జిల్లా ఖంభాట్‌లో ఎన్నిక ప్రచార ర్యాలీలో ఆయన ప్రసంగించారు. 'పటేల్‌ను కాంగ్రెస్ పొగడటం ఆశ్చర్యకరం. పటేల్‌ను ఎప్పుడూ నిందించడమే తప్ప ఒక్క కాంగ్రెస్ నేత అయినా కీర్తించడం నా చిన్నతనం నుంచీ చూడలేదు! పార్టీ టికెటివ్వదన్న భయంతో ఒక్క కాంగ్రెస్ అభ్యర్థి కూడా ఐక్యతా విగ్రహాన్ని సందర్శించలేదు' అని విమర్శించారు. 'ప్రపంచంలో ఎత్తయిన విగ్రహాన్ని నిర్మించి పటేల్‌కు ఘన కీర్తి దక్కేలా ప్రధాని మోదీ చేశారు. ఓటు బ్యాంక్ కోసం అయోధ్యలో రామాలయ నిర్మాణాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించినా 2024లో భవ్య మందిరం ప్రారంభం కాబోతోంది' అన్నారు.

ప్రతిపక్ష నేత ఎంపికపై సందిగ్ధం..!

- రాజ్యసభలో ప్రతిపక్ష నేత ఎంపికను నాన్చుతున్న కాంగ్రెస్
- రేసులో దిగ్విజయ్, జైరాం, చిదంబరం, ముకుల్ వాస్నిక్
- శీతాకాల సమావేశాల్లో ఖర్గే కొనసాగుతారంటూ చర్చ



సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాలను వచ్చే నెల 7వ తేదీ నుంచి నిర్వహించేందుకు ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ..రాజ్యసభలో ప్రతిపక్ష నేత ఎవరన్న దానిపై ఇంకా కాంగ్రెస్ అధిష్టానం ఎటూ తేల్చలేదు. తదుపరి ప్రతిపక్ష నేత ఎంపికపై ఇంతవరకూ కాంగ్రెస్ ఎలాంటి చర్చలు జరుపకపోవడంతో ఉత్కంఠ మరికొద్ది రోజులు కొనసాగే అవకాశాలున్నాయి. కనీసం సమావేశాల నాటికైనా కాంగ్రెస్ నిర్ణయం చేస్తుందా? లేక ఏఐసీసీ అధ్యక్షుడిగా ఉన్న మల్లికార్జున ఖర్గేనే ప్రతిపక్ష నేతగా కొనసాగిస్తుందా? అన్నది కొంత ఆసక్తిగా మారింది. 'ఒక వ్యక్తికి ఒకే పదవి'అన్న కాంగ్రెస్ నిబంధన మేరకు ఏఐసీసీ అధ్యక్షుడిగా నామినేషన్ వేసిన రోజునే ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేస్తూ తన లేఖను అప్పటి పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీకి పంపారు. అనంతరం కొత్త నేతను కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ హోదాలో సోనియాగాంధీ ఎంపిక చేయాల్సి ఉన్నప్పటికీ అది జరుగలేదు. ప్రధానంగా పార్టీ సీనియర్ నేతలు దిగ్విజయ్ సింగ్, జైరాం రమేశ్‌లలో ఒకరిని ప్రతిపక్ష నేతగా ఎన్నుకుంటారని ప్రచారం జరిగింది. కాంగ్రెస్ అధ్యక్షుడిగా దక్షిణాదికి చెందిన ఖర్గే ఉన్నందున ఉత్తరాదికి చెందిన దిగ్విజయ్‌కు ఎక్కువ అవకాశాలున్నాయని చర్చ జరిగింది. వీరితో పాటే సీనియర్ నేతలు పి.చిదంబరం, ముకుల్ వాస్నిక్, ప్రమోద్ తివారీల పేర్లు చర్చల్లోకి వచ్చాయి. అయితే శీతాకాల సమావేశాల సమయంలోనూ భారత్ జోడో యాత్ర కొనసాగనుంది. ఈ యాత్రలో జైరా, దిగ్విజయ్ క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు. వారిద్దరూ సభకు హాజరయ్యే అవకాశాలు తక్కువని కాంగ్రెస్ నేతలంటున్నారు. ఈ నేపథ్యంలో ఖర్గేను శీతాకాల సమావేశాల వరకు ప్రతిపక్ష నేతగా కొనసాగిస్తారంటున్నారు. దీనిపై ఏఐసీసీ సభ్యుడు ఒకరు మాట్లాడుతూ 'సమావేశాలకు కొద్ది రోజుల ముందు ప్రతిపక్ష నేత ఎంపికపై నిర్ణయం చేస్తారు'అని వ్యాఖ్యానించారు.

ఇండోనేసియా భూకంపం 268కి మృతులు



సియాంజుర్‌లో ఆరుబయటే నివాసం

జకార్తా: ఇండోనేసియాలోని జావా దీవిలో సోమవారం వచ్చిన భూకంపంలో మృతుల సంఖ్య 268కి పెరిగింది. మరో 151 మంది జాడ తెలియాల్సి ఉందని, 1,083 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. వారిలో 300 మంది పరిస్థితి విషమంగా ఉందన్నారు. మృతుల్లో ఎక్కువ మంది పాఠశాల విద్యార్థులేనని పశ్చిమ జావా గవర్నర్ చెప్పారు. 13 వేల నివాసాలు దెబ్బతిన్నాయని చెప్పారు. మరిన్ని ప్రకంపనలు సంభవించవచ్చనే భయాందోళనల మధ్య ప్రజలు రోడ్లపైనే చీకట్లో గడిపారు. మంగళవారం దేశాధ్యక్షుడు జోకో విడొడొ సియంజుర్‌లో పర్యటించారు.

అతనో రేపిస్ట్

- ఆప్ మంత్రి సత్యేంద్ర జైన్‌కు జైల్లో మసాజ్ చేసింది ఫిజియోథెరపిస్ట్ కాదు
- సొంత కూతుర్ని రేప్ చేసిన కేసులో ఏడాదిగా జైల్లో మగ్గుతున్నాడు




జైల్లో మసాజ్ చేయించుకుంటున్న జైన్ (ఫైల్)

న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ కేసులో అరెస్టయి తిహార్ జైలులో ఉన్న ఢిల్లీ మంత్రి సత్యేంద్ర జైన్‌కు మసాజ్ వ్యవహారం మరో మలుపు తిరిగింది. జైన్‌కు రోజూ మసాజ్ చేస్తున్నది ఫిజియోథెరపిస్ట్ కాదని, అత్యాచారం ఆరోపణలపై అరెస్టయిన వ్యక్తి అని తేలింది. అతని పేరు రింకూ అని, సొంత కూతురిని రేప్ చేసిన కేసులో పోక్సో చట్టం కింద గతేడాది అరెస్టయ్యాడని జైలు రికార్డుల ద్వారా వెల్లడైంది. సీసీటీవీ ఫుటేజీలో జైన్‌కు అతను మసాజ్ చేస్తూ కనిపించాడు. జైన్ బెడ్ పక్కనే మినరల్ వాటర్ బాటిళ్లు, ఒక టీవీ రిమోట్ ఉన్నాయి. వచ్చిన వారితో కబుర్లు చెప్పడానికి జైలు గదిలో కుర్చీలు ఇతరత్రా ఏర్పాట్లు ఉన్నాయి. దీంతో ఆప్ నైజం మరోసారి బయటపడిందని బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ ఎద్దేవా చేశారు. దీనిపై ఆప్ నేత గోపాల్ రాయ్ స్పందించారు. 'ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల వేళ వేరే అంశమేదీ లేకపోవడంతో జైన్ అనారోగ్యం అంశాన్ని బీజేపీ పట్టుకుని వేలాడుతోంది. అమిత్ షా గతంలో గుజరాత్‌లో అరెస్టయినపుడు ఆయన కోసం ప్రత్యేక జైలు సిద్ధం చేశారు. ఆయనకు జరిగిన రాచమర్యాదలు దేశంలో మరెవరికీ జరిగి ఉండవు. ఇది రికార్డుల్లో అందరికీ అందుబాటులోనే ఉంది. అయినా జైన్‌కు ఎలాంటి ట్రీట్‌మెంట్ అందుతోంది అనేది ఇక్కడ చర్చనీయాంశం కాదు. డిసెంబర్ నాలుగున ఢిల్లీ ప్రజలు పోలింగ్‌లో బీజేపీకి ఎలాంటి 'ట్రీట్‌మెంట్' ఇవ్వబోతున్నారు అనేది పాయింట్' అని రాయ్ వ్యాఖ్యానించారు. మసాజ్ మంత్రిని బర్తరఫ్ చేసి కేజ్రీవాల్ దేశానికి క్షమాపణ చెప్పాలని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా డిమాండ్ చేశారు. ఆప్‌ను అత్యంత అరాచక అపరాధి పార్టీగా ఆయన అభివర్ణించారు.

దక్షిణం గాలి ఎటువైపు?

- ఆదివాసీ ఆందోళనలు, సూరత్ వ్యాపారులే కీలకం
- బీజేపీ ఆశలు ఆప్ దెబ్బకు గల్లంతేనా?
- చతుర్ముఖ పోటీతో ఎవరికి లాభం?



దక్షిణ గుజరాత్. మొదటి దశ అసెంబ్లీ ఎన్నికల్లో అత్యంత కీలక ప్రాంతం. ఒకవైపు వ్యాపారులు, మరోవైపు ఆదివాసీల సమ్మేళనమైన ఈ ప్రాంతవాసులు ఎటు వైపున్నారు? అధికార బీజేపీ ఆశల్ని ఆప్ గల్లంతు చేస్తుందా? జీఎస్టీపై గుర్రుగా ఉన్న వ్యాపారులు బీజేపీని కాదని ప్రత్యామ్నాయం వైపు చూస్తారా ? ఆదివాసీ ప్రాంతాల్లో పట్టున్న కాంగ్రెస్ పరిస్థితి ఎలా ఉంది ...?

దక్షిణ గుజరాత్ భరూచ్, నర్మద, తాపి, దాంగ్, సూరత్, వల్సాద్, నవ్‌సారి జిల్లాలతో కూడుకొని ఉంది. డిసెంబర్ 1న తొలి దశ పోలింగ్ జరిగే 89 స్థానాల్లో 35 దక్షిణ గుజరాత్‌లో ఉన్నాయి. దీంతో అన్ని పార్టీలు ఈ ప్రాంతంపై బాగా దృష్టి పెట్టాయి. ఈ జిల్లాల్లోని పట్టణ ప్రాంతాలు వ్యాపారవేత్తలతో నిండిపోయి ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో ఆదివాసీలు ఎక్కువ. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీజేపీ 35 స్థానాలకు గాను 25 స్థానాలను కైవసం చేసుకుంది. కాంగ్రెస్ 8, భారతీయ ట్రైబల్ పార్టీ (బీటీపీ) 2 నెగ్గింది. ఈసారి ఆప్ రాకతో దక్షిణ గుజరాత్‌లో చతుర్ముఖ పోరు నెలకొంది. ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్ ఆదివాసి ప్రాబల్య ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పట్టణ విద్యావంతులు కేజ్రీవాల్ ఢిల్లీ మోడల్ పాలనకు ఆకర్షితులవుతున్నారు.

సూరత్ వ్యాపారులూ కీలకమే

సూరత్‌లో వస్త్ర వ్యాపారులు జీఎస్టీకి వ్యతిరేకంగా నిరసన గళాలు వినిపిస్తూనే ఉన్నారు. కరోనా, జీఎస్టీ, పెరిగిన ధరలతో ఈసారి దీపావళి సీజన్‌లో వస్త్ర వ్యాపారం 60% తగ్గిపోవడంతో వారిలో భవిష్యత్‌పై బెంగ మొదలైంది. గత ఎన్నికల్లో పటేళ్ల ఉద్యమం, అధికార వ్యతిరేకతకు ఎదురొడ్డి జిల్లాలోని 16 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ ఏకంగా 15 నెగ్గింది. ఆదివాసీ ప్రాబల్యమున్న మాండ్విలో మాత్రమే ఓడింది. ఈసారి ఆప్ ప్రభావం బాగా ఉండేలా ఉంది. గతేడాది సూరత్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఆప్ ఏకంగా 27 సీట్లు నెగ్గింది. హార్దిక్ పటేల్ బీజేపీలో చేరడం కలిసొచ్చే అంశమే అయినా ఆయన అనుచరులు తదితరులంతా ఆప్‌లో చేరారు.

ఆదివాసీల ఆందోళనలు

దక్షిణ గుజరాత్‌లో 14 ఎస్టీ సీట్లున్నాయి. గత ఎన్నికల్లో వీటిలో బీజేపీ 5 మాత్రమే నెగ్గింది. ఈసారి అన్ని కూడా రావంటున్నారు. సర్-తాపి-నర్మద నది లింకింగ్ ప్రాజెక్టు, వేదాంత జింగ్ స్మెల్టర్ ప్లాంట్ ద్వారా గుజరాత్ ప్రభుత్వం తమ భూముల్ని కొల్లగొడుతోందన్న ఆగ్రహంతో గిరిపుత్రులు చేసిన ఆందోళనలు ఉవ్వెత్తున సాగుతున్నాయి. వన్సాదా సిట్టింగ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనంత్ పటేల్ ఆధ్వర్యంలో ఆందోళనలు ప్రభుత్వానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. అభివృద్ధి గురించి ఆదివాసీలకు వివరించి వారి ఆదరణ పొందడానికే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా రంగంలోకి దిగాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీజేపీ, కాంగ్రెస్ వదిలేసిన ఆదివాసీలకు స్వయంపాలన అధికారాన్ని కట్టబెట్టే పంచాయతీ విస్తరణ చట్టాన్ని అమలు చేస్తామన్న ఆప్ హామీ వారిని అధికంగా ఆకర్షిస్తోంది. ''దక్షిణ గుజరాత్‌లో ఆదివాసీలు, వ్యాపారులు బీజేపీపై అసంతృప్తితో ఉన్నారు. వేదాంత రసాయన ఫ్యాక్టరీ వారి భూముల్ని, నీటిని విషతుల్యం చేస్తుందన్న ఆందోళన నెలకొంది. వారికి ఆప్ ఆశాదీపంలా కనిపిస్తోంది'' అని ఎన్నికల విశ్లేషకుడు అమిత్ ధోల్కాయి అన్నారు.

చిన్న పరిశ్రమల హబ్

దక్షిణ గుజరాత్‌లో చిన్న, మధ్య తరగతి పరిశ్రమలు అత్యధికంగా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా నున్న పరిశ్రమల్లో 50శాతానికి పైగా ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. రాష్ట్రంలోని పెట్టుబడుల్లో 33%, ఈ ప్రాంతంలోనే పెడుతున్నారు. ఉపాధి అవకాశాల్లో 43% ఇక్కడి పరిశ్రమలే కల్పిస్తున్నాయి. టెక్స్‌టైల్, డైమండ్ కటింగ్, పాలిషింగ్, కెమికల్, పెట్రో కెమికల్ ఇండస్ట్రీస్, ఫార్మసీ, ప్లాస్టిక్ పరిశ్రమలు అధికంగా ఉన్నాయి. నాలుగు రేవు పట్టణాలతో కనెక్ట్ అయి ఉంది. రాష్ట్ర జనాభాలో 20% (1.2 కోట్లు) మంది దక్షిణ గుజరాత్‌లోనే నివసిస్తారు. ఈ ప్రాంతంలో వ్యాపారులందరూ జీఎస్టీపైనా, పెరిగిపోయిన విద్యుత్ బిల్లులపైనా తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మార్పు కోరుకుంటున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ప్రతి11 నిమిషాలకు... ఒక యువతి బలి



ఐక్యరాజ్యసమితి: ప్రపంచవ్యాప్తంగా ప్రతి 11 నిమిషాలకు ఒక మహిళ/బాలిక తమ భాగస్వామి లేదా కుటుంబ సభ్యుల చేతిలో దారుణ హత్యకు గురవుతున్నారని ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేసింది.. మానవ హక్కుల ఉల్లంఘనల్లో మహిళలపై జరిగే హింస ముందు వరుసలో ఉందని పేర్కొంది. నవంబర్ 25న ''మహిళలపై హింసా నిర్మూలన'' అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని యూఎన్ ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ''ప్రపంచంలో మానవ హక్కుల ఉల్లంఘనల్లో మహిళలపై హింస విస్తృతమైనది. ప్రతీ 11 నిమిషాలకు ఒక మహిళ తన భాగస్వామి లేదంటే సొంత కుటుంబానికి చెందిన వారి చేతిల్లోనే ప్రాణాలు కోల్పోతోంది. కోవిడ్-19, ఆర్థిక వెనుకబాటుతనం, ఇతర ఒత్తిళ్లతో మహిళలపై శారీరక, మానసిక హింస ఎక్కువైపోతోంది'' అని గుటెరస్ పేర్కొన్నారు. దీనిని ఎదుర్కోవడానికి దేశాలన్నీ కార్యాచరణ రూపొందించాలన్నారు. ''మహిళలపై హింస అంతానికి చిత్తశుద్ధితో కృషి చేయాలి. మహిళా హక్కుల కోసం పాటు పడే సంస్థలకు నిధులను 2026 నాటికి 50 శాతం పెంచాలి. మనందరం ఫెమినిస్టులమని గర్వంగా ప్రకటించుకోవాలి'' అన్నారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
బుధవారం ၊ 23 ၊ నవంబర్ ၊ 2022



నిత్యాన్నదానానికి విరాళం

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన జాస్తి దశరథరామ్, దివ్య మంగళవారం రూ. లక్ష విరాళంగా అందించారు.



అపూర్వ విజ్ఞాన భాండాగారాలు

విజయవాడలోని పలు కళాశాలల్లో గ్రంథాలయాలు లక్షలాది పుస్తకాలతో కొలువుదీరి విద్యార్థులకు అపూర్వమైన విజ్ఞానాన్ని అందిస్తున్నాయి. –8లో



దీప నీరాజనం

నాగాయలంక: స్థానిక శ్రీరామ పాదక్షేత్రం వద్ద కృష్ణానదీ తీరంలో శ్రీగంగ పార్వతీ సమేత రామ లింగేశ్వరునికి మంగళవారం రాత్రి 18 కిలోల ముద్ద కర్పూరంతో దీపోత్సవం నిర్వహించారు.

న్యూస్‌రీల్

బాక్సింగ్ జిల్లా జట్టు ఎంపిక



విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల బాక్సింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టును విజయవాడలోని ఆంధ్రా లయోల కాలేజీలో మంగళవారం ఎంపిక చేసినట్లు కృష్ణాజిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి వైవీఎస్ ఉమామహేశ్వరరావు తెలిపారు. 60 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన పి.కోటి, ఎస్.అభిమన్యు, డి.యశ్వంత్, ఎస్‌కే బాజీబాబా, సీహెచ్ బాల సందీప్, జి.పవన్‌కుమార్, జె.సతీష్, పి.గణేష్, ఎం.సూర్యచంద్ర, ఎం.సాయిచందు, ఎం.జాషువా, టీఎస్ సాయిలను జిల్లా జట్టుకు ఎంపిక చేశామన్నారు. ఈ నెల 25 నుంచి విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఈ జట్టు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. జట్టుకు కోచ్‌లుగా కె.మోజెస్, ఎం.పునీత్ వ్యవహరిస్తారన్నారు. జట్టుకు ఎంపికైన క్రీడాకారులను అసోసియేషన్ నాయకులు జె.రాజు, హెచ్.బెన్హర్, కె.మహేంద్ర అభినందించారు.

25 నుంచి రాష్ట్రస్థాయి క్యారమ్స్ టోర్నమెంట్

గుంటూరువెస్ట్(క్రీడలు): ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ప్రైజ్‌మనీ ఇన్విటేషన్ క్యారమ్స్ పోటీలు నిర్వహిస్తామని ఏపీ రాష్ట్ర క్యారమ్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నీరజ్ కుమార్ సంపతి, షేక్ అబ్దుల్ జలీల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు నెల 25వ తేదీ నుంచి 27 వరకు నెల్లూరు జిల్లా గూడూరులోని పీఆర్ క్లబ్ ప్రాంగణంలో జరుగుతాయన్నారు. రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, ఐదువేలు ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గో బహుమతి కింద అందజేస్తామన్నారు. రెండు రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులకు వసతి ఏర్పాటు చేస్తామన్నారు. క్రీడాకారులకు రాను పోను ప్రయాణ ఖర్చులు కూడా చెల్లిస్తామన్నారు. మూడు రోజులపాటు జరగనున్న పోటీల్లో పేరొందిన జాతీయ క్రీడాకారుల అద్భుత ప్రదర్శన చూసే అవకాశముంటుందన్నారు. ఇప్పటికే ఇటీవల గుంటూరులో రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలు నిర్వహించి జట్టును జాతీయ పోటీలకు పంపామన్నారు. రానున్న కాలంలోనూ క్యారమ్స్ క్రీడాభివృద్ధికి అన్ని జిల్లా సంఘాల నాయకులతో కలిసి పనిచేస్తామని చెప్పారు.

యార్డుకు 34,069 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 34,069 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 32,722 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.27,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.27,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాకు రూ.13,000 నుంచి రూ.28,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.10,000 నుంచి రూ.26,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 11,655 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సైబర్.. టె(ర్ర)రర్!

పిల్లలకు బిగుస్తున్న ఉచ్చు!

- ఆన్‌లైన్ గేమ్సే అస్త్రంగా సైబరాసురుల వల
- వ్యక్తిగత సమాచారంతో పాటు పెద్ద మొత్తంలో నగదు లూటీ
- 8–16 ఏళ్ల పిల్లలే లక్ష్యం
- ఇంట్లోనే అంతా జరుగుతున్నా తెలుసుకోలేకపోతున్న పెద్దలు
- అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన



విజయవాడకు చెందిన 65 ఏళ్ల ఓ వ్యాపార వేత్తకు చెందిన బ్యాంకు ఖాతా నుంచి వారం రోజుల వ్యవధిలో రూ.1.80 లక్షలు మాయమవడంతో సైబర్ పోలీసులను ఆశ్రయించాడు. క్షేత్ర స్థాయి విచారణ అనంతరం పోలీసులు వెల్లడించిన వివరాలు వ్యాపారవేత్తను షాక్‌కు గురి చేశాయి. డబ్బులు పోవడానికి 13 ఏళ్ల తన మనుమడే కారణమన్న సైబర్ పోలీసుల మాటలను ఆ వ్యక్తి తొలుత నమ్మలేదు. ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాపారవేత్త ఫోన్ అతని మనుమడి చేతిలోనే ఉంటుందని, ఫోన్‌లో ప్రతి రోజూ ఫ్రీ గేమ్స్(డబ్బు చెల్లించి ఆడే కార్ రేసింగ్, చెస్, రమ్మీ, క్రికెట్) ఆడుతూ డబ్బులు పోగొడుతున్నట్లు వివరించారు. అంతేకాక న్యూడ్ వీడియోలను చూస్తున్నట్లు, ఓ వెబ్‌సైట్‌లో ఇంట్లో ఆడవాళ్లు స్నానాలు చేసే వీడియోలను సైతం బాత్‌రూం పై నుంచి రికార్డ్ చేసి అప్‌లోడ్ చేసినట్లు ఆధారాలతో రుజువు చేయడంతో ఆ వ్యక్తి ఒక్క సారిగా ఖంగుతిన్నాడు.

విజయవాడస్పోర్ట్స్: విద్య, వినోదం, సమాచార మార్పిడికి ప్రధాన వేదికైన స్మార్ట్ ఫోన్ నూరు శాతం చిన్నారులను తన బానిసలుగా మార్చేసుకుంది. కాసేపు అల్లరి చేయకుండా, ఏడవకుండా ఉంటారని, ఆన్‌లైన్ క్లాస్, ఏదో షార్ట్ వీడియోలు చూసుకుంటున్నాడని పిల్లలకు ఫోన్ ఇచ్చి వదిలేయడం వారిలో విశృంఖలత్వం పెరగడానికి కారణమవుతోంది. అంతేకాక పెద్దల బ్యాంకు ఖాతాలకూ గండిపడుతోంది. తెలిసో తెలియకో కొన్ని వెబ్ లింక్స్‌ను క్లిక్ చేయడంతో కుటుంబ సభ్యుల వ్యక్తిగత వివరాలు, వీడియోలు సైబర్ నేరగాళ్లకు చేరుతున్నాయి.

ఎలా జరుగుతుందంటే..

మనం ఫోన్‌లో ఆసక్తిగా ఏమేమి చూస్తున్నాం.. ఏయే అప్లికేషన్‌లు వాడుతున్నామనే డేటా గూగుల్‌లో స్టోర్ అవుతుంది. ఎనిమిది నుంచి 16 ఏళ్ల లోపు పిల్లలు కార్‌రేసింగ్, క్యాండీక్రష్‌సాగ, చెస్, రమ్మీ, క్రికెట్ ఆన్‌లైన్ గేమ్‌లతో పాటు షార్ట్, న్యూడ్ వీడియోలకు ఆకర్షితులవుతున్నారు. వీటికి అనుగుణంగా వెబ్ లింక్‌ను ఫోన్‌కు సైబర్ నేరగాళ్లు పంపుతారు. లింక్ క్లిక్ చేయగానే మన ఫోన్ ఆపరేటింగ్ సిస్టం, స్క్రీన్ రికార్డింగ్, కాల్ డేటా, గ్యాలరీలోని ఫొటోలు, కెమెరా యాక్సిస్, యాప్స్ సైబర్ నేరగాళ్లకు చేరుతాయి. ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం చేసేటపుడు మనం ఇచ్చే వ్యక్తిగత, నెట్ బ్యాంకింగ్ పిన్ నంబర్ కూడా సైబర్ ఉచ్చులో పడతాయి.

తొలుత ఫ్రీ.. ఆపై ఫై..

మొదట్లో ఫ్రీ గా ఉండే గేమ్స్ కొన్నాళ్లకు డబ్బులు చెల్లించాలంటూ సంబంధిత లింక్‌ను యాప్ యాజమాన్యాలు ఫోన్‌కు పంపుతాయి. లింక్ క్లిక్ చేస్తే క్రెడిట్/డెబిట్ కార్డు వివరాలు అడగకుండానే కొన్ని యాప్‌లలో కేవలం ఓటీపీ మాత్రమే వస్తుంది. ఫోన్ తమ చేతిలోనే ఉండటంతో పిల్లలు ఓటీపీని ఎంటర్ చేయడం, ఖాతాలో డబ్బులు డెబిట్ అయినట్లు అదే ఫోన్‌కు వచ్చిన అలర్ట్ మెసేజ్‌ను డిలీట్ చేయడంతో డబ్బులు పోయినట్లు పెద్దలకు తెలియడం లేదు. కొన్నాళ్లకు పెద్ద మొత్తంలో డబ్బు పోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

నకిలీ యాప్‌లతో..

మనం నిత్యం ఉపయోగించే ఎనీ డెస్క్, టీం వ్యూయర్, ఫేస్ రీడింగ్, ఆధార్ ఫేస్ రీడింగ్, జీవన్ ప్రమాణ్, ఫేస్‌బుక్, క్విక్ సపోర్ట్, జూమ్, క్విక్ అసిస్ట్, గూగుల్ మేట్, గూగుల్ మీట్, స్క్రీన్ షేరింగ్, క్యూఆర్ కోడ్ స్కానర్, స్క్రీన్ రికార్డ్ తదితర యాప్‌ల స్థానంలో హిడెన్(నకిలీ) యాప్స్ ప్లే స్టోర్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. వీటిల్లో నకిలీ ఫేస్‌బుక్, ఫేస్ రీడింగ్, ఎనీ డెస్క్, టీం వ్యూయర్, క్విక్ సపోర్ట్, జూమ్, గూగుల్ మేట్, గూగుల్ మీట్ యాప్స్‌ను పిల్లలు ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. స్నేహితులతో వీడియో కాల్‌లో మాట్లాడేందుకు, వారు దిగిన ఫొటోలను అందంగా మార్చుకునేందుకు వీటిని వినియోగిస్తున్నారు.

నేరగాళ్ల వద్ద వీడియోలు..

హిడెన్ యాప్స్ డౌన్‌లోడ్, ఇన్‌స్టాల్ చేసుకున్న వెంటనే ఫోన్ కెమెరా(ఫ్రంట్, బ్యాక్) నిరంతరం రికార్డ్ అవుతుంది. ఈ వీడియో రికార్డింగ్ మన ఫోన్‌లో సేవ్ కాకుండా సైబర్ నేరగాళ్ల డెస్క్‌టాప్‌లో సేవ్ అవుతుంది. ఈ వీడియోలను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పలువురు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు.



తస్మాత్ జాగ్రత్త..

తల్లిదండ్రులు ఇరువురూ వారివారి విధుల్లో నిమగ్నం కావడంతో పిల్లలు ఫోన్‌కు బానిసలవుతున్నారు. పిల్లలకు స్మార్ట్ ఫోన్ ఇస్తే వారు ఏమేమి చూస్తున్నారు.. ఏయే లింక్స్‌ను క్లిక్ చేస్తున్నారో.. పక్కనే ఉండి గమనించాలి. సైబర్ నేరగాళ్లు పొంచి ఉన్నారని గ్రహించి అప్రమత్తంగా ఉండాలి. ఫోన్ లాక్‌ను పిల్లలకు చెప్పకూడదు. ఫింగర్ ప్రింట్ లాక్ ఉంటే మరీ మంచిది. క్రెడిట్/డెబిట్ కార్డు వివరాలు పిల్లలకు చెప్పకూడదు. ఓటీపీ సంబంధిత నగదు లావాదేవీలకు పోయిన నగదు తిరిగి రాదు. ఓటీపీ రాకుండా నగదు పోతే 24 గంటల్లోపు బ్యాంకుకు వెళ్లి అక్కడ డిస్ప్యూట్ ఫారం నింపి, బ్యాంకు అధికారులకు అందజేసిన తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

– ఎస్ఆర్‌సీహెచ్ మూర్తి, ఎస్ఐ, సైబర్ క్రైం, విజయవాడ

డిగ్రీ రీవాల్యుయేషన్ గడువు పెంపు

మచిలీపట్నం: కృష్ణా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ రెండో సెమిస్టర్ రీవాల్యుయేషన్ గడువు పొడిగిస్తూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ పి.వీర బ్రహ్మాచారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది ఆగస్టు/సెప్టెంబర్ నెలల్లో నిర్వహించిన డిగ్రీ రెండో సెమిస్టర్ రెగ్యులర్/సప్లిమెంటరీ పరీక్షలు రాసిన విద్యార్థులకు ఇటీవల ఫలితాలు విడుదల చేశారు. రీవాల్యుయేషన్ కోసం ఈ నెల 23 వరకు అవకాశం కల్పించారు. దీనిని ఈ నెల 28 వరకు పొడిగిస్తున్నట్లు వీర బ్రహ్మాచారి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. వర్సిటీ పరిధిలోని అనుబంధ కాలేజీల ప్రిన్సిపాల్స్ దీనిపై తగిన చర్యలు తీసుకొని, దరఖాస్తుదారుల జాబితాను ఈ నెల 29 నాటికి యూనివర్సిటీకి అందజేయాలన్నారు.

పనులు వేగవంతం చేయండి

మంత్రి జోగి రమేష్



పోర్టు అధికారులతో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

పెడన: బందరు పోర్టు నిర్మాణ పనుల శంకుస్థాపనకు సంబంధించిన ఏర్పాట్లు వేగవంతం చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన పెడన మార్కెట్‌యార్డు కమిటీ హాలులో పోర్టు, ముడా, కనెక్టవిటీలకు సంబంధించిన రోడ్లు, రైలు మార్గాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మ్యాప్‌ల ద్వారా మంత్రికి పలు విషయాలను సంబంధిత అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బందరు పోర్టుకు సంబంధించిన పలు అంశాలపై పూర్తి స్థాయిలో మచిలీపట్నం ఎంపీ బాలశౌరితో కలిసి చర్చిస్తామని, సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు. ఈ సమావేశంలో ముడా వీసీ బీఎస్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతకు సరికొత్త హంగులు

- మూలపాడు బటర్ ఫ్లై పార్కు అభివృద్ధికి ప్రతిపాదనలు
- రూ. 50లక్షలతో సౌకర్యాల కల్పన
- వాకింగ్ ట్రాక్‌తో పాటు చిన్నారులను ఆకర్షించేలా ఏర్పాట్లు



సాక్షి ప్రతినిధి, విజయవాడ/ఇబ్రహీంపట్నం: జీవ వైవిధ్యం కలిగిన కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్ ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరు. దీనికి సమీపంలోనే మూలపాడు వద్ద బటర్ ఫ్లై పార్కు పర్యాటకులకు మధురానుభూతి కలిగిస్తుంది. సుమారు పది ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ పార్కులో సమూహంగా విహరించే సీతాకోక చిలుకలు పర్యాటకుల మనస్సును దోచుకుంటాయి. దీనికి తోడు కొండపల్లి ఫారెస్ట్‌లో వృక్ష సంపద, ఔషధ మొక్కలు, సెలయేళ్లు, పురాతన కట్టడాలు, జంతుజాలం, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయి. అడవికే వన్నె తెచ్చేలా ఉండే అందమైన సీతాకోకచిలుకలు జూన్‌లో తొలకరి చినుకులు పడగానే రెక్కలు విచ్చుకుని ప్రాణం పోసుకుంటాయి. ఇక్కడ 23 రకాల సీతాకోకచిలుకలున్నాయి. వీటికి ఆహారంగా ప్రత్యేకమైన నెట్టర్ మొక్కలు పెంచుతున్నారు. నివాసం కోసం హోస్ట్ రకం మొక్కలు ప్రత్యేకంగా పెంచుతున్నారు.

అభివృద్ధికి రూ. 50లక్షలతో ప్రతిపాదనలు..

ఇటీవల పార్కును సందర్శించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ పార్కు విశిష్టతను గుర్తించి.. దీనిని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా పార్కులో పర్యాటకులకు అవసరమైన తాగునీరు, అదనపు బెంచీలు ఏర్పాటు చేయనున్నారు. దీంతో పాటు సహజ సిద్ధంగా ఉండేలా థీమ్‌పార్క్, సైక్లింగ్, వాకింగ్‌ట్రాక్, చిల్డ్రన్స్ ప్లే ఆర్టికల్స్, టాయిలెట్స్, అతిథులకు విశ్రాంతి గృహం, వాచ్‌టవర్ నిర్మాణం, నూతన ఔషధ మొక్కలు పెంచేందుకు వీలుగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. విద్యుత్తు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకొంటున్నారు.

ప్రతిపాదనలు సిద్ధం..



బటర్ ఫ్లై పార్కును అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశాల మేరకు పర్యాటకులకు మరింత ఆహ్లాదం పంచేందుకు వీలుగా అక్కడ అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకొంటున్నాం. విద్యుత్తు, తాగునీరు సౌకర్యం కల్పించడంతో పాటు సహజసిద్ధంగా ఉండేలా వాకింగ్ ట్రాక్ వంటివి ఏర్పాటు చేస్తున్నాం.

– కె.శ్రీనివాసులరెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, విజయవాడ

ఆకర్షణీయంగా పార్కు..



కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లోని బటర్ ఫ్లై పార్కును మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతాం. పార్కులో మౌలిక వసతులు, అభివృద్ధి కోసం రూ.50 లక్షలు కేటాయించాం. ప్రతిపాదనలు అందగానే మంజూరు చేస్తాం. అందమైన సీతాకోక చిలుకలు అంతరించిపోకుండా అన్ని చర్యలు తీసుకొంటాం. అక్కడ ఇప్పటికే 150కు పైగా వివిధ రకాల ఔషధ మొక్కలను నాటాం.

– ఎస్. ఢిల్లీరావు, కలెక్టర్, ఎన్టీఆర్ జిల్లా

పాఠశాల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు



తెలుగు పదాలను విద్యార్థితో బోర్డుపై రాయిస్తున్న కలెక్టర్, చిత్రంలో డీఈఓ

పటమట(విజయవాడతూర్పు): పాఠశాల నిర్వహణలో లోపాలుంటే చర్యలు తప్పవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు హెచ్చరించారు. మంగళవారం పటమటలోని కోనేరు బసవయ్య చౌదరి(కేబీసీ) జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల నిర్వహణ నిధులతో (స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్) మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించేందుకు జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 341 ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఎంపీడీవోలు, తహసీల్దార్లు, విద్యాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ పాఠశాలల్లో రూ.60 వేలతో చేపట్టిన పనులను పరిశీలించి నిర్వహణ లోపంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మరుగుదొడ్ల స్వయంగా పరిశీలించి తలుపులు, ట్యాపులు, పగిలిన టైల్స్‌ను చూసి అసహనాన్ని వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయులకు కలెక్టర్ 'క్లాస్'

పాఠశాల్లో పదో తరగతిలో ఇంగ్లిష్, గణితం, తెలుగుకు సంబంధించిన పాఠ్యాంశాలపై విద్యార్థులను ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని తెలుగు పదాలు బోర్డుపై రాయాలని విద్యార్థులను కలెక్టర్ సూచించారు. వారు తప్పులు రాయటంతో.. అభ్యాసపరంగా కూడా విద్యార్థులు వెనకబడి ఉన్నారని ఉపాధ్యాయులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థులకు పాఠ్యాంశాలను చదివి అర్థం చేసుకుని, రాయగలిగేలా సాధన చేయించాలని సూచించారు. ఈ పర్యటనలో డీఈవో రేణుక, పాఠశాల హెచ్ఎం ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.


నా బాట, నా మాట.. మా నాయకుడు జగన్‌తోనే..

ఆయన ఏది చెబితే అదే నాకు వేదవాక్కు ● మీడియాతో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



మాట్లాడుతున్న మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం: 'నా బాట, నా మాట, నా శ్వాస తుది వరకు మా నాయకుడు వైఎస్ జగన్‌తోనే..' అని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరంలోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తనను నమ్మి ఎమ్మెల్యే సీటిచ్చి, గెలిపించి అసెంబ్లీలో 175 మందిలో కూర్చునే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌తోనే తన ప్రయాణమని చెప్పారు. మాజీమంత్రి దేవినేని ఉమాను ఓడించాలనే తన ఆకాంక్ష ముఖ్యమంత్రి జగన్ వల్లనే నెరవేరిందన్నారు. జగన్ చెప్పిందే తనకు వేదవాక్కు అని, తిరిగి 2024లో మైలవరం నుంచి పోటీచేయమంటే చేస్తానని, లేదా పార్టీలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. ఇప్పటివరకు తాను సీఎం జగన్‌ను ఒక్కమాట కూడా అనలేదని, కానీ కొంతమంది పనిగట్టుకుని వైఎస్సార్‌సీపీలో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. వారి ప్రయత్నాలు నెరవేరవని, తాటాకు చప్పుళ్లకు భయపడనని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అన్ని సామాజిక వర్గాలకు సముచిత న్యాయం కల్పించానన్నారు. తన తండ్రి వసంత నాగేశ్వరరావు మాట్లాడిన మాటలకు తాను పూర్తిగా వ్యతిరేకమని చెప్పారు. తన తండ్రి మొదటి నుంచి దూకుడుగా వ్యవహరించేవారని, ఈ విషయం అందరికీ తెలుసని, ఆయన మాటలు పట్టించుకోవద్దని పేర్కొన్నారు. పార్టీలో కొంత అంతర్గత విభేదాలున్నాయని, వాటిని అధిష్టానం దృష్టికి తీసుకువెళతానని తెలిపారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్చడం ప్రభుత్వం నిర్ణయమని, దానికి తాను వ్యతిరేకం కాదని చెప్పారు. ఈ జిల్లాకు ఎన్టీఆర్ జిల్లా పేరు పెడితే జగన్‌ను ఎంతమంది పొగిడారు, యూనివర్సిటీ పేరు మారిస్తే విమర్శించే హక్కు వారికి ఎవరిచ్చారు అని ప్రశ్నించారు. తన తండ్రి చేసిన వ్యాఖ్యలను కొంతమంది దురుద్దేశంతోనే విషప్రచారం చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న సంఘటనలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళతానన్నారు. ఎప్పుడు ఎక్కడ ఏ సామాజిక వర్గానికి ప్రాధాన్యత కల్పించాలనేది ముఖ్యమంత్రి నిర్ణయమని చెప్పారు. తన తండ్రి వ్యాఖ్యలను వైఎస్సార్‌సీపీ అభిమానులు పట్టించుకోవద్దని ఆయన కోరారు. ఈ సమావేశంలో మైలవరం, ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, రెడ్డిగూడెం మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



వణుకు మొదలైంది!

జిల్లాలో చలి పులి పంజా విసురుతోంది. రెండు, మూడు రోజులుగా ముసురు వాతావరణం నెలకొనడంతో చలి తీవ్రత పెరిగింది. రాత్రి వేళ ఉష్ణోగ్రత గణనీయంగా పడిపోయింది. దీంతో ఇళ్లల్లో ఏసీలు, ఫ్యాన్లకు పని తగ్గింది. పిల్లలు, వృద్ధులు చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో వణికిపోతున్నారు. స్వెటర్లను ధరిస్తూ.. చలిమంటలు కాచుకుంటూ సాంత్వన పొందుతున్నారు. మంగళవారం విజయవాడ ఆటోనగర్ వద్ద చలి కాచుకుంటున్న తల్లీపిల్లలను చిత్రంలో చూడొచ్చు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

మేలుజాతి పశుసంతతి అభివృద్ధికి చర్యలు

పశుగణాభివృద్ధిసంస్థ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు



ఈడుపుగల్లు డెయిరీలో పశు చూడి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీనివాసులు

కంకిపాడు(పెనమలూరు): మేలుజాతి పశుసంతతి అభివృద్ధికి సమర్థంగా చర్యలు తీసుకుంటున్నామని పశుగణాభివృద్ధి సంస్థ (గన్నవరం) డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలోని గేదెలు, ఆవుల డెయిరీ ఫారమ్‌ను మంగళవారం సందర్శించారు. కృత్రిమ గర్భ నిర్ధారణ, చూడి పరీక్షలు, పెయ్యదూడల ఉత్పత్తి పథకంపై పశుపోషకులకు అవగాహన కల్పించారు. జెర్సీ (హెచ్ఎఫ్) ఆవులు, ముర్రా జాతి గేదెలకు కృత్రిమ గర్భధారణ ద్వారా పెయ్యదూడల ఉత్పత్తికి డోసులు (వీర్యనాళికలు) అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు కోరితే మిగిలిన పశుసంతతి వీర్యనాళికలు రప్పించి రైతులకు అందిస్తామన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో పశుసంతతి అభివృద్ధి త్వరితగతిన సాగుతుందన్నారు. ఇందుకుగానూ పెయ్య దూడల ఉత్పత్తి పథకాన్ని నవంబర్ నుంచి అమలులోకి తెచ్చిందన్నారు. జాతీయ కృత్రిమ గర్భోత్పత్తి పథకం ప్రస్తుతం నాలుగో విడత అమలులో ఉందన్నారు. అనంతరం ఈడుపుగల్లు పశువైద్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ కర్నాటి మాధవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

యనమలకుదురులో టీడీపీ నేతల హైడ్రామా


యనమలకుదురులో టీడీపీ నేతల వైఖరికి నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెనమలూరు: యనమలకుదురులో వంతెన వద్ద మంగళవారం టీడీపీ నేతలు హైడ్రామాకు తెరలేపారు. వంతెన నిర్మాణ పనులు చేయటం లేదని... ఇదేం ఖర్మ అని కార్యక్రమం చేపట్టడంతో వైఎస్సార్ సీపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇరు వర్గాలతో వంతెన ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. యనమలకుదురులో వంతెన పనులు గత కొద్ది సంవత్సరాలుగా నిలిచిపోయాయి. టీడీపీ హయాంలో ప్రారంభించిన పనులు సకాలంలో పూర్తి చేయలేదు. పనులు చేయటంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతుందని మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, మాజీ ఎమ్మెల్యే బోడెప్రసాద్ ఆధ్వర్యంలో వంతెనపై నిరసన చేపట్టారు. ఈ సమాచారం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు వంతెన వద్దకు వచ్చి టీడీపీ నేతల చర్యలను ఖండించారు. ఒక దశలో తెలుగు మహిళలు బరితెగించి అసభ్య పదజాలంతో దూషణకు దిగారు. డీఎస్పీ విజయ్‌పాల్, సీఐ గోవిందరాజు సిబ్బంది పెద్ద ఎత్తున వచ్చి ఇరువర్గాలకు సర్దిచెప్పారు. పచ్చ మీడియా అండతో టీడీపీ నేతలు నానా హడావుడి చేశారు.

బోడె–కాంట్రాక్టర్ కలిసి కుట్ర....

ఈ ఘటన పై వైఎస్సార్ సీపీ నేతలు మాట్లాడుతూ వంతెన నిర్మాణం విషయంలో బోడెప్రసాద్, కాంట్రాక్టర్ కలిసి కుట్ర పన్నారని తెలిపారు. టీడీపీ హయాంలో చేపట్టిన వంతెన పనులు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు ఎందుకు చెల్లించలేదని నిలదీశారు. బోడెప్రసాద్‌కు నీతి నిజాయితీ ఉంటే కాంట్రాక్టర్‌తో కోర్టులో వేసిన కేసును ఎత్తివేయించాలని డిమాండ్ చేశారు. అసంపూర్తిగా ఉన్న వంతెన పనులు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సొంత నిధులతో నిర్మాణం పూర్తి చేస్తారన్నారు. ఈ సవాల్‌కు బోడెప్రసాద్ సిద్ధమా అని అడిగారు. యనమలకుదురు ప్రజల ఇబ్బందులకు బోడెప్రసాద్ స్వార్థ బుద్ధే కారణమని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ నేతలు అన్నే చిట్టిబాబు, వెలగపూడి వరప్రసాద్, యార్లగడ్డ వీరబాబు, ఈడే గోపాలకృష్ణ, హక్, గుమ్మడి విజయ్‌కుమార్, మరీదు శ్రీనివాసరావు, కోసూరి నరేష్, అమోధ్య సత్యనారాయణ, గద్దల రాజా, వల్లే నరసింహారావు, చాంద్‌బాషా, సిద్దిక్, బాలకృష్ణ, కాకి శ్రీనివాసరావు పలువురు పాల్గొన్నారు.

టీడీపీ నేతల పై కేసు....

ప్రజలను, అధికారులను భయభ్రాంతులకు గురిచేసిన చేసిన టీడీపీ నేతల పై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం .. యనమలకుదురు గ్రామంలో వంతెన వద్దకు మాజీ ఎమ్మెల్యే బోడెప్రసాద్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, నేతలు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, అనంతనేని అజాద్, మరో వంద మంది అనమతులు లేకుండా చేరుకుని గ్రామస్తులు, అధికారులను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. బోడెప్రసాద్ బందరు కాలువలో దూకి చనిపోతానని బెదిరించారని చెప్పారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దూషించాడని ఫిర్యాదు అందటంతో కేసు నమోదు చేశామని తెలిపారు.

చేతకాని దద్దమ్మలు.. టీడీపీ నేతలు

కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి)


తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి)

కంకిపాడు: టీడీపీ నేతలు చేతకాని దద్దమ్మలు అని కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి) మండిపడ్డారు. యనమలకుదురు గ్రామంలోని వంతెన నిర్మాణం విషయంలో టీడీపీ చేసిన వింత నాటకంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కిరణ్ కుమార్‌రెడ్డి హయాంలో యనమలకుదురులో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన జరిగిందన్నారు. తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ఐదేళ్ల పాటు కళ్లు మూసుకుని కూర్చుందని ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్నన్నాళ్లూ వంతెన నిర్మాణం, ప్రజల ఇబ్బందులు ఏ రోజూ పట్టించుకోలేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పాలన చూసి టీడీపీ నేతలకు కళ్లు కుడుతున్నాయన్నారు. వంతెన నిర్మాణం ముందుకు సాగకుండా కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై కోర్టుల్లో కేసులు వేయించిన ఘనులు టీడీపీ నేతలేనన్నారు. సంక్షేమ పథకాలతో ప్రజలు చాలా ఆనందంగా ఉంటే చూసి తట్టుకోలేకపోతున్నారని చెప్పారు. ప్రజా ప్రయోజనాల కోసం టీడీపీ నేతలు ఉంటే కాంట్రాక్టరుతో కేసులు విరమింపచేయాలని డిమాండ్ చేశారు. ఆర్నెల్లలో వంతెన నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కేసులు విరమింపచేయకుండా కుట్ర, కుళ్లు రాజకీయం చేస్తూ ప్రజల్ని వంచించటం టీడీపీకే చెల్లిందన్నారు. కోర్టు అభ్యంతరాలు తొలగించేలా టీడీపీ ప్రయత్నం చేయాలన్నారు. అంతేతప్ప ప్రజల్ని రెచ్చగొట్టేలా చేస్తే ప్రజాకోర్టులో భంగపాటు తప్పదన్నారు.

హిజ్రాల వేధింపులతో బాలిక ఆత్మహత్య


అనురాధ (ఫైల్)

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): తీసుకున్న అప్పు తీర్చలేదని హిజ్రాలు వేధింపులకు గురిచేయడంతో మనస్తాపం చెంది బాలిక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. తంబి దాసు, పద్మ దంపతులు. నగరంలోని ఒక హోటల్లో పనిచేసుకుంటూ ఇద్దరు కూతుళ్లతో కలసి డీమార్టు వెనుక, బావాజీపేట 2వ లైన్‌లో నివాసముంటున్నారు. పెద్ద కూతురు ల్యాబ్‌లో పనిచేస్తుండగా రెండవ కుమార్తె తంబి అనురాధ (18) నగరంలోని ఒక కళాశాలలో ఇంటర్‌మీడియెట్ చదువుకుంటుంది. ఇటీవల ఇంటి అవసరాల మేరకు కుటుంబసభ్యులు తమకు తెలిసిన ఒక హిజ్రా వద్ద రూ.10 వేలు అప్పుగా తీసుకున్నారు. సకాలంలో అప్పు తీర్చకపోవడంతో సోమవారం రాత్రి కొంతమంది హిజ్రాలు వారి ఇంటి ముందుకు చేరి అసభ్యకరంగా దూషణలకు దిగారు. దీనిపై తీవ్ర మనస్తాపం చెందిన అనురాధ మంగళవారం ఉదయం తల్లిదండ్రులు పనులకు వెళ్లిన తర్వాత ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. 11.30 గంటల సమయంలో బాలిక అమ్మమ్మ కొమ్మూరి నరసమ్మ కూరగాయలు ఇచ్చేందుకు ఇంటికి వచ్చి చూడగా బాలిక ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించింది. వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించి స్థానికుల సాయంతో లోపలికి కిందికి దింపి ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బాలిక మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. దీనిపై ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డిజిటలైజేషన్‌పై శిక్షణ ప్రారంభం


మాట్లాడుతున్న వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్టు డైరెక్టర్ శివరామకృష్ణ

పామర్రు: డ్వాక్రా సంఘాల్లోని సభ్యులకు చెందిన పూర్తి సమాచారం డిజిటలైజేషన్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్టు డైరెక్టర్ శివరామకృష్ణ తెలిపారు. లోక్ ఆపరేటింగ్ సిస్టమ్ కార్యక్రమంలో భాగంగా కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏపీఎం, సీసీలకు మూడు రోజుల శిక్షణ తరగతులను మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా శివరామకృష్ణ పాల్గొని మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేసే విధంగా అందరూ తగు విధమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్వాక్రా సభ్యుల ఆధార్ నంబరు, బ్యాంక్ ఎకౌంట్లతో పాటు వారు నిర్వహించే పుస్తకాలు తదితర అంశాలను ఆన్‌లైన్‌లో ఏవిధంగా పొందుపర్చాలనే విషయమై శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. తొలుత డిజిటలైజేషన్‌పై ఏపీఎంలకు, సీసీలకు ట్రైనింగ్ ఇస్తామని పేర్కొన్నారు. తర్వాత వీరందరూ వారి వారి మండలాల పరిధిలోని వీవోఏలకు, డ్వాక్రా సంఘాల అధ్యక్ష కార్యదర్శులకు డిజిటలైజేషన్ గురించి వివరిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమాలు రెండు నెలల వ్యవధిలో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. డ్వాక్రా సంఘాల నుంచి షేర్ క్యాపిటల్‌ను వసూలు చేయాలని సూచించారు. జిల్లాలోని 25 మండలాలకు చెందిన ఐకేపీలు, సీసీలకు తొలి దశగా శిక్షణ ఇస్తున్నామని వివరించారు. పశు సంవర్ధకశాఖ జేడీ కె.చంద్రశేఖర్‌రావు, సెర్ప్ డైరెక్టర్ ఐబీ లావణ్య, డీపీఎంలు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, ఎంపీడీవో వై.రామకృష్ణ, ఐకేపీ ఏసీ సుందరరావు, ఐకేపీ ఏపీఎం తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ విజ్ఞాన భాండాగారాలు..

- కళాశాలల్లో అద్భుతంగా గ్రంథాలయాల నిర్వహణ
- లక్షలాది పుస్తకాలు కొలువుదీరిన వైనం
- విద్యార్థుల భవితకు అండగా ఎన్నో పుస్తకాలు


కేబీఎన్ కళాశాలలోని గ్రంథాలయం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని పలు కళాశాలల్లో గ్రంథాలయాలు లక్షలాది పుస్తకాలతో కొలువుదీరి విద్యార్థులకు అపూర్వమైన జ్ఞానాన్ని అందిస్తున్నాయి. ప్రముఖ కళాశాలల్లో ఐదారు దశాబ్దాలుగా గ్రంథాలయాలను అద్భుతంగా నిర్వహిస్తూ విద్యార్థుల భవితకు అండగా ఉంటున్నాయి. ఒక్కొక్క కళాశాల గ్రంథాలయంలో సుమారు లక్ష వరకూ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. నగరంలోని ఆంధ్ర లయోల కళాశాలలోని గ్రంథాలయంలో 1.20 లక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచారు. అదేవిధంగా కేబీఎన్ కళాశాలలో సుమారు 85 వేల పుస్తకాలున్నాయి. మారీస్ స్టెల్లా కళాశాల గ్రంథాలయంలో సుమారు లక్షా ఎనిమిది వేల పుస్తకాలు ఉన్నట్లు ఆ కళాశాల గ్రంథాలయ నిర్వాహకులు తెలిపారు. పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 93 వేల పుస్తకాలు ఉన్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు పేర్కొన్నారు. వీటితో పాటుగా జిల్లాలోని మిగిలిన కళాశాలల్లో 50 వేలకు పైగా పుస్తకాలు కొలువుదీరి ఆయా విద్యార్థులకు అనంతమైన జ్ఞానాన్ని అందించే సాధనాలుగా కొనసాగుతున్నాయి.

కళాశాలల్లో అరుదైన పుస్తకాలు...

జిల్లాలోని వివిధ కళాశాలల గ్రంథాలయాల్లో అరుదైన పుస్తకాలు సమకూర్చారు. ఆంధ్రా లయోల కళాశాలలో సరస్వతీ సహస్రనామాలతో కూడిన తాళపత్ర గ్రంథం ఉంది. వాటితో పాటుగా 300 రకాల డిక్షనరీలు సైతం ఉన్నాయి. ప్రపంచంలోని పది ప్రముఖ మ్యూజియాలకు సంబంధించి వివరాలు తెలిపే గ్రంథాలున్నాయి. ఒక్కొక్క మ్యూజియానికి ఒక్కొక్క పుస్తకం ఉన్నట్ల లైబ్రేరియన్ పేర్కొన్నారు. కేబీఎన్ కళాశాల లైబ్రరీలో రామాయణ, మహాభారత, ఇతర పురాణాలకు సంబంధించిన పురాతన గ్రంథాలు కొలువుదీరాయి. సుమారు 80 సంవత్సరాలకు పూర్వం ముద్రితమైన పుస్తకాలు ఉన్నాయి. డిక్షనరీలకు సంబంధించి ఒక్కొక్క అక్షరానికి రెండు వాల్యూమ్స్ లభిస్తున్నాయి. పోటీ పరీక్షలకు సంబంధించి వేలాది పుస్తకాలు ఉన్నట్లు కేబీఎన్ లైబ్రేరియన్ వివరించారు. వాటితో పాటుగా పీబీ సిద్ధార్థలో సైతం తాళపత్ర గ్రంథాలున్నాయి. 1930లో ప్రచురించిన పుస్తకాలు సైతం తమ వద్ద ఉన్నట్లు చెబుతున్నారు. అలాగే మారీస్ స్టెల్లా కళాశాలలో ప్రముఖుల బయోగ్రఫీలకు సంబంధించి పలు విలువైన గ్రంథాలు అందుబాటులో ఉన్నాయి. అన్ని ప్రముఖ కళాశాలలు డిజిటల్ లైబ్రరీలను సైతం నిర్వహిస్తున్నాయి.


లయోలా కళాశాలలో నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థులు

పటిష్టంగా ఉన్నాయి



కళాశాలల్లో గ్రంథాలయాలు చాలా పటిష్టంగా ఉన్నాయి. లక్షలాది పుస్తకాలతో విద్యార్థులకు గొప్ప విజ్ఞానాన్ని అందిస్తున్నాయి. తమ కళాశాలలో చాలా అరుదైన గ్రంథాలు ఉన్నాయి.

జీపీ ప్రసాదరావు, లైబ్రేరియన్, ఆంధ్ర లయోల కళాశాల

పుస్తకాలను కాపాడుకుంటున్నాం



మా గ్రంథాలయంలో ఉన్న వేలాది పుస్తకాలను కాపాడుకుంటున్నాము. మొదటి తరం లైబ్రరియన్లు, అధ్యాపకులు చాలా పుస్తకాలను సేకరించారు. వాటిని భద్రపరిచి విద్యార్థులకు అందిస్తున్నాము. సమాచారం కోసం మా గ్రంథాలయానికి ఇతర జిల్లాల నుంచి సైతం వచ్చి వెళ్తుంటారు.

శ్రీనివాసరాజు, లైబ్రేరియన్, కేబీఎన్ కళాశాల

పోటీ పరీక్షలకు పుస్తకాలు



కళాశాల గ్రంథాలయాలు యువతకు అండగా ఉంటున్నాయి. మా కళాశాలలో విద్యార్థులు పోటీ పరీక్షలకు వెళ్లేందుకు అవసరమైన వేలాది గ్రంథాలతో ప్రత్యేక విభాగాన్ని నిర్వహిస్తున్నాం. గ్రంథాలయాన్ని విద్యార్థులు పెద్ద సంఖ్యలో వినియోగించుకుంటున్నారు.

శీలం విశాలక్ష్మి, లైబ్రేరియన్, మారీస్ స్టెల్లా కళాశాల

విజయవంతంగా గ్రంథాలయ వారోత్సవాలు

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ


మాట్లాడుతున్న జమల పూర్ణమ్మ

మచిలీపట్నంటౌన్:ఉమ్మడి కృష్ణా జిల్లాలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమలపూర్ణమ్మ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆమె మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో 105 గ్రంథాలయాల్లో వారోత్సవాలు నిర్వహించామని చెప్పారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం, రంగవల్లుల పోటీలు నిర్వహించామని పేర్కొన్నారు. 4,450 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, విలువైన పుస్తకాలను బహుమతిగా అందించామని తెలిపారు. విజయవాడ, మచిలీపట్నం కేంద్ర గ్రంథాలయాలతో పాటు జిల్లాలోని శాఖ గ్రంథాలయాల్లో ఈ పోటీలు నిర్వహించామని చెప్పారు. మచిలీపట్నం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారం రోజుల పాటు పోటీలతో పాటు సాహిత్య సభలు, కార్టూన్ ప్రదర్శన, కవి సమ్మేళనం, సంగీత, సాహిత్య నాట్య కదంబం వంటి కార్యక్రమాలు నిర్వహించామని వెల్లడించారు. విజయవాడ పడమటలో ఓ దాత రూ. 6 కోట్ల విలువైన 500 గజాల స్థలం త్వరలో రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వబోతున్నారని, దీనిలో అధునాతన హంగులతో గ్రంథాలయం నిర్మిస్తామని వివరించారు. రూ. 92 లక్షలతో జిల్లాలోని పలు గ్రంథాలయాలను కంప్యూటరీకరించామని తెలిపారు. పెనమలూరులో రూ. 24 లక్షలతో నూతన గ్రంథాలయాన్ని నిర్మించి ప్రారంభించామన్నారు. జిల్లాలోని 29 గ్రంథాలయాల్లో మరమ్మతులు చేశామన్నారు. మరో రూ. 2 కోట్లతో మరిన్ని గ్రంథాలయాల్లో మరమ్మతులు చేస్తామన్నారు. అన్ని గ్రంథాలయాలను ఆధునికంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకం ఉంచి అప్పగించిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తూ గ్రంథాలయ పాఠకులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు.

శాస్త్రీయ పరిజ్ఞానంతో మానసిక అభివృద్ధి

కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు



విద్యార్థులు రూపొందించిన రోబోను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

విజయవాడరూరల్: సృజనాత్మకతతో కూడిన శాస్త్రీయ పరిజ్ఞానం విద్యార్థుల మానసిక అభివృద్ధికి దోహదపడుతుందని.. అందుకే సైన్స్ ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన సైన్స్ పరికరాలను తిలకించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు ఆహ్లాదకరమైన అనుభూతిని కల్పించడానికి సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదపడతాయని చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందచేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఫిబ్రవరి 27, 28 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాలల ఆవరణలో ఆకు కూరలు, కూరగాయల మొక్కలు నాటి సంరక్షించాలని ఆదేశించారు. డీఈవో సీవీ రేణుక, ఎంపీడీఓ భార్గవి, ఎంఈఓ వెంకటరత్నం తహసీల్దారు సాయిశ్రీనివాసనాయక్, జిల్లా సైన్స్ అధికారి హుస్సేన్, సర్పంచ్ ఉయ్యూరు గోపాలరావు, ప్రధానోపాధ్యాయులు కమలాకరరావు, ఉపాధ్యాయులు, కార్యదర్శి మురళీమోహనరావు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

జేసీ నుపూర్ శ్రీవాస్ అజయ్‌కుమార్


సర్వే మ్యాప్ పరిశీలిస్తున్న జేసీ, ఇతర అధికారులు

కంచికచర్ల : రీ సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జాయింట్ కలెక్టర్ నుపూర్ శ్రీవాస్ అజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని పరిటాల గ్రామంలో మంగళవారం స్వామిత్వ సర్వేను ఆమె పరిశీలించారు. ఈ మేరకు జేసీ మాట్లాడుతూ సమగ్ర భూ సర్వే పథకంలో భాగంగా రెవెన్యూ అధికారులు ఇప్పటికే గ్రామాల్లో హద్దులు, కొలతలు నిర్ణయించి డ్రోన్ ఫ్లైయింగ్ గ్రౌండ్ కంట్రోలు పాయింట్లను గుర్తించారని చెప్పారు. సర్వే చేసిన వెంటనే రాళ్లను పాతారని, జీఎన్ఎస్ఎస్ రోవర్, ఈటీఎస్ వంటి ఆధునిక యంత్రాల సాయంతో అక్షాంశ, రేఖాంశాలతో కూడిన జియో కోడ్స్ డేటాతో భూముల ఛాయా చిత్రాలను సేకరించారని చెప్పారు.

ఈ డేటా ఆధారంగానే సర్వే ఆఫ్ ఇండియా ప్రతి గ్రామంలో అర్థోరెక్టిఫైడ్ ఇమేజ్ ఛాయా చిత్రాలను అందించిందన్నారు. అనంతరం గ్రామంలో ఇళ్లను కొలతలు, హద్దులో తేడాలున్నాయేమోనని పరిశీలించారు. డీపీఓ సునీత, డీఎల్‌పీఓ శ్రీనివాసరావు, సర్పంచ్ యద్దనపూడి ఆనందజ్యోత్స్న, పరిటాల, కంచికచర్ల పంచాయతీ కార్యదర్శులు మీర్జావలి, రవికుమార్, డీటీ నాగుల్‌మీరా, ఇన్‌చార్జి ఎంపీడీఓ బాల శంకరరావు, సర్వేయర్ బసవరావు, ఆర్ఐ శిరీష, ఉపాధి హామీ పథకం ఏపీఓ శరత్, గ్రామ సచివాలయ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి-కృష్ణ కో ఆపరేటివ్ సొసైటీలో ఉద్యోగ అవకాశాలు

24న విజయవాడలో ఇంటర్వ్యూలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గోదావరి-కృష్ణ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సంస్థలో ఉద్యోగాల కోసం గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు (పురుషులు) ఈ నెల 24న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని డీఆర్‌డీఏ స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్ట్ ప్లేస్‌మెంట్ ట్రైనర్ ఎంవీ సూర్య నరేంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడ వన్‌టౌన్, అజిత్‌సింగ్‌నగర్, సత్యనారాయణపురం, గవర్నర్‌పేట, పటమట, పోరంకి, ఉయ్యూరు, గుడివాడ, మచిలీపట్నం, నూజివీడు బ్రాంచిలతోపాటు త్వరలో ప్రారంభ కానున్న బంటుమిల్లి, చల్లపల్లి, గన్నవరం, రామవరప్పాడు, కొండపల్లి, భవానీపురం బ్రాంచిలల్లోనూ అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ సేల్స్/ లోన్స్/ కలెక్షన్స్/ ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ పోస్టులకు ఏదైనా డిగ్రీ ఆపైన, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్, కలెక్షన్ ఏజెంట్లకు ఇంటర్ అర్హతలు కలిగి ఉండాలన్నారు. వయసు పరిమితి 21 నుంచి 35 వరకు ఉండవచ్చని తెలిపారు. ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్‌కు బైక్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి అని పేర్కొన్నారు. ఎంపికయిన ఉద్యోగికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం ఉంటుందని, అయితే ఇవి ప్రైవేట్ ఉద్యోగాలు మాత్రమేనని తెలిపారు. విజయవాడ వన్‌టౌన్ ఇస్లాంపేట పంజా సెంటర్ దగ్గర (మిలాప్ హోటల్ పక్కన) 24వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. పూర్తి వివరాలకు 9398665266 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థిపై శ్రీచైతన్య ఉద్యోగి దాడి

కంకిపాడు: ఇటీవల ఓ విద్యార్థిపై కార్పొరేట్ కళాశాల అధ్యాపకుడు కాలితో కొట్టిన ఘటన మర్చిపోకముందే పునాదిపాడు (గోసాల) శ్రీచైతన్య క్యాంపస్‌లో ఉద్యోగి విద్యార్థినిపై దాడి చేయడం కలకలం రేపుతోంది. ఎస్ఐ వై.దుర్గారావు కథనం మేరకు...వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన లింగాల లక్ష్మీచరణ్‌రెడ్డి శ్రీచైతన్య క్యాంపస్‌లో ఇంటర్మీడియెట్ బైపీసీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 21న లక్ష్మీచరణ్‌రెడ్డి తండ్రి కళాశాలకు ఫోన్ చేసి పోటీ పరీక్షల నిమిత్తం విద్యార్థి ఐడీ కావాలని కోరారు. దీంతో విద్యార్థి లక్ష్మీచరణ్‌రెడ్డి మధ్యాహ్న భోజన విరామ సమయంలో కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న శ్రీహర్షను ఐడీ ఇవ్వాలని కోరాడు. ఈ విషయమై వాగ్వాదం జరిగి కళాశాల ఉద్యోగి శ్రీహర్ష విద్యార్థిని ముఖంపై దాడి చేశాడు. దీంతో ముక్కు, ముఖానికి రక్తపు గాయమైంది. విషయాన్ని విద్యార్థి కుటుంబ సభ్యులు కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగి శ్రీహర్షను విధులు నుంచి తొలగించామని, తమకు ఎలాంటి సంబంధం లేదని, ఏం చేసుకుంటారో చేసుకోమని చెప్పటంతో బాధిత విద్యార్థి లక్ష్మీచరణ్‌రెడ్డి కంకిపాడు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుర్గారావు తెలిపారు.

క్లుప్తంగా

రిటైర్డ్ హోంగార్డుకు ఆర్థిక చేయూత



విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు స్టేషన్లలో హోం గార్డుగా విధులు నిర్వర్తించి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన డి.కృపావతికి జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా రూ.5 లక్షలను మంగళవారం ఆయన కార్యాలయంలో అందజేశారు. కృపావతి కుటుంబానికి ఆర్థిక ఆసరా కల్పించేందుకు కమిషనరేట్ పరిధిలోని హోం గార్డులందరూ వారి ఒక్క రోజు వేతనాన్ని సమకూర్చారు. ఈ నగదు చెక్కును కమిషనర్ చేతుల మీదుగా కృపావతికి అందజేశారు. కార్యక్రమంలో ఏడీసీపీ పి.వెంకటరత్నం, హోంగార్డ్స్ ఆర్ఐ కృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): రింగ్ రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ గుణదల డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ఆక్రమణల తొలగింపు



కృష్ణలంక(విజయవాడతూర్పు): జాతీయ రహదారిపై వారధి గుంటూరు బస్టాప్‌లోని ఆక్రమణలను కార్పొరేషన్ అధికారులు మంగళవారం తొలగించారు. రాణిగారితోటలోని వాటర్ ట్యాంక్ సమీపంలో కొంతకాలం క్రితం ఫీడర్ రోడ్డులో సైడు కాలువలను కొంతమంది ఆక్రమించి జాతీయ రహదారిపైకి బడ్డీలను ఏర్పాటు చేశారు. కాలక్రమేణా తొమ్మిది బడ్డీలకు పెరగడంతో జాతీయ రహదారిపై తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. బడ్డీలను తొలగించాలని కార్పొరేషన్ అధికారులకు కొందరు పలుమార్లు ఫిర్యాదు చేశారు. దీంతో టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి ఆక్రమణ నిర్మూలనా దళంతో బడ్డీలను తొలగించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

స్టెల్లా మిస్ సెలబ్రిటీ.. సంజన



పటమట(విజయవాడతూర్పు): స్టెల్లా కళాశాల ఫెట్‌డే కార్యక్రమాలు సందర్భంగా మంగళవారం మిస్ సెలబ్రిటీ షో జరిగింది. కార్యక్రమంలో ఇంటర్మీడియెట్, డిగ్రీ విద్యార్థినులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీలకు అధ్యాపకులు శాంతిశ్రీ, శ్వేత న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కళాశాల మిస్ సెలబ్రిటీ పోటీల్లో సంజన మొదటి స్థానం సాధించగా, కృతి, జాహ్నవి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు కళాశా డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ అనూహ్య బహుమతులు అందజేశారు.

నేడు తెలుగమ్మాయి పోటీలు

కళాశాలలో బుధవారం విద్యార్థినులకు తెలుగమ్మాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జసింత క్వాడ్రస్ తెలిపారు. కళాశాల ఆడిటోరియంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి పోటీలు జరుగుతాయన్నారు.

ఇంద్రకీలాద్రిపై అన్నప్రసాద వితరణ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మాసశివరాత్రి, కార్తిక మాసం ముగింపును పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మంగళవారం రాత్రి భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని శ్రీ మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం సాయంత్రం అన్నాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారికి అన్నాభిషేకం అనంతరం విశేషంగా అలంకరించారు. పూజ అనంతరం రాజగోపురం ఎదుట భక్తులకు స్వామి వారి అన్నప్రసాద వితరణ చేశారు. 1000 మంది భక్తులు స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులు విశేష సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు అన్నప్రసాదాన్ని వడ్డించారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్



రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న అవినాష్, మేయర్ భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ దుర్గ, నాయకులు



ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న దేవినేని అవినాష్, పద్మావతి తదితరులు

గుణదల(విజయవాడతూర్పు): అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. 4వ డివిజన్ పరిధిలోని లయోలా గార్డెన్స్ ప్రాంతంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను అందజేయడంతో పాటు సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. గడప గడపలో నాయకులకు ఘన స్వాగతం లభించింది.

కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు..

ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిలో భాగంగా ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. తూర్పు నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. రోడ్లు, తాగునీరు, ఆస్పత్రులు, పార్కుల అభివృద్ధి వంటి మౌలిక వసతుల పనులు కొనసాగుతున్నాయన్నారు. కోట్లాది రూపాయల నిధులతో ఈ అభివృద్ధి పనులు పూర్తికానున్నాయన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని అవినాష్ చెప్పారు. ఈ మేరకు ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించటంలో ప్రభుత్వం సఫలమైందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. అధికారులు నిబద్ధతతో పని చేస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రజలు మళ్లీ తమను గెలిపిస్తారని చెప్పారు.

రాష్ట్రంలో టీడీపీ భూస్థాపితం..

రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కనుమరుగు కానుందని దేవినేని అవినాష్ తెలిపారు. ప్రజాక్షేత్రంలో సీఎం జగన్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక టీడీపీ నేతలు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇప్పటికే ప్రజలు తెలుగుదేశం పార్టీని భూస్థాపితం చేశారని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి డిపాజిట్లు కూడా దక్కవని స్పష్టం చేశారు. మరో 30 ఏళ్ల పాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగుతారని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 4వ డివిజన్ ఇన్‌చార్జ్ గల్లా పద్మావతి, కార్పొరేటర్లు భీమిశెట్టి ప్రవల్లిక, కలపాల అంబేడ్కర్, నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రూ.38 లక్షలతో రహదారుల నిర్మాణం

మౌలిక వసతుల కల్పనకు నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటుందని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. లయోలా గార్డెన్స్ ప్రాంతంలో అంతర్గత రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరంలో రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీరు వంటి వసతుల కల్పన శరవేగంగా జరుగుతోందన్నారు. దీనిలో భాగంగా 4వ డివిజన్‌లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ.38 లక్షల ప్రభుత్వ నిధులు కేటాయించామన్నారు. అనంతరం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

నేడు డయల్ యువర్ డీఎంలు

పటమట(విజయవాడతూర్పు): ఏపీఎస్‌ఆర్టీసీ ఆటోనగర్ డిపో నుంచి దూర ప్రాంత సర్వీసులైన చెన్నై, బెంగళూరు, తిరుపతి, కర్నూలు, విశాఖపట్నం, హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలకు నడుపుతున్న సర్వీసులకు సంబంధించి ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలకు డయల్ యువర్ డిపో మేనేజర్ నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కె.ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య ప్రయాణికులు 99592 25463 ఫోన్ నంబర్‌కు కాల్ చేసి తమ సందేహాలను, సలహాలను, ఫిర్యాదులను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

విజయవాడ మెయిన్ డిపో పరిధిలో..

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): విజయవాడ మెయిన్ డిపో పరిధిలో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎస్‌ఎస్పీ శర్మ తెలిపారు. బుధవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య 83329 81435 మొబైల్ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

ఖబర్‌స్తాన్ అభివృద్ధి పనుల పరిశీలన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేటలోని జన్నతుల్ ఫిర్దోస్ ఖబర్‌స్తాన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా మంగళవారం పరిశీలించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఖబర్‌స్తాన్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. పనులు పరిశీలించిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, మత పెద్దలు, జన్నతుల్ ఫిర్దోస్ ఖబర్‌స్తాన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వసతుల కల్పనలో రాజీ లేని పాలన

వీఎంసీ స్థాయీ సంఘం సమావేశంలో మేయర్ భాగ్యలక్ష్మి



స్థాయీ సంఘం సమావేశం నిర్వహిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, హాజరైన అధికారులు, సభ్యులు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని ఆయా డివిజన్లలో మౌలిక వసతులు కల్పనలో తాము రాజీలేని పాలన కొనసాగిస్తున్నామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి స్పష్టం చేశారు. వీఎంసీ కమాండ్ కంట్రోల్‌రూంలో స్థాయీ సంఘం సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మొత్తం 11 అంశాలు అజెండాల్లోకి రాగా అందులో ఆరు అంశాలను స్థాయీసంఘం సభ్యులు ఆమోదించగా, మూడు అంశాలను వాయిదా వేశారు. ఒక అంశాన్ని ధ్రువపరచగా, ఒక అంశాన్ని క్రమబద్ధీకరించారు. నగరంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమాంతరంగా నిర్వహిస్తున్నామని, సీఎం జగన్ సారథ్యంలో విజయవాడ మరింత అభివృద్ధి చెందుతుందని మేయర్ తెలిపారు.

అజెండాలోని ప్రధాన అంశాలు

- వీఎంసీ పరిధిలోని 5వ డివిజన్ మాచవరంలోని జీ ప్లస్1 భవనంలో ఉన్న విజయలెన్స్ సర్వీస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదవారికి ఉచిత వైద్య పరీక్షలు, చెవుడు, మూగ వారికి జీవనోపాధి నిమిత్తం ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. సంబంధిత భవనానికి ఆస్తి పన్ను మినహాయింపు ఇవ్వాలని ప్రతిపాదన రాగా కమిటీ సభ్యులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు.
- సర్కిల్–3 పరిధిలో అద్దె ప్రాతిపదికన నడుస్తున్న 3 వార్డు సచివాలయాలకు అద్దె గడువు ముగిసింది. ప్రస్తుతం ఒక్కో భవనానికి రూ.40 వేలు అద్దె చెల్లిస్తున్నారు. దీన్ని 5 శాతం అద్దె పెంపుదలకు భవన యజమానుల నుంచి అభ్యర్థన వచ్చింది. ఆయా భవనాల్లో లీజు గడువు మరో రెండేళ్లు పెంపుదల చేస్తూ అద్దెను ఒక్కో సచివాలయానికి రూ.42 వేలు చేయాలని వచ్చిన ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు.
- దసరా ఉత్సవాలు సందర్భంగా వీఎంసీ ఆధ్వర్యంలో ఇంద్రకీలాద్రి చుట్టూ, ఒన్‌టౌన్ ఏరియాలోని ముఖ్యమైన కూడళ్లలో, స్నాన ఘాట్ల వద్ద 10 రోజుల పాటు పారిశుద్ధ్య విధులు నిర్వహించారు. కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఒక్కో కార్మికునికి రూ.500 వేతనం చొప్పున మూడు షిఫ్టుల్లో 100 మంది కార్మికులకు సరఫరా చేశారు. దీనికి రూ.66.60 లక్షల వ్యయాన్ని కార్పొరేషన్ జనరల్ బడ్జెట్ నుంచి నిధులు విడుదల చేయాలని వచ్చిన ప్రతిపాదనపై స్థాయీ సంఘం వాయిదా వేశారు.

ప్రథమ చికిత్సతో ప్రాణదానం



కేబీఎన్ కళాశాలలో మాట్లాడుతున్న డాక్టర్ సమరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రాణదానం చేసే శక్తి ప్రథమ చికిత్సకు ఉందని ప్రముఖ వైద్య నిపుణుడు, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.సమరం తెలిపారు. కేబీఎన్ కళాశాల జాతీయ సేవా పథకం, రెడ్‌క్రాస్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై శిక్షణా శిబిరాన్ని మంగళవారం ఆ కళాశాల ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా హాజరైన డాక్టర్ సమరం మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి సకాలంలో ప్రథమ చికిత్సను అందిస్తే ఆ వ్యక్తి ప్రాణాపాయం నుంచి బయటపెట్టవచ్చన్నారు. ప్రథమ చికిత్సను ప్రపంచంలో మొదటిసారిగా అస్మార్కు అనే జర్మన్ వైద్యుడు చేపట్టారన్నారు. ప్రథమ చికిత్సలో సీపీఆర్‌కు చాలా ప్రముఖ స్థానముందన్నారు. ఇటీవల గుండె సమస్యలతో ఆకస్మాత్తుగా పలువురు మరణిస్తున్నారని చెప్పారు. వారికి వెంటనే సీపీఆర్‌ను నిర్వహించి సకాలంలో వైద్యుని వద్దకు తీసుకువెళ్తే వారు బతికేటానికి అవకాశముంటుందన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా విద్యార్థులకు ప్రథమ చికిత్సలో శిక్షణనిచ్చి వారిని నిపుణులుగా తీర్చిదిద్దటం ద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేయటానికి కృషి చేస్తున్నామన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


ప్రథమ చికిత్స కీలకం

సభకు అధ్యక్షత వహించిన కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రథమ చికిత్స చాలా కీలకమైన అంశమన్నారు. ప్రమాదం సంభవించినప్పుడు వారికి ఆస్పత్రికి వెళ్లేలోపు సరైన ఆసరా లేదా ప్రథమ చికిత్స అందక అనేక మంది మృత్యువాత పడుతున్నారని చెప్పారు. ఐదున్నర దశాబ్దాలుగా వైద్యరంగంలో విశేషమైన సేవలందిస్తున్న డాక్టర్ సమరం స్వయంగా ప్రథమ చికిత్సలో శిక్షణ ఇవ్వటం గొప్పవిషయమన్నారు. కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ప్రోగ్రామ్ ఆఫీసర్ వీఎస్‌రావు నిర్వహించగా, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఎన్.సాంబశివరావు, డి.పవన్‌కుమార్, అధ్యాపకులు అలీబాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

● నిబంధనలు బేఖాతరు !







నగరంలో కొందరు వాహనదారులు నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. వాహనాల నంబరు ప్లేట్లను యథేచ్ఛగా తొలగించి, రహదారులపై రయ్ రయ్ మంటూ దూసుకెళ్తున్నారు. నంబరు ప్లేట్లు లేకుండా సిగ్నల్ క్రాసింగ్, ట్రిపుల్ రైడింగ్, మైనర్లు డ్రైవింగ్ చేస్తూ నిబంధనలను అతిక్రమిస్తున్న దృశ్యాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

వైభవంగా దీపోత్సవం



శివలింగం ఆకారంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



విశేష అలంకరణలో స్వామి వారు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కార్తిక మాసాన్ని పురస్కరించుకుని భీమన వారి పేటలోని శ్రీవిజయ దుర్గా రామలింగేశ్వర స్వామి వారి సన్నిధిలో మంగళవారం దీపార్చన నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకాలు, సాయంత్రం అర్చన నిర్వహించగా, ఆలయ ప్రాంగణంలో పూలతో భారీ శివలింగాన్ని ఏర్పాటు చేశారు. శివలింగం చుట్టూ దీపాలను ఏర్పాటు చేయగా, ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులు జ్యోతులను వెలిగించారు.

పూజా కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు వెన్నం రజనీకుమార్, స్థానికులు శివయ్య, ట్రాక్టర్ రాము, ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

కొత్త అమ్మవారి సన్నిధిలో శివ కల్యాణోత్సవం

చిట్టినగర్ శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శివ కల్యాణోత్సవం జరిగింది. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



మధురానగర్(విజయవాడసెంట్రల్): గులాబీతోటలో అనారోగ్యంతో మృతి చెందిన వెంట్రప్రగడ చంద్రబాలు కుటుంబానికి 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి వైఎస్సార్ బీమా నగదు రూ.10 వేలను మట్టిఖర్చుల నిమిత్తం మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వైఎస్సార్ బీమా పథకం నిరుపేదలకు అండగా నిలుస్తుందన్నారు. వైఎస్సార్ బీమా మిగిలిన నగదును త్వరలో అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సచివాలయం అడ్మిన్ సునీల్, వెల్ఫేర్ కార్యదర్శి కాశింబీ, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి కృషి చేయాలి



ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న యేసుదానం

బస్టాండ్(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ప్రజారవాణా సంస్థ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి కృషి చేయాలని జిల్లా ప్రజా రవాణా సంస్థ అధికారి ఎం.యేసుదానం తెలిపారు. గవర్నర్‌పేట –1, 2 డిపోల ఆధ్వర్యంలో మంగళవారం ఆయా డిపోల వద్ద గేట్ మీటింగ్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న యేసుదానం మాట్లాడుతూ.. బస్సు కండిషన్‌లను సిబ్బంది గమనిస్తూ ఉండాలన్నారు. అదేవిధంగా బస్సుల్లో శుభ్రత పాటించటంతో పాటు ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని ఉద్యోగులకు సూచించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులకు బస్సుల్లో ప్రయాణించేటప్పుడు సహాయ సహకారాలు అందించాలని అప్పుడే ప్రయాణికులకు సంస్థ పట్ల గౌరవం పెరుగుతుందన్నారు. ఉద్యోగుల ప్రవర్తనతో ప్రయాణికుల మన్ననలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో గవర్నర్‌పేట–1, 2 డిపోల మేనేజర్లు కె.బసవయ్య, ఏవీ.రావులు రెండు డిపోల సూపర్‌వైజర్లు, సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

27న వైద్యశిబిరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు గోకరాజు రంగరాజు కల్యాణ మండపంలో ఈనెల 27వ తేదీ ఆదివారం శ్రీఅల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సామంతపూడి వెంకటేశ్వరరాజు, దాట్ల భాస్కరరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు. పిల్లల వైద్య నిపుణుడు కె.అనిరుద్, గైనకాలజిస్ట్ కె.రత్నశ్రీ, న్యూరో వైద్య నిపుణుడు వి.కృష్ణవేణి పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తామని చెప్పారు. ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

● టార్గెట్ క్లీన్ సిటీ !





నగర పరిశుభ్రతకు నగరపాలకసంస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగా నగరంలోని ప్రధాన రహదారుల్లో పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేసిన అనంతరం దుమ్ము లేవకుండా నగరపాలకసంస్థ వాటర్ ట్యాంకుల ద్వారా నీటితో తడుపుతున్నారు. బందరురోడ్డు పాతబస్టాండ్ సెంటర్‌లో కనిపించిన దృశ్యం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో విద్యార్థుల ప్రతిభ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నగరంలో ఇటీవల జరిగిన సాంబమూర్తి మెమోరియల్ రాష్ట్రస్థాయి ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో సింగ్‌నగర్ రామకృష్ణ చెస్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అండర్–14 విభాగంలో జరిగిన పోటీల్లో చిట్టినగర్ గౌతమ్‌పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థి పిళ్లా దుర్గాప్రసాద్ మొదటి స్థానం సాధించగా, సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి బత్తుల భానుప్రకాష్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. విజేతలను చెస్ కోచ్ అవ్వారు రామకృష్ణ మంగళవారం తన అకాడమీలో అభినందించారు.

గురుకులాల అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

గిరిజన గురుకుల విద్యాలయాల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయ సంఘం వినతి

సాక్షి, అమరావతి: గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గిరిజన గురుకుల విద్యాలయాల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయ సంఘం నేతలు కోరారు. తాడేపల్లిలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబులను కలిసి వినతి పత్రం అందజేశారు. గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ టీచర్స్, లెక్చరర్స్‌ని కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్‌గా మార్చాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత వేతనం రూ.14,800లను 2022 పీఆర్‌సీ ప్రకారం పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, గిరిజన గురుకుల విద్యాలయాల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎస్.శేఖర్, జె.రామకృష్ణ, ఎస్.వెంకటేశ్వర్లు, ఎ.ఎల్.గుర్రప్ప, చంద్రుపడాల్, బాలన్న, శోభన్, జి.రాజు తదితరులు పాల్గొన్నారు.

విశ్వగురు అవార్డులకు శ్రీచైతన్య విద్యార్థుల ఎంపిక


మాల్యనాథ్


గీతిక

అమరావతి: విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ అవార్డులకు శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపిక య్యారు. ఈ నెల 20న హైదరాబాద్‌లో భారత వికాస పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో వీరికి విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ అవార్డులను ప్రకటించింది. సూళ్లూరుపేటకు చెందిన 8వ తరగతి విద్యార్థిని గీతికా వెంకటేశన్ జాతీయ స్థాయిలో పర్యావరణ పరిరక్షణ విభాగంలో ప్రథమ బహుమతి పొందింది. ఈమె యదుమది అనే ఎన్‌జీవో ను స్థాపించి విద్యాసంస్థలు, గ్రామీణ ప్రాంతాల్లో పర్యావరణంపై అవగాహన కల్పిస్తోంది. ఇందుకుగాను గీతికకు అవార్డు వరించింది. అలాగే, శ్రీచైతన్య నెల్లూరు రెసిడెన్షియల్ బ్రాంచికి చెందిన 5వ తరగతి విద్యార్థి కె.మాల్యనాథ్ రాష్ట్రస్థాయి కరాటే విభాగంలో ప్రథమ బహుమతి పొందాడు. కరాటేలో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కూడా పేరు సాధించిన మాల్యనాథ్‌ను విశ్వగురు అవార్డుకు ఎంపిక చేశారు. ఇద్దరు విద్యార్థులను శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ అభినందించారు.

'ఇప్పటం' పిటిషనర్లపై హైకోర్టు ఆగ్రహం

ఇళ్ల కూల్చివేతకు ముందు షోకాజ్ నోటీసులు ఇవ్వలేదన్న పిటిషనర్లు

- తొందరపాటు చర్యలొద్దని అధికారులకు హైకోర్టు ఉత్తర్వులు
- నోటీసులు ఇచ్చినట్లు ఆధారాలు చూపిన మున్సిపల్ అధికారులు
- దీంతో దిగివచ్చిన ఇళ్ల యజమానులు.. నోటీసులు ఇచ్చినట్లు అంగీకారం
- షోకాజ్ నోటీసులు ఇచ్చినా.. ఇవ్వలేదంటారా అంటూ హైకోర్టు మండిపాటు
- క్రిమినల్ ధిక్కార చర్యలు ఎందుకు తీసుకోరాదో చెప్పాలని ఆదేశం
- పిటిషనర్లు కోర్టు ముందు హాజరు కావాలని ఆదేశం



సాక్షి, అమరావతి : గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఇప్పటం గ్రామంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత వ్యవహారం కీలక మలుపు తిరిగింది. షోకాజ్ నోటీసులు ఇవ్వకుండానే ఇళ్లు కూల్చేస్తున్నారంటూ హైకోర్టును ఆశ్రయించిన యజమానులు చివరకు వాస్తవాన్ని హైకోర్టుకు నివేదించారు. అధికారులు షోకాజ్ నోటీసులు ఇచ్చారని ఇళ్ల యజమానుల తరఫు న్యాయవాది హైకోర్టు ముందు అంగీకరించారు. దీంతో వారిపై హైకోర్టు మండిపడింది. షోకాజ్ నోటీసులు ఇచ్చినప్పటికీ, ఇవ్వలేదంటూ కోర్టుకొచ్చి, కూల్చివేతలపై స్టే పొందడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది కోర్టు ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని అసహనం వ్యక్తం చేసింది. క్రిమినల్ కోర్టు ధిక్కరణ కింద చర్యలు ఎందుకు తీసుకోరాదో వివరించాలని పిటిషనర్లను ఆదేశించింది. పిటిషనర్లు స్వయంగా తమ ముందు హాజరు కావాలని ఆదేశించింది. అంతేకాక కూల్చివేతల విషయంలో ఎలాంటి తొందరపాటు చర్యలొద్దంటూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేసింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాడేపల్లి మునిసిపల్ అధికారులు రోడ్డు విస్తరణ చేపట్టేందుకు రోడ్డును ఆక్రమించుకున్న ఇప్పటంలోని ఇళ్ల యజమానులకు మే 21న నోటీసులు జారీ చేశారు. వీటిని సవాలు చేస్తూ బెల్లంకొండ వెంకట నారాయణ, మరో 13 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. షోకాజ్ నోటీసులు ఇవ్వకుండా నేరుగా కూల్చివేత నోటీసులు ఇచ్చారని వివరించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ తిల్హారీ కూల్చివేత నోటీసుల ఆధారంగా పిటిషనర్ల ఇళ్ల విషయంలో ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని అధికారులను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా ఈ వ్యాజ్యం మంగళవారం మరోసారి విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా మునిసిపల్ కార్పొరేషన్ తరఫు న్యాయవాదులు మలసాని మనోహర్‌రెడ్డి, జి.నరేష్ కుమార్‌లు వాదనలు వినిపించారు. పిటిషనర్లకు కొందరికి పోస్టు ద్వారా, మరికొందరికి వ్యక్తిగతంగా గతంలోనే నోటీసులు అందజేశామని చెప్పారు. ఇందుకు సంబంధించిన ఆధారాలన్నింటినీ అఫిడవిట్ రూపంలో కోర్టు ముందుంచారు. దీనిపై ఏమంటారని పిటిషనర్ల తరఫు న్యాయవాదిని న్యాయమూర్తి ప్రశ్నించారు. దీంతో పిటిషనర్లు వాస్తవాన్ని అంగీకరించక తప్పలేదు. అధికారులు షోకాజ్ నోటీసులు ఇచ్చారంటూ పిటిషనర్ల న్యాయవాది టి.సాయిసూర్య అంగీకరించారు. ఆ విషయాన్ని పిటిషన్‌లో ఎందుకు ప్రస్తావించలేదని న్యాయమూర్తి నిలదీశారు. ఉదయం కూల్చివేతలు మొదలుపెట్టడం, దానిపై హడావుడిగా లంచ్‌మోషన్ పిటిషన్ వేయడం, పిటిషనర్లు నిరక్షరాస్యులు కావడం తదితర కారణాలతో షోకాజ్ నోటీసుల విషయాన్ని పిటిషన్‌లో ప్రస్తావించలేదని సాయిసూర్య చెప్పారు. ఈ వివరణతో న్యాయమూర్తి సంతృప్తి చెందలేదు. పిటిషనర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. షోకాజ్ నోటీసులు ఇవ్వకుండా ఏకపక్షంగా కూల్చివేతలు చేపట్టారని చెప్పడంవల్లే మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశామని గుర్తు చేశారు. కోర్టు ముందు వాస్తవాలను తొక్కిపెట్టినందుకు క్రిమినల్ కోర్టు ధిక్కారం కింద ఎందుకు చర్యలు తీసుకోరాదో వివరించాలని పిటిషనర్లను ఆదేశించారు. పిటిషనర్లు కోర్టు ముందు హాజరయ్యేలా చూడాలని వారి తరఫు న్యాయవాదికి స్పష్టం చేశారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సు

సాక్షి, అమరావతి: ఫుడ్ ప్రాసెసింగ్‌లో పది రోజుల పాటు ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌ఏపీసీసీఐ) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. డిసెంబర్ 1వ తేదీ నుంచి 12 వరకు మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు కోర్సు నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, విద్యా వేత్తలు, విద్యార్థులు పాల్గొనవచ్చునని తెలిపింది. పాల్గొనే వారికి ఎఫ్‌ఏపీసీసీఐ సర్టిఫికెట్లు అందించనున్నట్లు పేర్కొంది. మరిన్ని వివరాలు కోసం సెల్ నంబర్ : 93914 22821 / ఇ-మెయిల్: fapccivizag@gmail.com సంప్రదించాల్సిందిగా సూచించింది.

నగదు రహిత లావాదేవీలకు ప్రోత్సాహం

- దక్షిణ మధ్య రైల్వే సీసీఎం కె.సాంబశివరావు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సాంబశివరావు,రాంబాబు

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే డివిజన్‌లో టికెట్ విక్రయాల్లో యూటీఎస్ యాప్, డిజిటల్ లావాదేవీల వాటాను ప్రోత్సహించేలా కృషి చేయాలని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ కమర్షియల్ మేనేజర్ (సీసీఎం) కె.సాంబశివరావు సూచించారు. విజయవాడ డివిజన్ కమర్షియల్ విభాగం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో యూటీఎస్ మొబైల్ యాప్, డిజిటల్ టికెటింగ్‌పై సెమినార్ నిర్వహించారు. ఇందులో సాంబశివరావు పాల్గొని యూటీఎస్ యాప్‌తో ప్రయాణికులకు కలిగే ప్రయోజనాలు, ప్రధాన స్టేషన్‌ల్లో అందుబాటులో ఉన్న ఏటీవీఎమ్ (ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మిషన్) వినియోగంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఉద్యోగులకు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు, డీసీఎం పి.రవికుమార్, ఏసీఎం వి.రవివర్మ, కమర్షియల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి డీజీపీ అభినందన

సాక్షి, అమరావతి: అఖిల భారత పోలీస్ క్రీడల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించిన వారిని డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి మంగళవారం అభినందించారు. ఢిల్లీలో నిర్వహించిన లాన్ టెన్నిస్ పోటీల్లో డీఎస్పీ ఎన్.టి.వి.రామ్ కుమార్ సింగిల్స్ విభాగంలో బంగారు పతకం, అదనపు ఎస్పీలు సత్యనారాయణ, కోటేశ్వరరావు డబుల్స్ విభాగంలో రజత పతకాలు గెలుచుకున్నారు. పుణెలో నిర్వహించిన కుస్తీ పోటీల్లో కానిస్టేబుల్ నూకరాజు కాంస్య పతకం సాధించారు. వీరందరూ మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిని డీజీపీ ప్రత్యేకంగా అభినందించారు.

8.22లక్షల మందికి సున్నా వడ్డీ రాయితీ

- సామాజిక తనిఖీకి నేటి నుంచి ఆర్బీకేల్లో జాబితాలు
- 28న రూ.160.55 కోట్లు జమ చేయనున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి : వైఎస్సార్ సున్నా వడ్డీ పథకానికి సంబంధించి 2021 ఖరీఫ్ సీజన్‌లోని అర్హుల జాబితా లెక్కతేలింది. ఈ సీజన్‌కు సంబంధించి 10.76 లక్షల మంది రూ.లక్ష లోపు రుణాలు పొందినట్లు గుర్తించగా, వారిలో నిర్ణీత గడువులోగా చెల్లించడం, ఈ-క్రాప్ ప్రామాణికంగా పంటలు సాగుచేసిన 5.68 లక్షల మందిని అర్హులుగా తేల్చారు. వీరికి రూ.115.33 కోట్లు జమచేయనున్నారు. అలాగే, రబీ 2020-21 సీజన్‌లో 2.54 లక్షల మందిని అర్హులుగా గుర్తించారు. వీరికి సున్నా వడ్డీ రాయితీ కింద రూ.45.22 కోట్లు జమచేయనున్నారు. ఈ జాబితాలను జిల్లాల వారీగా ఆర్బీకేల్లో ఈ నెల 19-22 వరకు ప్రదర్శిస్తుండగా ఎలాంటి అభ్యంతరాలు రాలేదు. అలాగే, అర్హుల జాబితాలను సామాజిక తనిఖీలో భాగంగా బుధవారం నుంచి 25వరకు ప్రదర్శిస్తారు. అంతేకాదు.. ఎస్వీపీఆర్ పోర్టల్ https://karshak.ap.gov.in/ysrsvpr/ హోంపేజీలో "know your status"అనే విండోలో తమ ఆధార్ నంబరుతో చెక్ చేసుకోవచ్చు. రైతులు తమ వివరాలు సరిచూసుకుని వారి పేర్లు, బ్యాంకు ఖాతా నంబర్లలో తప్పులుంటే తగిన వివరాలు సంబంధిత ఆర్బీకే సిబ్బందికి అందించి సరిచేసుకోవాలి. అర్హత కలిగి తమ పేరులేని రైతులు బ్యాంకు అధికారి సంతకంతో ధృవీకరించి ఆర్బీకేల్లో దరఖాస్తు సమర్పిస్తే పునఃపరిశీలన చేసి అర్హత ఉంటే జాబితాల్లో చేరుస్తారు. ఈ రెండు సీజన్లకు సంబంధించి 8.22లక్షల మంది ఖాతాలకు రూ.160.55 కోట్ల వడ్డీ రాయితీ సొమ్మును ఈ నెల 28న సీఎం జగన్ జమ చేస్తారు.

● తెలంగాణ

టార్గెట్ మల్లారెడ్డి

- మంత్రి ఆస్తులే లక్ష్యంగా ఐటీ దాడులు
- 50 బృందాలు.. కేంద్ర బలగాల పహారాలో ఏకకాలంలో సోదాలు

సాక్షి,హైదరాబాద్/మేడ్చల్/కుత్బుల్లాపూర్:రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి లక్ష్యంగా ఐటీ శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున ఐదు గంటల నుంచే, మంత్రి ఇంట్లో ఉండగానే.. కేంద్ర పోలీసు బలగాల పహారాలో ఆయన నివాసంతో పాటు వివిధ ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు ప్రారంభమయ్యాయి. మొత్తం 50 బృందాలు దాడుల్లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సోదాల్లో పెద్ద ఎత్తున ఆదాయానికి మించిన ఆస్తులను గుర్తించిన అధికారులు, రూ.8.8 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. మెడికల్ సీట్ల కేటాయింపులో అవకతవకలు, రియల్ ఎస్టేట్‌లో పెద్ద మొత్తంలో పెట్టుబడులు గుర్తించినట్లు సమాచారం. దాడులు రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగుతూనే ఉన్నాయి. బుధవారం కూడా సోదాలు కొనసాగవచ్చని తెలుస్తోంది.

పక్కా సమాచారంతోనే..

బోయిన్‌పల్లిలో నివాసం ఉంటున్న మల్లారెడ్డి ఇంటి నుంచే దాడులు మొదలయ్యాయి. మంత్రి, ఆయన బంధువులు నిర్వహిస్తున్న పలు విద్యా సంస్థలకు..ముఖ్యంగా మెడికల్ కళాశాలలకు సంబంధించిన ఆదాయం, వాటిపై చెల్లిస్తున్న పన్ను, ఎగవేతకు సంబంధించి అందిన పక్కా సమాచారం మేరకు ఐటీ అధికారులు దాడులకు దిగినట్లు తెలుస్తోంది. సోదాల సమయంలో మంత్రి తన మొబైల్ ఫోన్‌ను తన నివాసం పక్కనే ఉన్న క్వార్టర్స్‌లో జూట్ బ్యాగ్‌లో దాచి పెట్టారు. ఈ విషయాన్ని పసిగట్టిన ఐటీ అధికారులు ఆ మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. మిగతా ప్రాంతాల్లో కూడా అందరి మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మల్లారెడ్డి విద్యా సంస్థల్లో డైరెక్టర్లుగా ఉన్న కుమారులు మహేందర్‌రెడ్డి, భద్రారెడ్డి, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, ఇళ్లతో పాటు వియ్యంకుడు లక్ష్మారెడ్డి, బంధువు త్రిశూల్‌రెడ్డి, బాలానగర్‌లోని క్రాంతి కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ రాజేశ్వరరావు ఇళ్లల్లోనూ, ప్రధాన విద్యా సంస్థల్లోనూ దాడులు నిర్వహించారు.

అల్లుని ఇంట్లో రెండు ఎలక్ట్రానిక్ లాకర్లు

మంత్రి ఇంటికి సమీపంలోనే నివాసం ఉండే అల్లుడు రాజశేఖర్‌రెడ్డి ఇంట్లోనూ సోదాలు నిర్వహించారు. ఆయన ఇంట్లో రెండు ఎలక్ట్రానిక్ లాకర్లను అధికారులు గుర్తించారు. వాటిని తెరవడానికి ప్రయత్నిస్తున్నారు. సోదాల్లో కీలక డాక్యుమెంట్లు, బ్యాంకు లావాదేవీల పత్రాలు, కొన్ని హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

కాంగ్రెస్‌కు మర్రి శశిధర్‌రెడ్డి గుడ్‌బై

- ఖర్గేకు రాజీనామా పత్రం.. సోనియాకు 8 పేజీల లేఖ
- రేవంత్ టార్గెట్‌గా వ్యాఖ్యలు

సాక్షి, హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీకి మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి గుడ్‌బై చెప్పారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఆయన లేఖ రాశారు. తాను పార్టీని ఎందుకు వీడాల్సి వచ్చిందో వివరిస్తూ 8 పేజీల సుదీర్ఘ లేఖను అధినేత్రి సోనియాగాంధీకి కూడా పంపారు. ఈ విషయం వెల్లడిస్తూ మంగళవారం ఆయన తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బ్లాక్ మెయిలర్‌గా వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు ఉండటంతోపాటు ప్రభుత్వ లోటుపాట్లను నిలదీయాల్సిన సీఎల్పీ.. అధికార టీఆర్ఎస్ పార్టీతో మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకుందన్నారు.

ప్రజ్వరిల్లిన అఖండ కర్పూర జ్యోతి

- 18 కిలోల కర్పూరంతో స్వామికి దీప నీరాజనం
- కృష్ణాతీరంలోని రామలింగేశ్వరుని సన్నిధిలో నిర్వహణ


శివనామస్మరణతో లక్ష వత్తుల దీపజ్యోతి వెలిగించిన మహిళలు


కర్పూర జ్యోతులు చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు


కృష్ణాతీరానికి తరలివచ్చిన జనసందోహం

నాగాయలంక: కృష్ణాతీరంలో అఖండ కర్పూర జ్యోతి ప్రజ్వరిల్లింది. రామలింగేశ్వరుని సన్నిధి మంగళవారం రాత్రి దీప కాంతులతో శోభిల్లింది. కార్తీక మాసోత్సవాల చివరి రోజులను పురస్కరించుకొని కృష్ణాజిల్లా నాగాయలంకలోని శ్రీరామ పాదక్షేత్రం వద్ద కృష్ణానది తీరంలోని మండపంలో శ్రీగంగ పార్వతీ సమేత రామలింగేశ్వరునికి భక్తులు అఖండ కర్పూర జ్యోతితో దీప నీరాజనం అర్పించారు. అనంతరం యథాప్రకారం నిత్య నవ హారతులు భక్తిశ్రద్ధలతో సమర్పించారు. కృష్ణాతీరంలో తొలిసారిగా ఇలాంటి అఖండ కర్పూరజ్యోతి కార్యక్రమం జరిగింది. మండపం ప్రాంగణంలో ప్రత్యేకంగా నిర్మించిన మూడు కుండములలో 18 కిలోల ముద్ద కర్పూరాన్ని ఉంచి అర్చకుల నేతృత్వంలో అయ్యప్ప భక్తులతో ప్రజ్వలన గావించారు. ఉవ్వెత్తున లేచిన కర్పూర జ్వాలలతో స్వామికి అద్భుతంగా దీపనీరాజనం పలికారు. భక్తులు ప్రదక్షిణలు చేశారు. వందలాది మంది మహిళలు, భక్తులు కర్పూర జ్యోతి వేడుకను తిలకించేందుకు తరలివచ్చారు. ఆ జ్వాలల్లో మహిళలు కర్పూరం సమర్పించి ఆధ్యాత్మిక అనుభూతి పొందారు. కృష్ణానది తీరం భక్తుల శివనామస్మరణతో మార్మోగింది. ఈసందర్భంగా అయ్యప్ప భక్తులు భజన నిర్వహించారు. వారికి భిక్ష, భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు. శ్రీరామపాదక్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు ప్రముఖులు పాల్గొన్నారు. కాగా మండలంలోని టి.కొత్తపాలెంలో కొలువైన భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి కీర్తిక దీపాలంకరణ మహోత్సవం కనుల పండువగా జరిగింది.

దీర్ఘకాలిక రోగులపై ప్రత్యేక దృష్టి పెట్టండి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని


ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలపై సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌ఓ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో గ్రామాలకు వెళ్లే వైద్యులు దీర్ఘకాలిక రోగులపై దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఆమె మంగళవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్‌లో నిర్వహిస్తున్న ఓపీ సేవలు, అనంతరం మంచాన ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గొల్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పల్లగిరి వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను సందర్శించారు. అక్కడ బీపీ, మధుమేహం రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్న రోగులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

హైపర్ టెన్షన్ నియంత్రణపై పునశ్చరణ..

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యులకు మంగళవారం హైపర్ టెన్షన్ నియంత్రణకు తీసుకునే చర్యలపై పునశ్చరణ కార్యక్రమం నిర్వహించారు. విజయవాడలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐసీఎంఆర్ రాష్ట్ర ప్రతినిధులు డాక్టర్ శైలజ, డాక్టర్ రాఘవేంద్రలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులకు వారు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.సుహాసిని, డీఐఓ డాక్టర్ అమృత, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారిణి డాక్టర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను అధిగమించి ఉన్నత శిఖరాలకు..

- సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చలమేశ్వర్
- దళిత ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు ఆత్మకథ పుస్తకావిష్కరణ సభ



పుస్తకావిష్కరణ చేస్తున్న బెజవాడ విల్సన్, జస్టిస్ చలమేశ్వర్ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఫ్యూడల్ సమాజంలో అనేక సమస్యలున్నాయని, వాటిని అధిగమించి కాకి మాధవరావు ఉన్నత శిఖరాలకు ఎదిగారని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్ అన్నారు. ఉమ్మడి రాష్ట్రానికి ప్రధాన కార్యదర్శిగా చేసిన దళిత ఐఏఎస్ అధికారి కాకి మాధవరావు ఆత్మకథ పుస్తకావిష్కరణ కార్యక్రమం మంగళవారం రాత్రి ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో జరిగింది. ఎమెస్కో పబ్లిషర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ది రామన్ మెగాసెస్సే అవార్డు గ్రహీత బెజవాడ విల్సన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ చలమేశ్వర్ మాట్లాడుతూ కాకి మాధవరావు ఈ పుస్తకం రాయడం అభినందనీయమన్నారు. ఈ పుస్తకం చదివిన వారిలో ఐదుగురు మారినా దేశానికి మంచి జరుగుతుందని, పుస్తకానికి సార్థకత లభిస్తుందన్నారు. సర్కారు ఉద్యోగంలో అనేక ఇబ్బందులు ఉంటాయని, మంత్రుల చెప్పినవి చేయకపోతే బదిలీలు తప్పవన్నారు. ఆ ఒరవడి ఇప్పుడు జ్యూడిషియల్ వ్యవస్థకు సోకిందన్నారు. పుస్తకావిష్కరణ కర్త బెజవాడ విల్సన్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా సమాజంలో ఇంకా అసమానతలు తొలగిపోలేదన్నారు. ఇంకా వివక్ష కొనసాగుతుందని, ఆడపిల్లలపై అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. సర్కాలు అధికారులు వ్యవస్థలో మార్పుకోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీనియర్ జర్నలిస్టు కె రామచంద్రమూర్తి మాట్లాడుతూ 1978 నుంచి 88 వరకూ నలుగురు ముఖ్యమంత్రులు మారారని, ఎన్టీఆర్ ఎన్నో అసాధారణ నిర్ణయాలు తీసుకున్నారన్నారు. నాటి చరిత్రను నేటి తరానికి తెలియచేసేందుకు ఈ పుస్తకం దోహదపడుతుందన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మా అందరికీ స్ఫూర్తిగా నిలిచిన కాకి మాధవరావు, ఈ పుస్తకం ద్వారా సమాజానికి స్ఫూర్తిగా నిలవనున్నారని పేర్కొన్నారు. అనంతరం కాకి మాధవరావు మాట్లాడుతూ తన సర్వీసులో ఎదురైన అనుభవాలు, కుటుంబ విశేషాలతో ఆత్మకథ పుస్తకాన్ని రాసినట్లు తెలిపారు. 14 ఛాప్టర్‌లలో అనేక అంశాలను తెలియచేశానన్నారు. ఎమెస్కో విజయ్ కుమార్ సభకు అధ్యక్షత వహించగా సీపీఐ జాతీయ నాయకులు కె.నారాయణ, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్‌సవాంగ్, పలువురు ఐఏఎస్ అధికారులు, కాకి మాధవరావు సన్నిహితులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత ప్రకారమే పదవులు

- ఒక్క కులానికే ఇస్తే ప్రజాస్వామ్యం అనిపించుకోదు
- గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



గుడివాడ టౌన్: ఏ సామాజిక వర్గానికైనా ప్రాధాన్యతను బట్టి పదవులు ఉంటాయని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. ఏ ఒక్క కులానికో ప్రాధాన్యత ఇస్తే అది ప్రజాస్వామ్యం కాదన్నారు. మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అనంతరం ఆయన ఎన్టీఆర్ జిల్లా గుడివాడ పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. వసంత నాగేశ్వరరావు సీనియర్ రాజకీయ నాయకులు, పెద్దలు అనేక పదవులు చేశారు. కమ్మ వన సమారాధనకు వెళ్ళిన ఆయన అక్కడ చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమన్నారు. రాష్ట్రంలో 105 కులాలు ఉన్నాయి. గతంలో అనేక మంది సీఎంలుగా చేసినా కేవలం పది, 15 కులాల వారికి మాత్రమే మంత్రి పదవులు వస్తున్నాయి, మిగిలిన 90 కులాల పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండగా ముస్లిం మైనార్టీ, ఎస్టీకు ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వలేదు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వారిని ముందుకు తీసుకువచ్చి వారిని ప్రధాన స్థానంలో కూర్చోబెట్టి ప్రాధాన్యత ఇవ్వాలని రచించారు. కమ్మ సామాజిక వర్గం ఆర్థికంగా గాని, రాజకీయంగాను వెనుకబడి లేదు. అన్ని రంగాలలోనూ ముందంజలోనే ఉంది. ప్రస్తుత ప్రభుత్వం కేబినెట్‌లో రెండున్నర సంవత్సరాలు కమ్మ సామాజిక వర్గానికి ఇచ్చి మరో రెండున్నర ఏళ్లు ఇతర సామాజిక వర్గాలకు ఇస్తే తప్పేంటి అన్నారు. ఎన్టీ రామారావు పార్టీ పెట్టింది కేవలం కమ్మ సామాజికవర్గం కోసమా? కమ్మ సామాజిక వర్గానికే పదవులు ఇచ్చారా ఇతరులను పట్టించుకోలేదా.. అని ప్రశ్నించారు. ఆయన కూడా బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన నాయకుడే. రామారావును ఒక కులానికి ఆపాదించి ఆయనకు ఉన్న పరువు తీసేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో కులాలకు, మతాలకు సంబంధం లేకుండా పాలన సాగిస్తుందని దానికి మేమంతా కట్టుబడి ఉన్నామని మంత్రి పదవి ఇవ్వనంత మాత్రాన ఆ సామాజిక వర్గానికి అన్యాయం చేసినట్లు కాదన్నారు.

అమరేశ్వరునికి లక్ష బిల్వార్చన

అమరావతి: పంచారామ క్షేత్రాలలో ప్రథమారామక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో మంగళవారం లోక కల్యాణార్థం దాతల సహకారంతో అమరేశ్వరునికి లక్షబిల్వార్చన జరిపించారు. తొలుత మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించి సహస్ర లింగార్చన చేశారు. ఆలయ వేదపండితులు గణపతి హోమం, సూర్య నమస్కారాలు నిర్వహించి స్వామివారికి విశేష అలంకరణ చేసి సహస్ర నామాలతో రుత్విక్కులు అమరేశ్వరునికి లక్ష బిల్వదళార్చన నిర్వహించారు. బాలచాముండేశ్వరిదేవి అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలను నిర్వహించారు. కార్తిక మాసంలో శివుని ఆరాధించి లక్షబిల్వార్చన, బాలాచాముండేశ్వరి దేవికి కుంకుమార్చన చేస్తే శుభాలు కలుగుతాయని ఆలయస్థానాచార్యుడు చంద్రశేఖరశర్మ చెప్పారు.

మహిళల రక్షణకు చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

- అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలి
- అధికారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆదేశం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లైంగిక దాడులు, వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకు ఇంటర్నల్ కంప్లెయింట్ కమిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీ రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం విజయవాడలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో లైంగిక వేధింపుల నివారణ చట్టం 2013లో భాగంగా జిల్లా స్థాయి కోర్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. స్త్రీ శిశు సంక్షేమం, పోలీస్, స్వచ్ఛంద సంస్థలు, సైకాలజిస్టులు, న్యాయవాదులతో జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ చట్ట ప్రకారం అంతర్గత, స్థానిక ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేసి మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాల నుంచి రక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వం గుర్తించిన, గుర్తించని సంస్థలలో అంతర్గత, స్థానిక ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేయాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కమిటీ నిరంతరం కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని కళాశాలలు, పాఠశాలల్లో అంబాసిడర్లను నియమించి, సమస్యలు ఎదురైతే తక్షణమే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే విధంగా నెల రోజుల్లోగా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ప్రైవేట్ కళాశాలల్లో సైకాలజిస్ట్‌లను, కౌన్సిలర్లుగా నియమించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్, డీసీపీ వెంకట రత్నం, దిశ ఏసీపీ వి.వి.నాయుడు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, మార్పు ట్రస్ట్ చైర్మన్ ఆర్.సూయజ్, హైకోర్టు అడ్వకేట్ డి.అనుపమ, కేబీఎన్ కాలేజీ సైకాలజిస్ట్, కళ్యాణి రెడ్డి, సైకాలజిస్ట్ టి.కృష్ణ కుమారి, దిశ ఇన్‌స్పెక్టర్ కె.వాసవి, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి 3వ జాతీయ ఆయిల్ పామ్ సదస్సు

హాజరు కానున్న 350 మంది నిపుణులు, శాస్త్రవేత్తలు

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ స్థాయిలో ఆయిల్ పామ్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, పరిష్కారాలు, నూతన సాంకేతికత ప్రధాన అజెండాగా బుధవారం నుంచి మూడు రోజుల పాటు పోరంకిలోని శ్రీలక్ష్మీనరసింహ గార్డెన్స్‌లో మూడవ జాతీయ ఆయిల్ పామ్ సదస్సు జరుగనుంది. ఆయిల్ పామ్ పరిశోధన, అభివృద్ధి ప్రోత్సాహక సంఘం (ఎస్‌ఓపీఓపీఆర్‌ఏడీ) ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ జాతీయ సదస్సులో మలేషియా ఆయిల్ పామ్ బోర్డు డైరెక్టర్ జనరల్ అహ్మద్ పర్వేజ్ ఖాదర్ ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నారు. దేశ విదేశాలకు చెందిన 350 మంది నిపుణులు, శాస్త్రవేత్తలు, ఆయిల్ పామ్ రైతులు పాల్గొననున్న ఈ సదస్సులో ఆయిల్ రంగం పురోగతి, సాంకేతికత, వినూత్న పోకడలపై సావనీర్‌తో పాటు వివిధ అంశాలపై రూపొందించిన పబ్లికేషన్స్‌ను ఆవిష్కరిస్తారు. దేశంలో ఆయిల్ రంగ అభ్యున్నతి కోసం పాటుపడిన పలువురిని సత్కరించనున్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) డైరెక్టర్ డాక్టర్ ఆర్‌కే మాథూర్ స్వాగతోపన్యాసం చేయనున్న కార్యక్రమంలో పలువురు నిపుణులు, శాస్త్రవేత్తలు పాల్గొననున్నారు. ఆయిల్ పామ్ రంగంలో ఏపీ సాధిస్తున్న పురోగతిపై ఏపీ వ్యవసాయశాఖ కమిషనర్ డాక్టర్ ఎస్ఎస్ శ్రీధర్‌తో పాటు పలువురు ఆయిల్ పామ్ రైతులు ప్రసంగించనున్నారు.

27న ఇప్పటంలో పవన్‌కళ్యాణ్ పర్యటన

తాడేపల్లిరూరల్: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఈ నెల 27న గుంటూరు జిల్లా ఇప్పటంలో పర్యటించనున్నారని ఆ పార్టీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మంగళగిరి ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

శాస్త్ర,సాంకేతిక రంగాల్లో భారత్ అమోఘ ప్రగతి

సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ సోమనాథ్



సాక్షి, పుట్టపర్తి/పుట్టపర్తి అర్బన్: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ అమోఘ ప్రగతి సాధిస్తోందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్ డాక్టర్ సోమనాథ్ అన్నారు. మంగళవారం పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో జరిగిన సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 41వ స్నాతకోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. గతంలో రాకెట్ ప్రయోగాలు, డిజైన్, తయారీ, పరికరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడేవాళ్లమని, ప్రస్తుతం సొంతగా రాకెట్ ప్రయోగాలు చేస్తూ ప్రపంచానికి సవాల్ విసురుతున్నామని చెప్పారు. భారతదేశం త్వరలోనే అతిపెద్ద ఐటీ, మెడిసిన్ ఎగుమతిదారుగా మారనుందన్నారు. అనంతరం 22 మంది విద్యార్థులకు డాక్టరేట్లు, 17 మందికి బంగారు పతకాలు అందజేశారు.

సత్యసాయి శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి: కిషన్ రెడ్డి

సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, అందుకు ఇప్పటి నుంచే సన్నాహాలు ప్రారంభించాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తరఫున తాము కూడా భాగస్వామ్యం అవుతామని తెలిపారు. సత్యసాయిబాబా 97వ జయంత్యుత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో ఏర్పాటు చేసిన సౌండ్ అండ్ లైట్, మల్టీమీడియా షోను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. సత్యసాయి బాబా జీవిత విశేషాలతో ఏర్పాటు చేసిన ఈ షో ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది.

సర్పంచ్‌ల సంఘంతో మాజీ ఎమ్మెల్సీకి సంబంధమేంటి?

వైఎస్సార్ జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): రాష్ట్ర సర్పంచ్‌ల సంఘానికి, మాజీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్‌కు సంబంధం ఏమిటని వైఎస్సార్ జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి నిలదీశారు. మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సర్పంచ్‌ల సంఘం సమావేశం జరిగింది. చంద్రారెడ్డి మాట్లాడుతూ.. కొద్దిమంది సర్పంచ్‌లు సమావేశమై రాష్ట్ర కమిటీని ఎలా ఎన్నుకుంటారని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ సమస్యలపై చర్చిద్దాం రండని కొందరు సర్పంచ్‌లను పిలిచి రాష్ట్ర కమిటీని ఎన్నుకోవడం సరికాదన్నారు. డిసెంబర్ రెండో వారంలో రాష్ట్రంలోని సర్పంచ్‌లతో భారీ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆ సభలో అందరి ఆమోదంతో పార్టీలకు అతీతంగా సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కమిటీని ఎన్నుకుంటామన్నారు. సర్పంచ్‌ల సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. సమావేశంలో ఉమ్మడి గుంటూరు జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ కార్యదర్శి జాస్తి వీరాంజనేయులు, సర్పంచ్‌లు టి.కృష్ణమోహన్, శ్రీదేవి, సునీత, వి.అప్పిరెడ్డి, షేక్ అల్లాభక్షు, తోకల సరోజిని, ముప్పాళ్ల మనోహర్ పాల్గొన్నారు.



పల్నాడు జిల్లా శిరిగిరిపాడు గ్రామంలో మహిళకు సంక్షేమ కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు తండాలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి



కడపలోని 11వ డివిజన్‌లో ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



తూర్పుగోదావరిజిల్లా లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

గడప గడపకు మన ప్రభుత్వం

'అంతిమం'గా... ఓ బిజినెస్ మోడల్

వారిది ఉన్నత కుటుంబం. వృద్ధాప్య సమస్యలతో ఆస్పత్రి పాలైన ఆ దంపతులిద్దరూ రెండు మూడు రోజుల్లో మరణిస్తారని వైద్యులు చెప్పేశారు. అనుకున్నట్టుగానే వృద్ధ దంపతులిద్దరూ ఒకేసారి మరణించారు. కడసారి చూసేందుకు 'ఆ నలుగురు' కాదు కదా.. ఏ ఒక్కరూ రాలేదు. అంత్యక్రియలను మీరే నిర్వహించండంటూ వారసుల నుంచి పురోహితుడి అకౌంట్‌కు క్షణాల్లో నగదు బదిలీ అయ్యింది. ఆ దంపతుల చివరి కోరిక మేరకు రాజమహేంద్రవరంలో గోదావరి గట్టున అంత్యక్రియలతోపాటు కర్మకాండలను సైతం 'పురమాయింపు' వ్యక్తులే జరిపించారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాల్ ద్వారా చూసి తరించిన వారసులు ఘన నివాళులే అర్పించారు. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా.. ఇది ఇటీవల జరిగిన యథార్థ ఘటన. ఇలాంటి వారి కోసమే పురోహితుని నుంచి పాడె మోయడం.. దహన సంస్కారాల వరకు నిర్వహించే 'ఆన్‌లైన్ అంతిమ సంస్కార' సంస్థలు పుట్టుకొస్తున్నాయి. అంత్యక్రియలనూ ఆన్‌లైన్ వ్యాపారంగా మార్చేసి కార్పొరేట్ మెట్లెక్కిస్తున్నాయి.

వివిధ మత సంప్రదాయాలకు అనుగుణంగా అంత్యక్రియలు

- ఆన్‌లైన్ సేవలందిస్తున్న వివిధ సంస్థలు
- సుకాంత్ అంతిమ సంస్కార్ పేరుతో స్టార్టప్ సైతం ఏర్పాటు
- పురోహితుని నుంచి పాడె మోయడం.. దహనం వరకు అన్నిరకాల సేవలు
- పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి వ్యక్తం చేస్తున్న కార్పొరేట్ సంస్థలు



ఢిల్లీ ట్రేడ్ ఫెయిర్‌లో అందర్నీ ఆకర్షిస్తున్న అంత్యక్రియల స్టాల్ సుకాంత్ అంతిమ సంస్కార్

సాక్షి, అమరావతి: నానాటికీ దిగజారుతున్న మానవ సంబంధాలు కొత్త వ్యాపార అవకాశాలను కల్పిస్తున్నాయి. ఉన్నత చదువులు చదివిన పిల్లలు ఉద్యోగాలు నిమిత్తం దూర దేశాలకు వెళ్లిపోయి.. కనీసం తల్లిదండ్రుల చివరి చూపునకు కూడా రాలేనంత బిజీ అయిపోయారు. వారసులు అంత గొప్ప ప్రయోజకులయ్యారని మురిసిపోవాలో... లేక చివరి క్షణాల్లో పిల్లలు ఉన్నా అనాథగా మిగిలిపోయామని బాధపడాలో తెలియని దుస్థితి తలెత్తింది. ఈ మధ్యనే రాజమహేంద్రవరంలో జరిగిన ఘటన కళ్లు చెమ్మగిల్లేలా చేసింది. వృద్ధాప్యంతో హాస్పిటల్‌లో చేరిన తల్లిదండ్రులకు సపర్యలు చేసే నిమిత్తం.. విదేశాల్లో స్థిరపడిన వారసులు ఆయాలను ఏర్పాటు చేశారు. వారిద్దరూ రెండు మూడు రోజుల్లోనే తుది శ్వాస విడుస్తారని తెలియడంతో.. ఆ దంపతుల కోరిక మేరకు గౌతమీ ఘాట్ వద్ద అంత్యక్రియలు జరిపించాలంటూ పురోహితుడి అకౌంట్‌కు వారిద్దరూ బతికుండగానే నగదు బదిలీ చేశారు. అంత్యక్రియల కార్యక్రమాన్ని వీడియో కాల్ ద్వారా చూపిస్తే తాము ఉన్న దేశం నుంచే నివాళి అర్పిస్తామన్నారు. ఆ పిల్లల వైఖరిని స్వయంగా చూసిన ఆ ముసలివాళ్ల మనసులు ఎంత తల్లడిల్లిపోయి ఉంటాయో. సరిగ్గా ఇలాంటి వారి కోసమే ఇప్పుడు అంత్యక్రియలు కూడా పెద్ద వ్యాపార వస్తువుగా మారిపోయాయి. పుట్టిన ప్రతి వాడూ గిట్టక మానడు కాబట్టి ఇది కూడా కార్పొరేట్ రూపు సంతరించుకుంటోంది. ఇందుకోసం అంతిమ సంస్కార్, గురూజీ, అంతేష్టి, లాస్ట్‌రైట్స్ వంటి పేర్లతో పలు సంస్థలు పుట్టుకొస్తున్నాయి.

అంతర్జాతీయ ట్రేడ్ ఫెయిర్‌లో ప్రత్యేక ఆకర్షణ

న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో ఏటా అంతర్జాతీయ ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ వాణిజ్య సంస్థలు తమ ఉత్పత్తులను అక్కడ ప్రదర్శించడం ద్వారా మార్కెటింగ్ చేసుకుంటాయి. అలాంటి అంతర్జాతీయ ట్రేడ్ ఫెయిర్‌లో ఏర్పాటు చేసిన ఒక స్టాల్ సందర్శకులను విస్తుపోయేలా చేసింది. 'సుకాంత్ అంతిమ సంస్కార్' పేరుతో అంత్యక్రియల కోసం ఏర్పాటైన ఒక కార్పొరేట్ కంపెనీ తాను అందించే సేవలను వివరిస్తూ పెట్టిన స్టాల్‌ను చాలామంది కన్నార్పకుండా చూశారు.

ఇద్దరు కలిపి.. 'ఆ నలుగురు' ఏర్పాట్లు

ముంబైకి చెందిన రవీంద్ర పాండురంగ్ సోనావాలే, సంజయ్ కైలాష్ రాముగడ్ అనే ఇద్దరు కలిసి సుకాంత్ ప్యూనరల్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఒక స్టార్టప్ కంపెనీ ఏర్పాటు చేశారు. వివిధ మతాలు, కులాల వారి ఆచార వ్యవహారాలకు అనుగుణంగా అంత్యక్రియలు నిర్వహించడమే ఈ సంస్థ ప్రధాన లక్ష్యం. అంత్యక్రియలకు అవసరమైన పాడె.. దాన్ని మోసే మనుషుల నుంచి పురోహితులు, మంగలి, రామ్ నామ్ సత్యహై అనే నినాదాలిచ్చే వంటివన్నీ ఒక ప్యాకేజీ కింద అందిస్తున్నారు. ప్రారంభం ప్యాకేజీ ధర రూ.37,500గా నిర్ణయించారు. అస్థికలను పవిత్ర నదుల్లో కలిపేదాన్ని బట్టి ప్రత్యేక రుసుములు తీసుకుంటున్నారు. ఇప్పటికే 5 వేలకు పైగా అంత్యక్రియలను నిర్వహించిన ఈ సంస్థ రూ.50 లక్షలకు పైగా లాభాన్ని నమోదు చేసింది. రానున్న కాలంలో ఈ సంస్థ టర్నోవర్ రూ.2 వేల కోట్లకు చేరుకోనుందనే అంచనాలతో పలు సంస్థలు ఇందులో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి వ్యక్తం చేస్తున్నాయి. ఈ విషయాన్ని ముందే గ్రహించిన శ్రీశ్రీ 'స్వతంత్ర దేశంలో చావు కూడా పెళ్లి లాంటిదే బ్రదర్' అన్నాడేమో.

ఆర్‌ఎంసీ భేటీని వాయిదా వేయండి

కృష్ణా బోర్డు ఆర్‌ఎంసీ కన్వీనర్‌కు ఈఎన్సీ లేఖ

సాక్షి, అమరావతి: ఈ నెల 24న జరగాల్సిన రిజర్వాయర్స్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఆర్‌ఎంసీ) ఐదో సమావేశాన్ని వాయిదా వేయాలని కృష్ణా బోర్డును ఏపీ ప్రభుత్వం కోరింది. ఆర్‌ఎంసీ సమావేశాన్ని ఈ నెల 27 తర్వాత ఎప్పుడైనా నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తూ కృష్ణా బోర్డు ఆర్‌ఎంసీ కన్వీనర్ ఆర్కే పిళ్లైకి మంగళవారం ఏపీ ఈఎన్సీ నారాయణరెడ్డి లేఖ రాశారు. ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌ల నిర్వహణ నియమావళిని రూపొందించేందుకు కృష్ణా బోర్డు సభ్యులు ఆర్కే పిళ్లైను కన్వీనర్‌గా, రెండు రాష్ట్రాల ఈఎన్సీలు, జెన్‌కో సీఈలు సభ్యులుగా ఆర్‌ఎంసీని బోర్డు ఏర్పాటు చేసింది. ఇప్పటికే ఆర్‌ఎంసీ నాలుగుసార్లు సమావేశమై శ్రీశైలం, సాగర్ నిర్వహణపై చర్చించింది. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల కింద ఏ కాలువకు ఎప్పుడు నీరు విడుదల చేయాలి, విద్యుత్ ఉత్పత్తిని ఎలా చేయాలి, మళ్లించిన వరద జలాలను లెక్కలోకి తీసుకోవాలా..వద్దా..అనే అంశాలపై ముసాయిదాను రూపొందించింది. ఈ ముసాయిదాను 24న జరిగే భేటీలో చర్చించి, ఆమోదించాలని నిర్ణయించింది. ఆ తర్వాత కృష్ణా బోర్డుకు ముసాయిదా నివేదిక సమర్పించనుంది. కృష్ణా బోర్డు సర్వసభ్య సమావేశంలో ఈ ముసాయిదాను చర్చించి, రెండు రాష్ట్రాల అభిప్రాయాల మేరకు దానిలో మార్పులు, చేర్పులు చేసి నిర్వహణ నియమావళిని ఖరారు చేస్తారు. ఈ నియమావళి ఆధారంగా ఉమ్మడి ప్రాజెక్టులను నిర్వహించడం ద్వారా రెండు రాష్ట్రాల మధ్య జల వివాదాలకు చెక్ పెట్టాలన్నది బోర్డు ఉద్దేశం.

భవిష్యత్ నానో యూరియాదే

వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి

సాక్షి, అమరావతి: భవిష్యత్ అంతా నానో యూరియాదేనని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. నానో టెక్నాలజీ ద్వారా అభివృద్ధి చేసిన ఈ నానో యూరియా వినియోగంతో పర్యావరణానికి, పంటలకు అత్యంత మేలు జరుగుతుందని తెలిపారు. రవాణా, వాడకం, ధరలతో పాటు పంటల దిగుబడి విషయంలో సంప్రదాయ యూరియాతో పోలిస్తే ఎన్నోరెట్లు అదనపు ప్రయోజనం ఉంటుందని చెప్పారు. నానో యూరియా వినియోగం, అవగాహనపై మంగళవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెట్టుబడి ఖర్చు గణనీయంగా తగ్గే ఈ యూరియా వినియోగంపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఇఫ్కో డైరెక్టర్ ఎం.జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ నానో యూరియా వాడకాన్ని ప్రోత్సహించాలని కోరారు.

8 శాతం పెరిగిన దిగుబడి

ఇఫ్కో ఏపీ మార్కెటింగ్ మేనేజర్ టి.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ 500 ఎంఎల్ బాటిల్‌లో ద్రవరూపంలో ఉండే నానో యూరియా 45 కిలోల యూరియా బస్తాతో సమానమని చెప్పారు. నానో యూరియా వినియోగించిన అనేక పంటల్లో ఎనిమిది శాతం మేర దిగుబడి పెరిగిందని విశ్వవిద్యాలయాల పరిశోధనల్లో వెల్లడైందని తెలిపారు. నానో యూరియా వాడకంపై రూపొందించిన కరపత్రాలను మంత్రి కాకాణి విడుదల చేశారు.



నానో యూరియా వినియోగంపై కరపత్రాలను విడుదల చేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

జాతీయ రహదారుల్లో మిల్లెట్ కేఫ్‌లు

జాతీయ రహదారుల వెంబడి మిల్లెట్ కేఫ్‌ల ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయ్యాలని మంత్రి కాకాణి సూచించారు. మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో మంగళవారం అన్ని జిల్లాల వ్యవసాయ అధికారులు, ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, ఉద్యానశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ రహదారుల వెంబడి మిల్లెట్ కేఫ్‌ల ఏర్పాటు వల్ల చిరుధాన్యాలు సాగుచేసే రైతులకు ప్రోత్సాహకంగా ఉంటుందని పేర్కొన్నారు. వీటి నిర్వహణ బాధ్యతలను ఆయా ప్రాంతాల స్థానిక స్వయం సహాయక సంఘాలతో పాటు యువతకు అప్పగించాలని సూచించారు. డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం అమలు చేయడం ద్వారా యూనివర్సల్ కవరేజ్ సాధించిన మొదటి రాష్ట్రం మనదేనని చెప్పారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య, స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్, ఏపీ సీడ్స్ ఎండీ గెడ్డం శేఖర్‌బాబు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కృషి

- వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్ బాషా
- పది జిల్లాలకు ప్రెసిడెంట్‌ల నియామకం



ఉమ్మే కులసుమ్‌కు చెక్కు అందిస్తున్న ఖాదర్‌బాషా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కృషి చేస్తున్నామని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ వి.ఖాదర్ బాషా తెలిపారు. విజయవాడలోని వక్ఫ్ బోర్డు రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన పలు జిల్లాలకు వక్ఫ్ బోర్డు ప్రెసిడెంట్లు, వైస్ ప్రెసిడెంట్లను ప్రకటించారు. సిరాజ్‌బాషా(తిరుపతి), కరిముల్లా(అన్నమయ్య), ఆరీఫ్(తూర్పుగోదావరి), రెహమతుల్లా (కాకినాడ), షేక్ జాని(గుంటూరు), ఎండీ సిరాజుద్దీన్(శ్రీకాకుళం), అబ్దుల్ ఖాదర్(అంబేడ్కర్ కోనసీమ), నియాజ్ సాహెబ్(కర్నూలు), మీరా మోహిద్దీన్(నెల్లూరు), కరీముల్లాబాషా (పశ్చిమగోదావరి)ని వక్ఫ్‌బోర్డు జిల్లా ప్రెసిడెంట్లుగా నియమించామని, మిగిలిన జిల్లాలకు త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇటీవల గుంటూరులో ఇంగ్లిష్‌లో అనర్గళంగా మాట్లాడి అందర్నీ అబ్బురపరిచిన వీఎంసీ మౌలానా ఆజాద్ పాఠశాల విద్యార్థిని ఉమ్మే కులసుమ్‌కు బహుమతిగా రూ.లక్ష చెక్కును ఖాదర్ బాషా అందించారు. మరోవైపు ఖాదర్ బాషాకు ప్రభుత్వం క్యాబినెట్ హోదా కల్పించింది.

బూతుల పార్టీ.. రౌడీల సేన అంటే ఉలుకెందుకు?

- వృద్ధ సైకో.. పిల్ల సైకో.. ప్యాకేజీ సైకోలకు బుద్ధిచెబుతాం
- అధికారం కోసం చంద్రబాబు దారుణంగా దిగజారుతున్నారు
- బాదుడే బాదుడుకు స్పందనలేదని టీడీపీ సర్వేల్లోనే తేలింది
- మంత్రి జోగి రమేష్ ఫైర్

సాక్షి, అమరావతి: టీడీపీ.. తెలుగు బూతులు, తెలుగు దొంగలు, తెలుగు డ్రామాలు, తెలుగు వెన్నుపోటుదారుల పార్టీ కాదా..? దీనికి చంద్రబాబు సమాధానం చెప్పాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ డిమాండ్ చేశారు. టీడీపీని తెలుగు బూతుల పార్టీగా, జనసేనను రౌడీసేనగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చెబితే ఎందుకు ఉలిక్కిపడుతున్నారని ఆయన ప్రశ్నించారు. 2019 ఎన్నికల తరువాత బట్టలూడిపోయిన చంద్రబాబు.. బహిరంగ సభల్లో ప్రజలను బట్టలూడదీసి కొడతానని మాట్లాడటం ఆశ్చర్యంగా ఉందన్నారు. అలాగే, వీకెండ్‌లో ఏపీకి వచ్చివెళ్లే ప్యాకేజీ కళ్యాణ్‌ది సైకోసేన అని, వీధి రౌడీలు, అర్ధరాత్రి సంచరించేవారు, పిక్ పాకెట్‌గాళ్లను ఈ సైకో కళ్యాణ్ తయారుచేస్తున్నాడని ధ్వజమెత్తారు. వృద్ధ సైకో.. పిల్ల సైకో.. ప్యాకేజీ సైకోలకు బుద్ధి



చెబుతామని మంత్రి అన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 75ఏళ్ల వయస్సులో చంద్రబాబు అధికారం కోసం దిగజారి చాలా దారుణంగా ప్రవర్తిస్తున్నారని.. టీడీపీని రక్షించుకోలేని ఆయన పక్క పార్టీల కాళ్లు పట్టుకోవడానికి సిద్ధపడుతున్నారని జోగి రమేష్ ఎద్దేవా చేశారు. బాదుడే బాదుడు కార్యక్రమంలో 86 నియోజకవర్గాల్లో కనీస స్పందన రాలేదని, డీ–గ్రేడ్‌లో ఉన్నాయని, ఇంకో 80 నియోజకవర్గాల్లో సీ–గ్రేడ్‌లో ఉన్నట్లు టీడీపీ సర్వేలోనే తేలిందన్నారు. అలాగే, ఆ పార్టీ చచ్చిపోయిందని వాళ్ల సమీక్షల్లోనే తేలిపోయిందని మంత్రి చెప్పారు. పార్టీ మేనిఫెస్టో గురించి చెప్పుకోకుండా ఓటేయకపోతే ఈ రాష్ట్రం నాశనమవుతుందని శాపనార్థాలు పెట్టే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ పార్టీలను నిలువునా పాతరేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. ఇక బూతుపురాణాల నేతలకు కేరాఫ్‌గా తెలుగుదేశం పార్టీని చెప్పుకోవచ్చని.. అలాగే, అయ్యన్న నోరు అదుపులో పెట్టుకోవాలని, వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని పిల్లసైకో, లోకజ్ఞానం లేని లోకేశ్ తన స్థాయి తెలుసుకుని మాట్లాడితే మంచిదన్నారు.

సాగరతీరంలో 'యుద్ధం'!



బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): ప్రశాంతమైన విశాఖ సాగరతీరంలో మంగళవారం ఒక్కసారిగా యుద్ధ వాతావరణం నెలకొంది. పెద్దసంఖ్యలో యుద్ధనౌకలు, సబ్‌మెరైన్, స్పీడ్‌బోట్లు, చాతక్‌లు మోహరించాయి. తీరం వైపు దూసుకొస్తున్న స్పీడ్‌బోట్లపై యుద్ధనౌకలు బాంబుల వర్షం కురిపించాయి. ఒక్కసారిగా మారిన పరిస్థితులతో సందర్శకులకు ఏం జరుగుతుందో అర్థంగాలేదు. తరువాత ఇవి.. డిసెంబర్ 4వ తేదీన జరగనున్న నేవీ డే కోసం రిహార్సల్స్ అని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. నేవీ డే సందర్భంగా తూర్పునౌకదళం విశాఖ ఆర్కే బీచ్‌లో ఘనంగా వేడుకలను నిర్వహించేందుకు రంగం సిద్ధం చేసింది. వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా ప్రారంభించింది. మంగళవారం విన్యాసాల రిహార్సల్స్ చేశారు. తీరానికి వచ్చిన సందర్శకులు ఈ విన్యాసాలను ఆసక్తిగా తిలకించారు.



తీరంవైపునకు దూసుకువస్తున్న స్పీడ్ బోట్లు

జగన్ పరిపాలనే ఆయన్ని మళ్లీ గెలిపిస్తుంది

- రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి



గుంటూరు ఎడ్యుకేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందిస్తున్న ప్రజాసంక్షేమ పరిపాలనే ఆయన్ని మళ్లీ అధికారంలోకి తీసుకొస్తుందని రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు ప్రజలు మరోసారి ఓటువేసి తప్పు చేయరని, 2024లో జరిగేవి ఆయనకు చివరి ఎన్నికలని పేర్కొన్నారు. గుంటూరు బ్రాడీపేటలో ఉన్నవ లక్ష్మీనారాయణ, లక్ష్మీబాయి దంపతులు నెలకొల్పిన శారదానికేతన్ మహిళా విద్యాసంస్థల శతాబ్ది మహోత్సవాల్లో మంగళవారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల తరువాత బాబుతో పాటు టీడీపీ భూస్థాపితం కానుందని చెప్పారు. తన పాలనలో మేలు జరిగితే తిరిగి వైఎస్సార్‌సీపీకి ఓటెయ్యాలని సీఎం వైఎస్ జగన్ నిర్మొహమాటంగా ప్రజలకు చెబుతున్నారన్నారు. ఇటువంటి మాట చెప్పే దమ్ము, ధైర్యం ప్రజానాయకుడైన జగన్‌కు మాత్రమే ఉన్నాయని చెప్పారు. అధికారం దక్కలేదనే అక్కసుతో బాబు ప్రజలను బూతులు తిడుతున్నారని అన్నారు. గతంలో చాన్స్ ఇచ్చిన ప్రజలే తిరిగి ఆయన్ని 23 సీట్లకు పరిమితం చేశారని గుర్తుచేశారు.

ప్రజలకు పౌష్టికాహారం అందించేందుకు కృషి

- ఏపీ రైతుసాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్

సాక్షి, అమరావతి: ప్రజలకు సురక్షితమైన పౌష్టికాహారాన్ని అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఏపీ వ్యవసాయ, సహకారరంగ ప్రభుత్వ సలహాదారు, ఏపీ రైతుసాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ చెప్పారు. సచివాలయంలో మంగళవారం జరిగిన ఎవాల్యుయేషన్ అండ్ పాలసీ అడ్వయిజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మరో వెయ్యిగ్రామాల్లో ఆరోగ్య పౌష్టికాహార కార్యక్రమాన్ని విస్తరించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 15 జిల్లాల్లోని 129 గ్రామాల్లో చేపట్టిన ఈ కార్యక్రమం సత్ఫలితాలిస్తోందన్నారు. వైద్యశాఖను సమన్వయపరుచుకుంటూ ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనకాపల్లి, విశాఖపట్నం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఇడెన్ బర్గ్ యూనివర్సిటీ బేస్‌లైన్ స్టడీ చేసిందని, ముఖ్యంగా మూత్రం, రక్తపరీక్షలతో పాటు తినే ఆహారంపైనా అధ్యయనం చేసిందని చెప్పారు. రసాయన పద్ధతుల్లో పండించే పంటల వల్ల ప్రజలు దీర్ఘకాలిక వ్యాధుల బారినపడే అవకాశం ఉందని ఆయన తెలిపారు. వైద్యశాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు మాట్లాడుతూ మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మరింత ప్రభావవంతంగా పౌష్టికాహారం అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

సింహాద్రి ఎన్‌టీపీసీలో పీఎం రోజ్‌గార్ మేళా

- 340 మందికి ఉద్యోగ నియామక పత్రాలు
- విశాఖలో జి–20 దేశాల సమావేశం



ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

పరవాడ (అనకాపల్లి): దేశంలో పదిలక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ కృషిచేస్తున్నారని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. అనకాపల్లి జిల్లా పరవాడలోని సింహాద్రి ఎన్టీపీసీ దీపాంజలినగర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి రోజ్‌గార్ మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ జి–20 దేశాల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ప్రధాని మోదీ ఆధ్వర్యంలో విశాఖలో జి–20 దేశాల సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అనకాపల్లి ఎంపీ బీశెట్టి సత్యవతి మాట్లాడారు. అనంతరం ఉద్యోగాలు పొందిన 340 మంది యువతీయువకులకు నియామకపత్రాలు అందజేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, ఎమ్మెల్సీ మాధవ్, కలెక్టర్ రవిప్రకాష్ పటాన్‌శెట్టి, సింహాద్రి ఎన్టీపీసీ సీజీఎం జి.సి.చౌక్సే, సీఐఎస్ఎఫ్ డీఐజీ నందన్, ఏఐఎంఎస్ డైరెక్టర్ ముఖేష్ త్రిపాఠీ పాల్గొన్నారు.



లుకాకు లేకుండానే తొలి మ్యాచ్ బరిలో బెల్జియం

గత ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో మూడో స్థానంలో నిలిచిన బెల్జియం జట్టు ఈసారి టైటిల్ వేటను నేడు కెనడాతో జరిగే మ్యాచ్‌తో ప్రారంభించనుంది. అయితే ఈ మ్యాచ్‌లో బెల్జియం స్టార్ ప్లేయర్ రొమెలు లుకాకు గాయం కారణంగా బరిలోకి దిగడం లేదు. ఎడమ తొడ కండరాల గాయంతో బాధపడుతున్న లుకాకు మొరాకోతో జరిగే రెండో మ్యాచ్ లోనూ ఆడేది సందేహమేనని బెల్జియం కోచ్ రొబెర్టో మార్టినెజ్ తెలిపారు. 31 ఏళ్ల లుకాకు బెల్జియం తరఫున ఇప్పటి వరకు 102 మ్యాచ్‌లు ఆడి 68 గోల్స్ సాధించాడు.



వేల్స్‌ను గట్టెక్కించిన బేల్

64 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీకి అర్హత సాధించిన వేల్స్ జట్టు తొలి మ్యాచ్‌ను 'డ్రా' చేసుకుంది. అమెరికాతో సోమవారం అర్ధరాత్రి దాటాక జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌ను వేల్స్ 1-1తో 'డ్రా'గా ముగించింది. ఆట 82వ నిమిషంలో వేల్స్ జట్టుకు లభించిన పెనాల్టీని గ్యారెత్ బేల్ గోల్‌గా మలిచి స్కోరును 1-1తో సమం చేశాడు. 36వ నిమిషంలో టిమోతి చేసిన గోల్‌తో అమెరికా ఖాతా తెరిచింది. మ్యాచ్ 'డ్రా' కావడంతో రెండు జట్లుకు ఒక్కో పాయింట్ దక్కింది.

లుజైల్ స్టేడియం 88 వేల మంది ప్రేక్షకులతో హోరెత్తిపోతోంది... అందులో ఎక్కువ భాగం సౌదీ అరేబియా అభిమానులే అయినా... అర్జెంటీనాను ఆరాధించేవారు కూడా తక్కువేమీ కాదు! ఆరంభంలోనే సూపర్ స్టార్ మెస్సీ గోల్‌తో అర్జెంటీనాకు ఆధిక్యం... మరో మూడుసార్లు బంతి గోల్‌పోస్ట్‌లోనికి... వాటిని రిఫరీ అనుమతించకపోయినా, మెస్సీ బృందం జోరును చూస్తే ఏకపక్ష మ్యాచ్ అనిపించింది... కానీ రెండో అర్ధభాగంలోకి వచ్చేసరికి 'గ్రీన్ ఫాల్కన్స్' ఒక్కసారిగా విరుచుకుపడ్డారు... ఐదు నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్ కొట్టేశారు... ఇరు జట్లు సమంగా ఉన్న స్థితిలో 53వ నిమిషం...నవాఫ్ అల్ అబీద్ బంతిని గోల్‌పోస్ట్ వరకు తీసుకురాగలిగినా, రొమేరో దానిని హెడర్‌తో సమర్థంగా వెనక్కి పంపగలిగాడు... అయితే పెనాల్టీ ఏరియా కుడివైపు నుంచి అనూహ్యంగా దూసుకొచ్చిన మిడ్‌ఫీల్డర్ సలేమ్ అల్‌దవ్‌సరి ఇద్దరు ప్రత్యర్థి ఆటగాళ్లను తప్పించి బంతిని తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. అతడిని నిలువరించేందుకు లియాండ్రో ప్రయత్నించినా లాభం లేకపోయింది. సలేమ్ అద్భుత కిక్ అర్జెంటీనా కీపర్ మార్టినెజ్‌ను దాటి గోల్‌పోస్ట్‌లోకి వెళ్లింది. సలేమ్ 'సోమర్‌సాల్ట్'తో జట్టు సంబరాలు మిన్నంటగా, అభిమానులతో స్టేడియం దద్దరిల్లింది. చివరి వరకు అదే ఆధిక్యం నిలబెట్టుకొని సౌదీ అరేబియా వరల్డ్ కప్‌లో పెను సంచలనం నమోదు చేసింది. టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన అర్జెంటీనాకు షాక్ ఇచ్చి ఫుట్‌బాల్ ప్రపంచాన్ని కుదిపేసింది.



రెండో గోల్ చేశాక సౌదీ అరేబియా ప్లేయర్ సలేమ్ సంబరం (జెర్సీ నంబర్ 10)

సౌదీ అరేబియా కమాల్ కియా...

- అర్జెంటీనాపై సంచలన విజయం
- 1-2 తేడాతో మెస్సీ బృందం ఓటమి
- సౌదీని గెలిపించిన సలేహ్, సలేమ్

దోహా: వరల్డ్‌కప్‌లో తొలి మ్యాచ్ ఆడే సమయానికి మాజీ చాంపియన్ అర్జెంటీనా జోరు మీదుంది. గత 36 మ్యాచ్‌లలో ఆ జట్టు ఓడిపోలేదు... 25 గెలవగా, 11 'డ్రా' అయ్యాయి... టైటిల్ గెలిచే జట్లలో ఒకటిగా మెస్సీ సేన ఖతర్‌లో అడుగు పెట్టింది. మరోవైపు ప్రపంచ 51వ ర్యాంక్ సౌదీ అరేబియాపై ఎవరికీ ఎలాంటి ఆశలు లేవు... టోర్నీలో ఆడుతున్న జట్లలో ఒక్క ఘనా మాత్రమే ఆ జట్టుకంటే తక్కువ ర్యాంక్‌లో ఉంది. 1994 నుంచి ఐదుసార్లు వరల్డ్ కప్ ఆడిన ఆ టీమ్ 3 మ్యాచ్‌ల్లో గెలిచింది. అవీ చెప్పుకోదగ్గవి కావు. కానీ ఆ దేశ ఫుట్‌బాల్ చరిత్రలో అత్యుత్తమ విజయాన్ని మంగళవారం అందుకుంది. మంగళవారం జరిగిన గ్రూప్ 'సి' పోరులో సౌదీ 2-1 గోల్స్ తేడాతో అర్జెంటీనాపై ఘన విజయం సాధించింది. సౌదీ తరఫున సలేహ్ అల్ షహరి (48వ నిమిషం), సలేమ్ అల్ దవసరి (53వ నిమిషం) గోల్స్ నమోదు చేయగా... లయోనల్ మెస్సీ అర్జెంటీనాకు ఏకైక గోల్ (10వ నిమిషం) అందించాడు. తొలి హాఫ్‌లో సంపూర్ణ ఆధిక్యం ప్రదర్శించిన అర్జెంటీనా ఆట రెండో హాఫ్‌లో ఒక్కసారిగా పట్టు తప్పగా, సౌదీ దానిని సొమ్ము చేసుకుంది. ఆఖరి వరకు దానిని కొనసాగించి సరైన ఫలితాన్ని అందుకుంది. వరల్డ్ కప్ చరిత్రలో అతి పెద్ద సంచలనాల్లో ఈ మ్యాచ్ కూడా ఒకటిగా మిగిలిపోనుంది.

ఆ మూడు గోల్స్ ఇచ్చి ఉంటే...

మ్యాచ్ ఆరంభంలో అర్జెంటీనా తమ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చింది. రెండు నిమిషాల్లోపే జట్టు ఖాతాలో గోలే చేరేది. అయితే మెస్సీ షాట్‌ను సౌదీ కీపర్ ఒవైస్ అడ్డుకోగలిగాడు. అయితే లియాండ్రోను హమీద్ దురుసుగా అడ్డుకోవడంతో మాజీ చాంపియన్‌కు పెనాల్టీ అవకాశం లభించింది. ప్రశాంతంగా గోల్ కొట్టి మెస్సీ జట్టును ముందంజలో నిలిపాడు. అయితే తర్వాతి మూడు షాట్‌లు అర్జెంటీనాకు తీవ్ర నిరాశను మిగిల్చాయి. వరుసగా మెస్సీ, మార్టినెజ్ (రెండు సార్లు) చేసిన గోల్స్‌ను 'ఆఫ్ సైడ్' నిబంధన ద్వారా రిఫరీ తిరస్కరించాడు. బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపే సమయంలో గోమెజ్, మార్టినెజ్, రోడ్రిగో చేసిన తప్పులు జట్టును దెబ్బ తీశాయి. లేదంటే అర్జెంటీనా 4-0తో దూసుకుపోయేదే. రెండో అర్ధ భాగంలో మాత్రం సౌదీ చెలరేగింది. ఆట ఆరంభమైన మూడు నిమిషాల్లోనే షహరి గోల్‌తో లెక్క సమం చేశాడు. అతడిని ఆపేందుకు రొమెరో చేసిన ప్రయత్నం విఫలమైంది. మరో ఐదు నిమిషాల తర్వాత చేసిన గోల్‌తో అరబ్ టీమ్ ఆధిక్యం అందుకుంది. ఆ తర్వాత ఇంజ్యూరీ టైమ్ సహా మరో 60 నిమిషాల పాటు ఆట సాగినా... అర్జెంటీనా స్కోరును సమం చేయడంలో విఫలమైంది. మెస్సీ అద్భుతంగా ఆడుతూ గోల్‌పోస్ట్‌కు చేరువగా వచ్చిన క్షణంలో హసన్ అల్ తంబక్తి అతడిని టాకిల్ చేసిన తీరు హైలైట్‌గా నిలిచింది. చివరకు సౌదీ ఆటగాళ్ల ఆనందానికి హద్దు లేకపోగా, మెస్సీ విషణ్ణ వదనంతో నిష్క్రమించాడు. మ్యాచ్ అంకెల ప్రకారం చూస్తే ఎక్కువ శాతం (69) బంతి అర్జెంటీనా ఆధీనంలోనే ఉన్నా... 14 సార్లు గోల్‌పోస్ట్‌పైకి దాడులు చేసినా (సౌదీ 3 సార్లు), ప్రత్యర్థితో పోలిస్తే ఎక్కువ కార్నర్‌లు (6-2) లభించినా... సౌదీ చేసిన 21 ఫౌల్స్‌తో పోలిస్తే 6 ఫౌల్స్ చేసినా... ఆరుగురు సౌదీ ఆటగాళ్లు ఎల్లోకార్డుకు గురైనా చివరకు విజయం మాత్రం సౌదీదే కావడం విశేషం!

1958 మ్యాచ్‌లో తొలి గోల్ సాధించాక ఫుట్‌బాల్ ప్రపంచకప్ మ్యాచ్‌లో అర్జెంటీనా జట్టు ఓడిపోవడం 1958 (జర్మనీ చేతిలో) తర్వాత ఇదే తొలిసారి. తొలి అర్ధ భాగం వరకు 1-0తో ఆధిక్యంలో నిలిచి మ్యాచ్‌లో ఓటమి చవిచూడటం అర్జెంటీనాకు 1930 తర్వాత ఇదే తొలిసారి.

1 అర్జెంటీనాపై గెలుపొందిన తొలి ఆసియా జట్టుగా సౌదీ అరేబియా గుర్తింపు పొందింది.



మెస్సీ

ప్రపంచకప్‌లో సంచలనాల జాబితా

- స్పెయిన్ 2-3 నైజీరియా (1998): నైజీరియాకి ఇది రెండో ప్రపంచకప్ మాత్రమే. ఈ ఓటమితో తర్వాతి రెండు మ్యాచ్‌లు గెలిచినా... స్పెయిన్ రౌండ్ దశలోనే నిష్క్ర మించింది.
- ఈస్ట్ జర్మనీ 1-0 వెస్ట్ జర్మనీ (1974): వెస్ట్ జర్మనీ అప్పటికే ఒకసారి చాంపియన్ కాగా, ఈస్ట్ జర్మనీ తొలిసారి వరల్డ్ కప్ ఆడింది.
- బ్రెజిల్ 1-2 నార్వే (1998): నార్వేకు ప్రపంచ కప్‌లో ఇది రెండో విజయం మాత్రమే. టోర్నీలో తొలి రెండు మ్యాచ్‌లు గెలిచిన బ్రెజిల్ తర్వాతి మ్యాచ్‌లో అనూహ్యంగా ఓడింది.
- దక్షిణ కొరియా 2-1 ఇటలీ (2002): ఇది ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్. మూడుసార్లు విజేత ఇటలీ ఇంటిదారి పట్టింది.
- వెస్ట్ జర్మనీ 1-2 అల్జీరియా (1982): రెండు సార్లు అప్పటికే విజేత అయిన జట్టుపై వరల్డ్ కప్‌లోనే తొలి మ్యాచ్ ఆడిన జట్టు గెలిచింది.
- ఇటలీ 0-1 దక్షిణ కొరియా (1966): తొలి వరల్డ్ కప్ ఆడిన కొరియా ఈ విజయంతో రెండు సార్లు విజేత ఇటలీని రౌండ్ దశలోనే నిష్క్రమించేలా చేసింది.
- ఇటలీ 0-1 కోస్టారికా (2014): ఈ ఓటమితో ఇటలీ ఆట తొలి రౌండ్‌లోనే ముగిసింది.
- అర్జెంటీనా 0-1 కామెరూన్ (1990): మారడోనా నాయకత్వంలోని డిఫెండింగ్ చాంపియన్, రెండో వరల్డ్ కప్ ఆడుతున్న టీమ్ చేతిలో ఓడింది.
- ఫ్రాన్స్ 0-1 సెనెగల్ (2002): డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన ఫ్రాన్స్ జట్టును, తొలి వరల్డ్ కప్ మ్యాచ్ ఆడిన సెనెగల్ ఓడించింది. దాంతో ఫ్రాన్స్ రౌండ్ దశలోనే నిష్క్రమించింది.

నేడు జాతీయ సెలవు దినం

అర్జెంటీనాపై గెలుపు నేపథ్యంలో సౌదీ అరేబియాలో పెద్ద ఎత్తున సంబరాలు కొనసాగుతున్నాయి. ఈ ఆనందాన్ని రెట్టింపు చేస్తూ బుధవారం ఆ దేశంలో సెలవు ఇచ్చేశారు. ప్రజలు ఈ క్షణాన్ని వేడుకలా జరుపుకునేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగ సంస్థలతో పాటు విద్యా సంస్థలకు కూడా సెలవు ఇస్తున్నట్లు దేశపు రాజు సల్మాన్ ప్రకటించారు.

ప్రపంచకప్‌లో నేడు

క్రొయేషియా X మొరాకో
మధ్యాహ్నం గం. 3:30 నుంచి
జర్మనీ X జపాన్
సాయంత్రం గం. 6:30 నుంచి
స్పెయిన్ X కోస్టారికా
రాత్రి గం. 9:30 నుంచి
బెల్జియం X కెనడా
అర్ధరాత్రి గం. 12:30 నుంచి
స్పోర్ట్స్ 18, జియో సినిమా చానెల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

డెన్మార్క్‌ను 0-0తో నిలువరించిన ట్యునీషియా



ట్యునీషియా చిన్నారి అభిమాని ఉత్సాహం

దోహా: పట్టుదలతో ఆడితే ప్రపంచకప్‌లాంటి గొప్ప ఈవెంట్‌లోనూ తమకంటే ఎంతో మెరుగైన జట్టుపై మంచి ఫలితం సాధించవచ్చని ట్యునీషియా జట్టు నిరూపించింది. ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో భాగంగా మంగళవారం జరిగిన గ్రూప్ 'డి' మ్యాచ్‌లో ప్రపంచ 30వ ర్యాంకర్ ట్యునీషియా 0-0తో ప్రపంచ 10వ ర్యాంకర్ డెన్మార్క్‌జట్టును నిలువరించింది. రెండు జట్లు గోల్ చేయడంలో విఫలమయ్యాయి. ట్యునీషియా గోల్‌పోస్ట్ లక్ష్యంగా డెన్మార్క్ జట్టు ఐదుసార్లు షాట్‌లు కొట్టినా ఫలితం లేకపోయింది. డెన్మార్క్ ఆటగాళ్లు బంతిని తమ ఆధీనంలో 62 శాతం ఉంచుకున్నా ట్యునీషియా రక్షణ శ్రేణిని ఛేదించి గోల్ చేయలేకపోయారు. మ్యాచ్ 'డ్రా'గా ముగియడంతో రెండు జట్లకు ఒక్కో పాయింట్ లభించింది.

పోలాండ్ 0 మెక్సికో 0



దోహా: ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీలో మరో 'డ్రా' నమోదైంది. పోలాండ్, మెక్సికో జట్ల మధ్య మంగళవారం జరిగిన గ్రూప్ 'సి' మ్యాచ్‌లో రెండు జట్లు గోల్ చేయడంలో విఫలమయ్యాయి. దాంతో మ్యాచ్ 0-0తో 'డ్రా'గా ముగిసింది. మెక్సికో జట్టు పోలాండ్ గోల్‌పోస్ట్ లక్ష్యంగా నాలుగు సార్లు షాట్‌లు సంధించగా ఒక్కటీ లక్ష్యానికి చేరలేదు. పోలాండ్ స్టార్ ప్లేయర్ లెవన్‌డౌస్కీను మెక్సికో జట్టు వ్యూహాత్మకంగా కట్టడి చేసింది. మ్యాచ్ 'డ్రా'గా ముగియడంతో రెండు జట్లకు ఒక్కో పాయింట్ లభించింది.

భారత బాక్సర్లకు ఏడు పతకాలు ఖాయం



విశ్వనాథ్

లా నుసియా (స్పెయిన్): ప్రపంచ యూత్ పురుషుల, మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు తమ పంచ్ పవర్ చాటుకున్నారు. ఏకంగా ఏడుగురు బాక్సర్లు సెమీఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం కాంస్య పతకాలను ఖాయం చేసుకున్నారు. మహిళల విభాగంలో రవీనా (63 కేజీలు), భావన (48 కేజీలు), కుంజ రాణి (60 కేజీలు), లాషు (70 కేజీలు)... పురుషుల విభాగంలో విశ్వనాథ్ (48 కేజీలు), వన్షజ్ (63.5 కేజీలు), ఆశిష్ (54 కేజీలు) సెమీఫైనల్లోకి ప్రవేశించారు. క్వార్టర్ ఫైనల్స్‌లో విశ్వనాథ్ 5-0తో జైకెర్ (ఆస్ట్రేలియా)పై, వన్షజ్ 5-0తో లివాజా (కిర్గిస్తాన్)పై, ఆశిష్ 4-3తో కులెన్ (స్కాట్లాండ్)పై గెలిచారు.

ఆసీస్ క్లీన్‌స్వీప్



హెడ్

- ఆఖరి వన్డేలో ఇంగ్లండ్‌పై భారీ విజయం
- ట్రావిస్ హెడ్, వార్నర్ సెంచరీలు

మెల్‌బోర్న్: సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను ఆస్ట్రేలియా 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. మంగళవారం జరిగిన ఆఖరి వన్డేలో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఆసీస్ 221 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై ఘనవిజయం సాధించింది. మొదట ఆసీస్ 48 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 355 పరుగులు చేసింది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (152; 16 ఫోర్లు, 4 సిక్సర్లు), వార్నర్ (106; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీలు సాధించారు. ఆసీస్ ఇన్నింగ్స్ మధ్యలోనే వర్షం వల్ల డీఎల్ పద్ధతిలో ఇంగ్లండ్ లక్ష్యాన్ని 48 ఓవర్లలో 364 పరుగులుగా సవరించారు. కానీ ఇంగ్లండ్ 31.4 ఓవర్లలో 142 పరుగులకే కుప్పకూలింది. స్పిన్నర్ ఆడమ్ జంపా నాలుగు వికెట్లు, కమిన్స్, అబాట్ రెండేసి వికెట్లు తీశారు. పరుగుల తేడా పరంగా వన్డేల్లో ఇంగ్లండ్‌కిదే అతిపెద్ద ఓటమి కావడం గమనార్హం.



వార్నర్

వర్షంతో ఆఖరి పోరు 'టై'

'టై' అనగానే ఆఖరి ఓవర్ డ్రామా! ఇరుజట్లతో విజయం దోబూచులాట సహజం. కానీ ఇది అలాంటి ఉత్కం'టై'న పోరు కాదు. భారత్ లక్ష్య ఛేదనలో ఉండగా... వర్షం కురవడంతో 'డక్‌వర్త్ లూయిస్' పద్ధతిలో 'టై' అయిన మ్యాచ్ అంతే! మొత్తానికి చినుకులు ఆఖరి టి20 మెరుపుల్ని ఆపేసినా... సిరీస్ మాత్రం భారత్ చేతికే చిక్కింది.

- సిరీస్ 1-0తో భారత్ వశం
- నిప్పులు చెరిగిన సిరాజ్, అర్ష్ దీప్
- శుక్రవారం నుంచి వన్డే సిరీస్

నేపియర్: పేస్ బౌలర్లు మొహమ్మద్ సిరాజ్ (4/17), అర్ష్‌దీప్ సింగ్ (4/37) నిప్పులు చెరిగే ప్రదర్శనను భారత బ్యాటర్లు నీరుగార్చినా... వానొచ్చే ముందు సాన్‌ట్నర్ మిస్‌ఫీల్డింగ్ మ్యాచ్‌లో భారత జట్టును ఓటమి నుంచి కాపాడింది. టి20 సిరీస్ టీమిండియా చేతికందేలా చేసింది. మూడు టి20 సిరీస్‌ను వర్షం శాసించగా... ఒకే ఒక్క విజయంతో భారత్ సిరీస్‌ను కైవసం చేసుకుంది. మంగళవారం జరిగిన ఆఖరి పోరు డక్‌వర్త్ లూయిస్ (డీఎల్) పద్ధతి ప్రకారం 'టై' అయ్యింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య న్యూజిలాండ్ 19.4 ఓవర్లలో 160 పరుగుల వద్ద ఆలౌటైంది. కాన్వే (49 బంతుల్లో 59; 5 ఫోర్లు, 2 సిక్సర్లు), గ్లెన్ ఫిలిప్స్ (33 బంతుల్లో 54; 5 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించారు. అనంతరం వర్షంతో ఆట నిలిచే సమయానికి భారత్ 9 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 75 పరుగులు చేసింది. కెప్టెన్ హార్దిక్ పాండ్యా (18 బంతుల్లో 30 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడాడు. అయితే వానతో ఇక ఆట మళ్లీ మొదలుకాకపోవడంతో డీఎల్ పద్ధతిని ఆశ్రయించారు. సిరాజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'... సూర్యకుమార్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు లభించాయి. ఇరు జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి వన్డే శుక్రవారం ఆక్లాండ్‌లో జరుగుతుంది.

130/2 నుంచి 160 ఆలౌట్

పవర్ ప్లేలోనే ఫిన్ అలెన్ (3), చాప్‌మన్ (12) అవుటయ్యారు. కానీ కాన్వే, ఫిలిప్స్ దంచేసే పనిలో పడటంతో భారత బౌలర్లకు కష్టాలు తప్పలేదు. వారిద్దరి ధాటికి న్యూజిలాండ్ స్కోరు 13వ ఓవర్లో 100 పరుగులు దాటింది. ఆ తర్వాత హైదరాబాదీ బౌలర్ సిరాజ్ అసాధారణ పేస్‌తో చెలరేగాడు. అర్ష్‌దీప్ కూడా జత కలిశాడు. 15.4 ఓవర్లలో 130/2 స్కోరు వద్ద పటిష్టంగా కనిపించిన కివీస్ భారత పేస్ ద్వయానికి 160 పరుగులకే ఆలౌటైంది. కేవలం 30 పరుగులే జోడించి 8 వికెట్లను కోల్పోయింది. 18వ ఓవర్లో సిరాజ్... నీషమ్ (0), సాన్‌ట్నర్ (1)లను పెవిలియన్ చేర్చితే, 19వ ఓవర్లో అర్ష్‌దీప్... మిచెల్ (10), ఇష్ సోధి (0)లను అవుట్ చేశాడు.



స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: అలెన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అర్ష్‌దీప్ 3; కాన్వే (సి) ఇషాన్ (బి) అర్ష్‌దీప్ 59; చాప్‌మన్ (సి) అర్ష్‌దీప్ (బి) సిరాజ్ 12; ఫిలిప్స్ (సి) భువనేశ్వర్ (బి) సిరాజ్ 54; మిచెల్ (సి) పంత్ (బి) అర్ష్‌దీప్ 10; నీషమ్ (సి) పంత్ (బి) సిరాజ్ 0; సాన్‌ట్నర్ (సి) చహల్ (బి) సిరాజ్ 1; మిల్నే (రనౌట్) 0; ఇష్ సోధి (బి) అర్ష్‌దీప్ 0; సౌతీ (బి) హర్షల్ 6; ఫెర్గూసన్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (19.4 ఓవర్లలో ఆలౌట్) 160. వికెట్ల పతనం:** 1-9, 2-44, 3-130, 4-146, 5-147, 6-149, 7-149, 8-149, 9-149, 10-160. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-35-0, అర్ష్‌దీప్ 4-0-37-4, సిరాజ్ 4-0-17-4, హుడా 1-0-3-0, చహల్ 3-0-35-0, హర్షల్ పటేల్ 3.4-0-28-1.

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ (సి) చాప్‌మన్ (బి) మిల్నే 10; పంత్ (సి) సోధి (బి) సౌతీ 11; సూర్యకుమార్ (సి) ఫిలిప్స్ (బి) సోధి 13; అయ్యర్ (సి) నీషమ్ (బి) సౌతీ 0; హార్దిక్ పాండ్యా (నాటౌట్) 30; దీపక్ హుడా (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (9 ఓవర్లలో 4 వికెట్లకు) 75. వికెట్ల పతనం:** 1-13, 2-21, 3-21, 4-60. **బౌలింగ్:** సౌతీ 3-0-27-2, మిల్నే 2-0-23-1, ఫెర్గూసన్ 1-0-8-0, ఇష్ సోధి 2-0-12-1, సాన్‌ట్నర్ 1-0-5-0.

టాపార్డర్ వైఫల్యం

పెద్ద లక్ష్యం కాకపోయినా ఛేదనకు అనువైన స్కోరు చేయడంలో భారత ఓపెనర్లు ఘోరంగా విఫలమయ్యారు. ఇషాన్ (10), పంత్ (11), అయ్యర్ (0) వికెట్లను పారేసుకోవడంతో 21 పరుగులకే 3 వికెట్లను కోల్పోయింది. పవర్ ప్లే వరకు క్రీజులో ఉన్నా సూర్య (13) కూడా రాణించలేకపోయాడు. పాండ్యా, హుడా (9 నాటౌట్) జాగ్రత్తగా ఆడుతున్నారు. 8.5 ఓవర్లలో భారత్ స్కోరు 74/4. ఆఖరి బంతిని హుడా పాయింట్ దిశగా ఆడగా పరుగు రాని చోట సాన్‌ట్నర్ మిస్‌ఫీల్డ్‌తో భారత్‌కు పరుగు వచ్చింది. టీమిండియా స్కోరు 75/4కు చేరింది. అప్పుడు కురిసిన వానతో మ్యాచ్ ఆగిపోయింది. అప్పటికి డీఎల్ పద్ధతి ప్రకారం భారత విజయ సమీకరణం 76. భారత స్కోరు 75గా ఉండటంతో మ్యాచ్ 'టై' అయినట్లు ప్రకటించారు. సాన్‌ట్నర్ ఫీల్డింగ్ తప్పిదంతో గెలవాల్సిన మ్యాచ్‌ను ఓడిపోయిన కివీస్... చివరకు సిరీస్‌ను కోల్పోయింది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
274	84
61,419	18,244

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	11,089	▲	64
డోజోన్స్	33,983	▲	283
ఎఫ్‌టీఎస్ఈ 100	7,453	▲	76
డాక్స్	14,422	▲	42
షాంఘై	3,089	▲	4
నికాయ్	28,115	▲	171

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో	
ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	
52,513 ▲	107
బంగారం (99.5 స్వచ్ఛత)	
52,303 ▲	107
వెండి (కేజీ)	
61,551 ▲	1109

డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌తో చేతులు కలిపిన తనిష్క్



హైదరాబాద్: ప్రీమియం స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌తో రిటైల్ జ్యువెలరీ బ్రాండ్ తనిష్క్ చేతులు కలిపింది. వివాహ వేడుకల వేళ ఓటీటీ వేదికగా 'ద గ్రేట్ ఇండియన్ బ్రైడ్' పేరుతో సరికొత్త షోను విడుదల చేయనుంది. దేశంలో భిన్న సంస్కృతి, విభిన్న ప్రాంతాలకు చెందిన ఐదుగురు వధువులు తనిష్క్ కో–బ్రాండ్ రివా రూపొందించిన వివాహ ఆభరణాలను ధరించి తమ పెళ్లి నాటి అనుభూతులను నటి శ్రియా పిల్గాంకర్‌తో పంచుకోనున్నారు. ప్రతి సంప్రదాయానికి ఆభరణం రివా అనే ట్యాగ్‌లైన్‌తో కంటెంట్‌ను అత్యంత సృజనాత్మకంగా డిజైన్ చేశామని టైటాన్ మార్కెటింగ్ జీఎం రంజనీ కృష్ణస్వామి తెలిపారు. ''టైటాన్ వంటి సుప్రసిద్ధ బ్రాండ్‌తో కలిసి పనిచేయడంతో పాటు వినూత్న కథనం ద్వారా సబ్‌స్క్రైబర్లతో మా బంధం మరింత బలపడుతుంది'' అని డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ అధికార ప్రతినిధి పేర్కొన్నారు.

కొత్త కనెక్షన్లలో జియో టాప్

- సెప్టెంబర్‌లో 7.2 లక్షలు పెరిగిన యూజర్లు
- రెండో స్థానంలో భారతీ ఎయిర్‌టెల్



న్యూఢిల్లీ: టెలికం కనెక్షన్లలో జియో ఆధిపత్యం కొనసాగుతోంది. సెప్టెంబర్‌లో కంపెనీ కొత్త యూజర్ల సంఖ్య 7.2 లక్షలు పెరిగింది. 4.12 లక్షల కొత్త యూజర్లతో భారతీ ఎయిర్‌టెల్ రెండో స్థానంలో నిల్చింది. సంక్షోభంలో ఉన్న వొడాఫోన్ ఐడియా కనెక్షన్లు మాత్రం తగ్గుతూనే ఉన్నాయి. సెప్టెంబర్‌లో యూజర్ల సంఖ్య 40 లక్షల మేర తగ్గింది. టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ మంగళవారం విడుదల చేసిన గణాంకాల్లో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం జియో యూజర్లు సెప్టెంబర్‌లో పెరిగినప్పటికీ ఆగస్టుతో పోలిస్తే (32.81 లక్షలు) మాత్రం తగ్గింది. ఇక తాజాగా సెప్టెంబర్‌లో మొత్తం అన్ని టెల్కోల వైర్‌లెస్ యూజర్ల సంఖ్య 36 లక్షల మేర తగ్గింది. ఆగస్టు ఆఖరు నాటికి ఇది 114.91 కోట్లుగా ఉండగా, సెప్టెంబర్ ఆఖరు నాటికి 114.54 కోట్లకు పడిపోయింది.

ఆన్‌లైన్ గేమింగ్‌పై 28 శాతం జీఎస్‌టీ!

ప్రతిపాదించనున్న మంత్రుల కమిటీ



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ గేమింగ్‌పై 28 శాతం జీఎస్‌టీకే రాష్ట్రాల ఆర్థిక మంత్రులు సుముఖత చూపిస్తున్నారు. అది గేమ్ లేక నైపుణ్యం లేక మరొకటి అయినా 28 శాతం జీఎస్‌టీ రేటు ఉండాలని కోరుతున్నారు. 28 శాతం జీఎస్‌టీ ప్రతికూలమని, తక్కువ పన్ను రేటునే కొనసాగించాలని పరిశ్రమ కోరుతుండడం గమనార్హం. ఆన్‌లైన్ గేమింగ్, క్యాసినోలు, గుర్రపు పందేలపై పన్ను రేటు పెంపు దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉండిపోయిన నేపథ్యంలో.. దీనిపై మేఘాలయ ముఖ్యమంత్రి సంగ్మా మంగళవారం వర్చువల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెజారిటీ రాష్ట్రాల ఆర్థిక మంత్రులు ఆన్‌లైన్ గేమింగ్‌పై పన్ను రేటును 28 శాతానికి పెంచాలని డిమాండ్ చేసినట్టు తెలిసింది. దీంతో మంత్రుల గ్రూప్ ఈ సూచనలను జీఎస్‌టీ మండలికి నివేదించనుంది. తదుపరి జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశం ఈ సూచనలపై చర్చించి తుది నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆన్‌లైన్ గేమింగ్‌పై 18 శాతం జీఎస్‌టీ రేటు అమల్లో ఉంది. స్థూల గేమింగ్ ఆదాయంపై ఈ పన్ను అమలు చేస్తున్నారు.

డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్‌పై అమెరికాలో దావా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రెవ్‌లిమిడ్ ఔషధానికి సంబంధించి డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ (డీఆర్‌ఎల్)తో పాటు సెల్‌జీన్, బ్రిస్టల్ మయర్స్ స్క్విబ్ తదితర దేశీ జనరిక్ ఔషధ కంపెనీలపై అమెరికాలో యాంటీ–ట్రస్ట్ దావా దాఖలైంది. రెవ్‌లిమిడ్ పేటెంట్ వివాద పరిష్కార విషయంలో ఆయా సంస్థలు వ్యవహరించిన తీరును తప్పుబడుతూ నవంబర్ 18న ఈ దావా దాఖలైనట్లు డీఆర్‌ఎల్ వెల్లడించింది. తమపై ఆరోపణల్లో ఎలాంటి పస లేదని, లిటిగేషన్‌ను దీటుగా ఎదుర్కొంటామని డీఆర్‌ఎల్ స్పష్టం చేసింది.

వేదాంత డివిడెండ్ రూ.17.50

మూడో మధ్యంతర డివిడెండ్‌కు నిర్ణయం



న్యూఢిల్లీ: మైనింగ్ కంపెనీ వేదాంత లిమిటెడ్ మరోసారి భారీ డివిడెండ్‌ను వాటాదారులకు ప్రకటించింది. ఒక్కో షేరుకు రూ.17.50 చొప్పున 2022–23 సంవత్సరానికి మూడో మధ్యంతర డివిడెండ్ ఇవ్వాలని మంగళవారం నాటి బోర్డు సమావేశంలో నిర్ణయించింది. ఈ రూపంలో కంపెనీ రూ.6,505 కోట్లను చెల్లించనుంది. సెప్టెంబర్ 30 నాటికి కంపెనీ స్థూల రుణ భారం రూ.58,597 కోట్లుగా ఉంది. రుణాలు తీర్చడానికి బదులు వాటాదారులకు భారీ మొత్తంలో డివిడెండ్ ఇవ్వడానికి కంపెనీ ప్రాధాన్యం ఇవ్వడం గమనించాలి. ఎందుకంటే కంపెనీలో ప్రమోటర్లకు పెద్ద మొత్తంలో వాటా ఉంది. దీంతో డివిడెండ్ రూపంలో ప్రమోటర్లకు పెద్ద మొత్తంలో నిధులు సమకూరనున్నాయి. డివిడెండ్ చెల్లింపునకు రికార్డ్ తేదీగా నవంబర్ 30ని ప్రకటించింది. వేదాంత లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మొదటి మధ్యంతర డివిడెండ్ కింద రూ.31.50, రెండో మధ్యంతర డివిడెండ్ కింద రూ.19.50 చొప్పున ఇవ్వడం గమనించాలి. ఈ మొత్తం కలిపి చూస్తే ఏడాది కాలంలో రూ.68.50 వరకు డివిడెండ్ కింద ఇచ్చినట్టయింది.

40 లక్షల కోట్ల డాలర్లకు భారత్!

- 2047 నాటికి ఎకానమీ 13 రెట్లు వృద్ధి
- డిజిటలీకరణ, స్వచ్ఛ ఇంధన విప్లవాల దన్ను
- రిలయన్స్ చీఫ్ ముకేశ్ అంబానీ వెల్లడి



న్యూఢిల్లీ: స్వచ్ఛ ఇంధనం, డిజిటలీకరణ విప్లవాల దన్నుతో 2047 నాటికి భారత ఎకానమీ 13 రెట్లు వృద్ధి చెందనుందని పారిశ్రామిక దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ ధీమా తెలిపారు. అప్పటికి భారత ఆర్థిక వ్యవస్థ 40 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరగలదని చెప్పారు. పండిట్ దీనదయాళ్ ఎనర్జీ విశ్వవిద్యాలయం 10వ స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా అంబానీ ఈ విషయాలు తెలిపారు. వినియోగం, సామాజిక–ఆర్థిక సంస్కరణల ఊతంతో 2050 నాటికి భారత్ 30 లక్షల కోట్ల డాలర్ల ఎకానమీగా ఎదుగుతుందంటూ అదానీ గ్రూప్ చీఫ్ గౌతమ్ అదానీ ఇటీవలే పేర్కొన్న నేపథ్యంలో ముకేశ్ అంబానీ తాజా అంచనాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'ప్రస్తుతం 3 లక్షల కోట్ల (ట్రిలియన్) డాలర్లుగా ఉన్న భారత ఎకానమీ 2047 కల్లా 40 ట్రిలియన్ డాలర్లకు చేరుతుంది. ప్రపంచంలోనే టాప్ 3 ఆర్థిక వ్యవస్థల్లో ఉంటుంది' అని అంబానీ చెప్పారు. అమృత కాలంలో దేశంలో ఆర్థిక వృద్ధి, అవకాశాలు అసాధారణ స్థాయిలో పెరుగుతాయని ఆయన తెలిపారు. (2022 – 2047 మధ్య కాలాన్ని అమృత కాలంగా వ్యవహరిస్తున్నారు. 2047 నాటికి భారత్‌కు స్వాతంత్ర్యం లభించి వందేళ్లవుతుంది.)

మూడు విప్లవాల ఊతం..

'రాబోయే దశాబ్దాల్లో భారత వృద్ధిలో మూడు విప్లవాలు కీలకపాత్ర పోషించనున్నాయి. అవేమిటంటే.. స్వచ్ఛ ఇంధన విప్లవం, జీవ ఇంధన విప్లవం, డిజిటల్ విప్లవం. పర్యావరణ అనుకూల ఇంధనాన్ని ఉత్పత్తి చేసేందుకు మొదటి రెండూ ఉపయోగపడనుండగా, ఇంధనాన్ని సమర్థమంతంగా వినియోగించుకునేందుకు మూడోది ఉపయోగపడుతుంది. మన గ్రహాన్ని వాతావరణ సంక్షోభాల నుండి కాపాడుకోవడంలో భారత్‌కు, ప్రపంచానికి ఈ మూడూ తోడ్పడతాయి' అని అంబానీ చెప్పారు.

విద్యార్థులకు విజయ సూత్రాలు..

విజయాలు సాధించాలంటే మూడు సూత్రాలను ప్రధానంగా దృష్టిలో ఉంచుకోవాలని విద్యార్థులకు అంబానీ సూచించారు. ఆలోచనల స్థాయి గొప్పగా ఉండాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, డిజిటలీకరణపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. భారత్‌ను అంతర్జాతీయంగా స్వచ్ఛ ఇంధన లీడరుగా తీర్చిదిద్దడంలో ఈ మూడు సూత్రాలు తోడ్పడగలవని అంబానీ చెప్పారు. పండిట్ దీన్‌దయాళ్ ఎనర్జీ వర్సిటీ గవర్నర్ల బోర్డుకు అంబానీ ప్రెసిడెంటుగా వ్యవహరిస్తున్నారు.

టాటా చంద్రశేఖరన్‌కు ప్రశంసలు..

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టాటా గ్రూప్ చైర్‌పర్సన్ ఎన్ చంద్రశేఖరన్‌ను ముకేశ్ అంబానీ ఈ సందర్భంగా ప్రశంసించారు. తన దార్శనికత, దృఢ విశ్వాసం, అపార అనుభవంతో చంద్రశేఖరన్ ఇటీవలి కాలంలో టాటా గ్రూప్ అద్భుత వృద్ధి సాధించేలా నడిపిస్తున్నారని కితాబిచ్చారు. మరోవైపు, ప్రపంచమంతా స్వచ్ఛమైన, పర్యావరణ అనుకూల ఇంధనాలకు మళ్లక తప్పదని చంద్రశేఖరన్ తెలిపారు. ఈ విషయంలో సారథ్యం వహించేందుకు భారత్‌కి తగు సామర్థ్యాలు ఉన్నాయని ఆయన చెప్పారు.

మూడు రోజుల తర్వాత లాభాలు

- సెన్సెక్స్ 274 పాయింట్లు ప్లస్
- 18,200 పైకి నిఫ్టీ
- రియల్టీ షేర్లకు మాత్రమే నష్టాలు



ముంబై: దేశీయ స్టాక్ సూచీలు మూడు రోజుల నష్టాల నుంచి గట్టెక్కాయి. ఐటీ, మెటల్, వినిమయ రంగ షేర్లు రాణించడంతో మంగళవారం సెన్సెక్స్ 274 పాయింట్లు బలపడి 61,419 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 84 పాయింట్లు పెరిగి 18,244 వద్ద నిలిచింది. ప్రపంచ మార్కెట్లలోని సానుకూలతలు, ఫారెక్స్ మార్కెట్లో రూపాయి రికవరీ అంశాలు కలిసొచ్చాయి. ఇటీవల మార్కెట్ పతనంతో కనిష్టాలకు దిగివచ్చిన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. రియల్టీ షేర్లు మాత్రమే నష్టాలను చవిచూశాయి సెన్సెక్స్ ఉదయం 18 పాయింట్ల నష్టంతో 61,127 వద్ద, నిఫ్టీ 19 పాయింట్లు పెరిగి 18,179 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. తొలుత అమ్మకాల ఒత్తిడితో కాస్త తడబడినా.., తర్వాత కోలుకుని ట్రేడింగ్ ఆద్యంతం స్థిరమైన ర్యాలీ చేశాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 322 పాయింట్లు బలపడి 61,467 వద్ద, నిఫ్టీ 102 పాయింట్లు దూసుకెళ్లి 18,262 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు, యూఎస్ స్టాక్ ఫ్యూచర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.636.39 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్ల రూ.698 కోట్ల షేర్లను కొన్నారు.

▪ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల విక్రయ సంస్థ కేన్స్ టెక్నాలజీ ఇండియా లిస్టింగ్ మెప్పించింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.587)తో పోలిస్తే 32% ప్రీమియంతో రూ.775 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 34% దూసుకెళ్లి రూ.787 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. ఆఖర్లో లాభాల స్వీకరణతో 18% లాభంతో రూ.690 వద్ద స్థిరపడింది.

బిహార్‌లో మేఘా ప్రాజెక్టు పూర్తి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగ దిగ్గజం మేఘా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (ఎంఈఐఎల్) బిహార్‌లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మంచి నీటి సరఫరా ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేసింది. హర్ ఘర్ గంగాజల్ మొదటి దశ పనులతో ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన బోధ్‌గయా, గయా, రాజ్‌గిర్ నగరాల తాగునీటి కష్టాలు తీరిపోనున్నాయి. శుద్ధి చేసిన గంగాజలాలు ఇకపై ఈ ప్రాంత ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయి. భౌగోళిక పరిస్థితుల కారణంగా గంగా నదీ జలాలు అందుబాటులో లేని ఈ ప్రాంతాలకు వరద నీటిని తాగునీరుగా మార్చేందుకు బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వరద నీటిని ఎత్తిపోతల ద్వారా రిజర్వాయర్లలో నింపి, శుద్ధిచేసి 365 రోజులు ప్రజలకు తాగునీరు సరఫరా చేసేలా ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ప్రాజెక్టులో భాగంగా 151 కిలోమీటర్ల పొడవు పైప్‌లైన్, నాలుగు వంతెనలతోపాటు రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మించారు.

భవిత

- ప్రభుత్వ ఉద్యోగాల సమాచారం- జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

డైలీ కరెంట్ అఫైర్స్
అన్ని పోటీ పరీక్షలకు ఉపయోగపడే కీలకమైన 'డైలీ కరెంట్ అఫైర్స్' కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

డీఎంహెచ్‌వో, ప్రకాశం జిల్లాలో 18 పోస్టులు

ప్రకాశం జిల్లాలోని వైఎస్సార్ అర్బన్ క్లినిక్/యూపీహెచ్‌సీల్లో ఒప్పంద/ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 18
» **పోస్టుల వివరాలు:** మెడికల్ ఆఫీసర్లు/సీఏఎస్–07, ఫార్మసిస్ట్ గ్రేడ్2–02, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్2–04, లాస్ట్ గ్రేడ్ సర్వీసెస్–05.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఎంబీబీఎస్, డీఫార్మసీ/బీఫార్మసీ, డిప్లొమా, బీఎస్సీ(ఎంఎల్‌టీ) ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును వ్యక్తిగతంగా లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయం, జీజీహెచ్ కాంపౌండ్, ఒంగోలు, ప్రకాశం జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 26.11.2022
» **వెబ్‌సైట్:** prakasam.ap.gov.in

ప్రకాశం జిల్లాలో మెడికల్ ఆఫీసర్, స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులు

ప్రకాశం జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి కార్యాలయం ఒంగోలు(జీఎంసీ), మార్కాపూర్‌లోని టెలీ మెడిసిన్ హబ్‌లలో ఒప్పంద/ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08
» **పోస్టుల వివరాలు:** మెడికల్ ఆఫీసర్–03, స్పెషలిస్ట్ డాక్టర్(గైనకాలజిస్ట్)–01, స్పెషలిస్ట్ డాక్టర్(జనరల్ ఫిజీషియన్)–02, స్పెషలిస్ట్ డాక్టర్(పీడియాట్రిక్స్)–02.
» **అర్హత:**ఎంబీబీఎస్,పీజీ,డిప్లొమా,ఎండీ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును వ్యక్తిగతంగా లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి కార్యాలయం,జీజీహెచ్ కాంపౌండ్, ఒంగోలు, ప్రకాశం జిల్లా చిరునామకు పంపించాలి. దరఖాస్తులకు చివరితేది: 26.11.2022
» **వెబ్‌సైట్:** prakasam.ap.gov.in

పీజీసీఐఎల్, న్యూఢిల్లీలో 800 ఫీల్డ్ ఇంజనీర్, సూపర్‌వైజర్ పోస్టులు

న్యూఢిల్లీలోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్.. ఆర్‌డీ సెక్టార్ రీఫార్మ్ స్కీమ్(ఆర్‌డీఎస్‌ఎస్)లో.. నియామక ప్రక్రియలో భాగంగా ఒప్పంద/తాత్కాలిక ప్రాతిపదికన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 800
» **పోస్టుల వివరాలు:** ఫీల్డ్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)–50, ఫీల్డ్ ఇంజనీర్ (ఎలక్ట్రానిక్స్–కమ్యూనికేషన్)–15, ఫీల్డ్ ఇంజనీర్(ఐటీ)–15, ఫీల్డ్ సూపర్‌వైజర్(ఎలక్ట్రికల్)–480, ఫీల్డ్ సూపర్‌వైజర్ (ఎలక్ట్రానిక్స్ –కమ్యూనికేషన్)–240.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ/బీటెక్, బీఎస్సీ(ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 29 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు ఫీల్డ్ ఇంజనీర్ పోస్టులకు రూ.30,000 నుంచి రూ.1,20,000; ఫీల్డ్ సూపర్‌వైజర్ పోస్టులకు రూ.23,000 నుంచి రూ.1,05,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామ్, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పణ, ఫీజు చెల్లింపు చివరితేది:** 11.12.2022.
» **వెబ్‌సైట్:** www.powergrid.in

బీడీఎల్, సంగారెడ్డిలో 119 అప్రెంటిస్‌లు

సంగారెడ్డి జిల్లా భానూర్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్).. అప్రెంటిస్‌షిప్ శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 119
» **ఖాళీల వివరాలు:** టెక్నీషియన్ అప్రెంటిస్–83, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్–36.
» **విభాగాలు:** మెకానికల్, సీఎస్ఈ/ఐటీ, ఈసీఈ, ఈఈఈ, సివిల్, ఈఐఈ, కెమికల్.
» **అర్హత:** సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా/డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ. 9000, టెక్నీషియన్ అప్రెంటిస్‌లకు రూ.8000. **శిక్షణ వ్యవధి:** ఒక సంవత్సరం.
» **బీడీఎల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తుకు చివరితేది:** 30.11.2022
» **వెబ్‌సైట్:** bdl-india.in

వీఎంఎంసీ సఫ్దర్‌జంగ్ హాస్పిటల్, న్యూఢిల్లీలో 299 జూనియర్ రెసిడెంట్ పోస్టులు

న్యూఢిల్లీలోని వర్ధమాన్ మహావీర్ మెడికల్ కాలేజ్–సఫ్దర్‌జంగ్ హాస్పిటల్.. వివిధ విభాగాల్లో జూనియర్ రెసిడెంట్(నాన్–పీజీ) ఎంబీబీఎస్–బీడీఎస్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 299
» **అర్హత:**ఎంబీబీఎస్,బీడీఎస్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **జీతం:** నెలకు రూ.56,100 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా.
» **దరఖాస్తులకు చివరితేది:** 28.11.2022
» **వెబ్‌సైట్:** vmmcsjh.nic.in

5జీ.. కొలువులు ఈజీ!

» రానున్న కాలంలో కొలువులకు కేరాఫ్‌గా 5జీ
» టెలికం,హెల్త్‌కేర్,ఎడ్‌టెక్ సంస్థల్లో అవకాశాలు
» ఇండస్ట్రీ 4.0 స్కిల్స్‌తో సొంతం చేసుకునే వీలు

5జీ టెక్నాలజీ..టెలికం రంగంలో సరికొత్త విప్లవం! స్మార్ట్ ఫోన్ యుగంలో.. ఆధునిక 5జీ టెక్నాలజీతో.. గేమింగ్ నుంచి గృహ అవసరాల వరకు..అన్ని రకాల సేవలు అత్యంత వేగంగా పొందే వీలుంది. ఇదే ఇప్పుడు ఆయా రంగాల విస్తరణకు, లక్షల సంఖ్యలో కొత్త కొలువులకు మార్గం వేస్తుందని అంచనా! ఆయా ఉద్యోగాలు సొంతం చేసుకునేందుకు కావలసిందల్లా.. ఈ సాంకేతికతను నడిపించే ఆధునిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవడమే! ముఖ్యంగా 4.0 స్కిల్స్‌గా పేర్కొంటున్న ఐఓటీ, రోబోటిక్స్, ఏఐ-ఎంఎల్ వంటి నైపుణ్యాలతో ఉజ్వల కెరీర్ అవకాశాలు అందుకోవచ్చు. ఇటీవల దేశంలో 5జీ సేవలు ప్రారంభమైన నేపథ్యంలో.. ఈ టెక్నాలజీతో అందుబాటులోకి రానున్న కొత్త కొలువులు, కావల్సిన నైపుణ్యాల గురించి తెలుసుకుందాం..



5జీ టెక్నాలజీతో మొబైల్ ఆధారిత సేవలు మరింత విస్తృతం కానున్నాయి. ఈ టెక్నాలజీతో స్మార్ట్‌ఫోన్స్ ద్వారా అత్యంత వేగంగా అనేక సేవలు పొందొచ్చు. అంతేకాదు.. ట్రాఫిక్ చిక్కులు దాటుకుంటూ ఇంటికెళ్లే సమయానికి హాయిగా ఏసీలో ఆహ్లాదం పొందాలంటే..ఇక చిటికెలో పని. కేవలం ఫోన్ ద్వారా నిర్దేశిత కమాండ్స్‌తో మనం ఇంటికెళ్లే సమయానికి ఏసీ ఆన్ అయ్యే విధంగా చేసుకోవచ్చు. ఇలాంటి ఎన్నో సేవలు సరికొత్తగా అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నారు. ఆయా సేవలు అందించేందుకు బ్యాక్ ఎండ్‌లో నిపుణుల అవసరం ఏర్పడుతోంది. ఇదే యువతకు కొత్త కొలువులకు మార్గంగా నిలవనుంది.

భారీ సంఖ్యలో కొలువులు

- 5జీ టెక్నాలజీ కారణంగా రానున్న మూడేళ్లలో 2.2 కోట్ల మేర ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని ఇప్పటికే టెలికం సెక్టార్ స్కిల్ కౌన్సిల్ నివేదిక పేర్కొంది.
- ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ విభాగాల్లో ఈ కొలువులు లభించనున్నాయి.
- ఇప్పటికే 40 లక్షల మేర ఉద్యోగాలకు వేదికగా ఉన్న టెలికం రంగంలో.. 5జీ టెక్నాలజీ కారణంగా జాబ్స్ సంఖ్య మరింత విస్తృతంగా పెరగనుంది. • టెలికం సెక్టార్ మాత్రమే కాకుండా.. నూతన టెక్నాలజీలతో సేవలందిస్తున్న ఇతర రంగాల్లోని సంస్థలు కూడా 5జీ టెక్నాలజీస్‌కు సరితూగే నైపుణ్యాలున్న వారికి అవకాశాలు కల్పించనున్నాయి.
- రిమోట్ సర్వీసెస్‌కు వినియోగదారుల నుంచి డిమాండ్ పెరుగుతోంది. దీనికి అనుగుణంగా తమ సేవలను అందించే ఉద్దేశంతో 5జీ టెక్నాలజీ నైపుణ్యాలకు కంపెనీలు పెద్ద పీట వేస్తున్నాయి.

అన్ని రంగాల్లోనూ 5జీ

- వ్యవసాయం నుంచి వైద్యం వరకూ..అన్ని రంగాల్లోనూ 5జీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కార్యకలాపాలు నిర్వహించే అవకాశం ఉంది.
- హెల్త్‌కేర్ రంగంలో.. ఇప్పటికే స్మార్ట్‌ఫోన్ ద్వారా టెలి మెడిసిన్ సేవలు అందుతున్న సంగతి తెలిసిందే. 5జీ టెక్నాలజీతో రానున్న రోజుల్లో కీలకమైన శస్త్రచికిత్సలు చేసే అవకాశం కూడా అందుబాటులోకి రానుంది. అదే విధంగా 3–డీ ఎక్స్‌రేలు, ఇతర స్కానింగ్‌లు కూడా తీసే వీలుంటుంది. • వ్యవసాయ రంగంలో.. 5జీ ఫోన్‌లో ఉండే ఐఓటీ సాంకేతికత ఆధారంగా.. వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తూ.. వాటికి సరితూగే పంటలు వేయడం లేదా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ సాగులో దిగుబడి పెంచేందుకు అవకాశం ఉంటుంది. • రిటైల్ రంగంలోనూ.. 5జీ ఫోన్లతో.. వర్చువల్, ఆగ్మెంటెడ్ రియాల్టీని ఆస్వాదిస్తూ ఏదైనా ఒక వస్తువు లేదా ఉత్పత్తిని కళ్లకు కట్టినట్లు చూసుకోవడానికి.. అదే విధంగా.. ఆయా ఉత్పత్తుల నాణ్యతను లోతుగా పరిశీలించడానికి వీలవుతుంది.

ఐఓటీ ఆధారమే

5జీ టెక్నాలజీని వైద్యం,రిటైల్,ఫార్మా.. ఇలా అన్ని రంగాల్లోనూ విస్తృతంగా వినియోగించడానికి కారణం.. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ మహిమే. ఐఓటీ టూల్స్‌గా పేర్కొనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్, మెషీన్ లెర్నింగ్ వంటి సాంకేతికతలను 5జీ కారణంగా సంస్థలతోపాటు వ్యక్తులూ వినియోగించుకునే అవకాశం ఉంది.

క్లౌడ్ సర్వీసెస్ వయా 5జీ

క్లౌడ్ కంప్యూటింగ్ అంటే.. ఇంటర్నెట్ లేదా ఆన్‌లైన్ ద్వారా సాఫ్ట్‌వేర్ సర్వీస్‌లను అందించడం! ఇప్పుడు ఈ క్లౌడ్ కంప్యూటింగ్ స్మార్ట్ ఫోన్లలోనూ కనిపిస్తోంది. ఉదాహరణకు.. పలు హైఎండ్ ఫోన్లలో అందుబాటులో ఉంటున్న ఎంఎస్ ఆఫీస్ టూల్స్, పీడీఎఫ్ వ్యూయర్స్, పీడీఎఫ్ డ్రైవ్స్‌ను అప్పటికప్పుడు స్మార్ట్ ఫోన్‌లోనే పొందే అవకాశం లభిస్తోంది. ఫలితంగా యూజర్లు తాము డౌన్‌లోడ్ చేసుకున్న విభిన్న వెర్షన్ల డాక్యుమెంట్లను ఎలాంటి ప్రీ–లోడెడ్ సాఫ్ట్‌వేర్ లేకుండానే వీక్షించే సదుపాయం కలుగుతోంది.

రోబో ఆధారిత సేవలు

పారిశ్రామిక రంగంలో ఇటీవల కాలంలో రోబోటిక్ టెక్నాలజీ కీలకంగా మారుతోంది. రోబో ఆధారిత కార్యకలాపాలు, సేవలు విస్తృతంగా వినియోగంలోకి వస్తున్నాయి. ఈ సేవలను వ్యక్తుల స్థాయిలోనే పొందేందుకు 5జీ ఫోన్లు ఉపకరిస్తాయి. ఉదాహరణకు.. 5జీ స్మార్ట్‌ఫోన్స్‌లో ఉండే నిర్దిష్టమైన సెన్సార్లు, డిస్ట్రిబ్యూటెడ్ నెట్‌వర్క్ సాంకేతికతల ఆధారంగా ఎక్కడో సుదూరాల్లో ఉన్న రోబోల సాయంతో సర్జరీలు చేసే అవకాశం లభించనుంది.

కృత్రిమ మేధ

5జీ టెక్నాలజీస్‌కు సంబంధించి ఇప్పుడు ఎంతో కీలకంగా నిలుస్తున్న మరో సాంకేతిక పరిజ్ఞానం.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(కృత్రిమ మేధ). మానవ ప్రమేయం లేకుండానే రోబోలు, మెషీన్లతో పని పూర్తి చేసే టెక్నాలజీ ఇది. ఇప్పుడు బీఎఫ్ఎస్ఐ నుంచి టెక్నాలజీ కంపెనీల వరకూ..అన్నీ ఏఐకు ప్రాధాన్యమిస్తున్నాయి. వినియోగదారులకు వేగంగా సేవలందించడం, తద్వారా మార్కెట్ పోటీలో ముందంజలో నిలవడానికి వీలవుతుందని భావించడమే ఇందుకు కారణం. ఉత్పత్తులు, సేవలు అందించే క్రమంలో డిజిటల్ సేవలు.. 5జీ ఫోన్స్‌లోనే అందుబాటులో ఉండేలా మొబైల్ సర్వీస్ ప్రొవైడర్స్ తమ ఉత్పత్తులను రూపొందిస్తున్నారు.

నిపుణుల కొరత

5జీ సేవలు అందించాలనుకుంటున్న సంస్థలు నిపుణులైన మానవ వనరుల కొరత సమస్యను ఎదుర్కొంటున్నాయి. పలు కంపెనీలు రీ–స్కిల్లింగ్ పేరుతో 5జీ టెక్నాలజీస్‌పై తమ ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణనిస్తున్నాయి. టాటా సన్స్‌కు చెందిన పానటోన్ ఫిన్‌వెస్ట్ లిమిటెడ్.. తేజస్ నెట్‌వర్క్‌తో ఒప్పందం చేసుకుని శిక్షణనిస్తోంది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ సంస్థ కూడా తమ ఇంజనీరింగ్, ఆర్ అండ్ డీ విభాగం ద్వారా 5జీ టెక్నాలజీస్‌పై ఉద్యోగులకు శిక్షణ అందిస్తోంది.

నైపుణ్యం పొందే మార్గాలివే

- 5జీ టెక్నాలజీకి సంబంధించి నైపుణ్యాలు పొందేందుకు ఎన్నో మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా 5జీ టెక్నాలజీలో కీలకంగా నిలుస్తున్న రోబోటిక్స్, ఏఐ–ఎంఎల్, క్లౌడ్ కంప్యూటింగ్, ఐఓటీ స్కిల్స్‌ను సొంతం చేసుకునేందుకు పలు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ శిక్షణ మార్గాలు ఉన్నాయి.
- టెలికం సెక్టార్ స్కిల్ కౌన్సిల్, సిస్కో, ఒరాకిల్ ఇండియా, ఐబీఎం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ ఆధ్వర్యంలో పలు ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయి.
- ఐఐటీ–రూర్కీ, ఢిల్లీ కూడా సర్టిఫికెట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ స్థాయిలో 5జీ టెక్నాలజీ అండ్ ఐఓటీ కోర్సులను అందిస్తున్నాయి.
- కోర్స్‌ఎరా, ఉడెమీ తదితర సంస్థలు సైతం మూక్స్ విధానంలో 5జీ టెక్నాలజీస్, ఐఓటీ సంబంధిత కోర్సులను అందిస్తున్నాయి.

జాబ్ ప్రొఫైల్స్

5జీ టెక్నాలజీకి సంబంధించి నైపుణ్యాలు సొంతం చేసుకున్న వారికి..యుఐ డిజైన్స్, నెట్‌వర్కింగ్ ఇంజనీర్స్, ఏఐ–ఎంఎల్ ఇంజనీర్స్, సైబర్ సెక్యూరిటీ ఇంజనీర్స్,డేటా అనలిస్ట్ వంటి ఉద్యోగాలు లభిస్తున్నాయి. ప్రారంభంలోనే వార్షిక వేతనం సగటున రూ.6లక్షల నుంచి రూ.8లక్షల వరకు ఉంటోంది.

5జీ టెక్నాలజీస్.. ముఖ్యాంశాలు

- పలు రిక్రూటింగ్, స్టాఫింగ్ సంస్థల నివేదికల ప్రకారం–ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో 5జీ కొలువుల్లో 20 నుంచి 25 శాతం మేరకు పెరుగుదల.
- అంతర్జాతీయ సంస్థల అంచనా ప్రకారం–వచ్చే పదేళ్లలో 20 మిలియన్లకు పైగా ఉద్యోగాలు.
- టెలికం సెక్టార్ స్కిల్ కౌన్సిల్ అంచనా ప్రకారం –2025 నాటికి 2.2 మిలియన్ల జాబ్స్.
- టెలికం రంగంలోనే ఈ ఏడాది దాదాపు లక్ష ఉద్యోగాలు.
- 2021లో సిస్కో ఇండియా నియామకాల్లో 30 శాతంపైగా 5జీ టెక్నాలజీ విభాగంలోనే ఉన్నాయి.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.